: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM
శ్రీకాకుళం

Published from Srikakulam, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

16-10-2026 శుక్రవారం
సంపుటి: 32 సంచిక: 257
పేజీలు: 16
వెల: 6.50

# మహిళల ఆదాయార్జన

# దేశ ఆర్థిక సమృద్ధికి దోహదం!



**స్వయం సహాయక సంఘాలతో మహిళల జీవితాల్లో మార్పు**

**ఆర్థికంగా సాధికారిత సాధించారు**

**వనితలు ఇక లక్ పతీ దీదీలుగా కాదు కరోడ్ పతీ దీదీలుగా మారాలి, మార్చాలి**

**రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆకాంక్ష**

**త్వరలో తెలుగు భాష నేర్చుకుంటా**

**విజయవాడలో 'జాతీయ సరస్ మేళ్లాను ప్రారంభించిన దేశ ప్రథమ పౌరురాలు**

**సరస్ మేళాలో స్టాళ్ల పరిశీలన**

**చీర కొనుగోలు.. డిజిటల్ చెల్లింపు**

**లక్ పతీ దీదీలతో సహపంక్తి భోజనం**



గురువారం విజయవాడలో జాతీయ సరస్ మేళాలో స్టాళ్లను పరిశీలిస్తున్న రాష్ట్రపతి ముర్ము. చిత్రంలో గవర్నర్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్

### తెలుగు నేర్చుకుంటా!

'మహిళలు సాంకేతికంగా, ఆర్థిక అంశాల్లో పెద్ద ఎత్తున భాగస్వామ్యం వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఒడిశా రాష్ట్రానికి పక్కనే ఉన్నా తెలుగు భాషలో మాట్లాడలేకపోతున్నా.. త్వరలోనే తెలుగు భాషను కూడా నేర్చుకుని మాట్లాడేందుకు వస్తానని హామీ ఇస్తున్నా.. మహిళలను ఇక లక్ పతీ దీదీలుగా కాదు కరోడ్ పతీ దీదీలుగా మారాలి... మార్చాలి.'

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**విజయవాడ, అక్టోబరు 15, ప్రభాతవార్తప్రతినిధి:** మహిళల ఆదాయార్జన, దేశ ఆర్థిక సమృద్ధికి దోహదపడుతుందని భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూ స్పష్టం చేసారు.మహిళలు ఆర్థిక రంగాల్లో సాధించే ప్రగతి దేశ మహిళల ఆర్థిక వికాసానికి దోహదపడుతుందన్నారు. మహిళల స్వశక్తీకరణకు ప్రధాని మోడీ కృషిచేస్తున్నారు. 2047కంటే ముందే వికసిత్ భారత్ స్వప్నం సాకారమవుతుంది అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముఅన్నారు. విజయవాడలో జాతీయ సరస్ మేళా కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. అనంతరం సరస్ మేళాలో స్టాళ్లను పరిశీలించారు. స్టాల్‌లో చీర కొనుగోలు చేసి డిజిటల్ చెల్లింపులు చేశారు. ఉత్పత్తుల ప్రత్యేకతలపై డ్వాక్రా మహిళలను అడిగి తెలుసుకున్నారు. సహజ ఉత్పత్తులు,చేనేతవస్తువులు, హ్యాండీక్రాఫ్ట్స్ లను రాష్ట్రపతి వీక్షించారు.ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్, రామ్మోహన్ పాల్గొన్నారు. దీంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.
డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనకు 650 స్టాళ్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో తొలిసారిగా జాతీయ సరస్ మేళా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్వయం ఎపి బ్రాండ్ పేరుతో ఉత్పత్తులకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుంది. నేటి నుంచి ఈనెల 31 వరకు 14 రోజులపాటు సరస్ మేళా కార్యక్రమం ఉంటుంది.ఈ క్రమంలో మేళాను ప్రారంభించిన అనంతరం భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూ స్ఫూర్తిదాయక ప్రసంగం చేస్తూ దేవీ శరన్నవరాత్రుల వేళ, కనకదుర్గమ్మసన్నిధిలో ఈ సరస్ మేళా ఏర్పాటు >>2



## ఉపాధి కేంద్రాలుగా గ్రామాలు

మహిళా శక్తికి వేదికగా సరస్ మేళా2026

మహిళా సాధికారతే వికసిత్ భారత్‌కు పునాది

గ్రామీణ మహిళల ఉత్పత్తులకు 'స్వయం ఎప్పి బ్రాండ్

సరస్ మేళా ప్రారంభోత్సవ సభలో సిఎం చంద్రబాబు

2లో



## ఆంధ్రను ఉద్యానవన హబ్‌గా సిఎం తీర్చిదిద్దుతున్నారు

లక్ పతి దిదీలను తీర్చిదిద్దటంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది: కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్

# స్వేచ్ఛగా స్థానిక పోరు

**నిష్పక్షపాతంగా నిర్వహించాలి**

**రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా**

**ఎన్నికల సాధారణ పరిశీలకులుగా 28 మంది నియామకం**



గురువారం అమరావతిలో ఎన్నికల నిర్వహణపై అధికారులతో ఎస్ఇసి అనిల్ చంద్ర పునేఠా

**అమరావతి, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా సాధారణ పరిశీలకులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు జిల్లాకు ఒక అధికారి చొప్పున 28 మంది మంది ఐఎఎస్ అధికారులను సాధారణ పరిశీలకులుగా నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి పరిశీలకులకు ఆయన పలు సూచనలు చేశారు.ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని ఎన్నికల కమిషనర్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో అనుసరించే విధానాలను స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పాటించాలని, రాజకీయ ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించకుండా పరిశీలకులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే ఘటనలపై అప్రమత్తంగా ఉంటూ, నిబంధనల అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. ఎన్నికల నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం పోల్ మేనేజ్‌మెంట్ యాప్‌ను రూపొందించిందని అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. ఈ యాప్ ద్వారా ఓటర్ల నిర్వహణ, పోలింగ్ కేంద్రాల వివరాలు, ఎన్నికల నిర్వహణ విధానాలు తదితర సమాచారాన్ని అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని పరిశీలకులకు సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు యంత్రాంగంతో >>2



శ్రీ లలితా త్రిపురసుందరిగా

## కనకదుర్గమ్మ

**అమ్మకు స్వర్ణకిరీటం**

**బంగారు, వెండి పాదుకలు**

**ఇంద్రకీలాద్రి, అక్టోబరు 15, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఐదో రోజైన గురువారం శ్రీ లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. పరాశక్తి స్వరూపిణిగా, శ్రీచక్ర అధిష్ఠానశక్తిగా పూజలందుకునే అమ్మవారి దివ్య అలంకారం భక్తులకు బంగారు వర్ణపు చీరలో ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తూ అనుగ్రహించారు. చెరకు విల్లు, పుష్పబాణాలు, పాశాంకుశాలను ధరించిన అమ్మవారు >>2



## నవంబరు 12న ముసాయిదా

**జనవరి 4న ఓటర్ల తుది జాబితా**

**కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడి**

**న్యూఢిల్లీ, అక్టోబరు 15:** దేశంలోని 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేకసవరణ చేపట్టాలని భారత ఎన్నికల సంఘం గురువారం ఆదేశించింది. వివాదాస్పద ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లు, కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపింది. ఈ సవరణ పరిధిలో పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, బిహార్, తమిళనాడు సహా మొత్తం 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత >>2

## వాన్‌పిక్ కేసులో కీలక పరిణామం

**బ్రహ్మానందరెడ్డి ప్రాసిక్యూషన్‌కు ప్రభుత్వం అనుమతి**

**విజయవాడ, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీపి అధినేత వైఎస్ జగన్ నిందితుడిగా ఉన్న వాన్‌పిక్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న ఐఎఎస్ బ్రహ్మానందరెడ్డిని ప్రాసిక్యూషన్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వాన్‌పిక్ కేసులో అప్పటి ప్రత్యేక కార్యదర్శి కెవి బ్రహ్మానందరెడ్డిపై మనీలాండరింగ్ కేసులో ప్రాసిక్యూషన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ ప్రభుత్వం జిఒ ఎంఎస్ నంబర్ 221 ఇచ్చింది. వాన్‌పిక్ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఐఎఎస్ బ్రహ్మానందరెడ్డిని విచారిం >>2

## ఈశాన్య రుతుపవనాలొస్తున్నాయ్!

**నాలుగు రోజులు చెదురుమదురు వర్షాలు**

**విజయవాడ, అక్టోబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో ..రాష్ట్రంలో రానున్న నాలుగు రోజులు చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. శుక్రవారం మేఘావృతమైన వాతావరణంతో పాటు పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు.. కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెట్లక్రింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడరాదని హెచ్చరించారు. విజయనగరం, మన్యం, అల్లూరి, కడప,అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి >>2

# ఎపికి కొత్తగా 8 మంది ఐపిఎస్‌లు

**తెలంగాణకు ఇద్దరు: కేంద్రం కేటాయింపు.. రేపు ఐపిఎస్ ప్రొబేషనరీల దీక్షాంత్ పరేడ్**



ఎపి, తెలంగాణకు కొత్తగా కేటాయించిన ఐపిఎస్ అధికారులు వీరే

**హైదరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త:** యువ ప్రొబేషనరీ ఐపిఎస్ అధికారుల దీక్షాంత్ పరేడ్ శనివారం జరగనుంది. శివార్లలోని శివరాంపల్లిలో గల సర్దార్ వల్లభ భాయి పటేల్ జాతీయ పోలీసు అకాడమిలో జరగనున్న ఈ దీక్షాంత్ పరేడ్‌కు కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. 78వ బ్యాచ్ ఐపిఎస్ అధికారులు పాల్గొననున్న ఈ దీక్షాంత్ పరేడ్ కోసం ఇప్పటికే పోలీసు అ కాడమి ముస్తాబయ్యింది. మొత్తం 151 మంది అధికారులు పాల్గొంటున్న ఈ పరేడ్‌లో 16 మంది విదేశీ అధికారులున్నారు. ఈ బ్యాచ్‌లో 37 మంది మహిళా అధికారులున్నారు. కాగా దీక్షాంత్ పరేడ్‌కు సంబంధించి అకాడమి డైరెక్టర్ సుజిత్ పాండే గురువారం మీడియా సమావేశం నిర్వహించి శిక్షణకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. యువ ఐపిఎస్ అధికారులకు 45 వారాల పాటు కఠిన శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. శిక్షణలో భాగంగా బేసిక్ కోర్సుతో పాటు అవుట్ డోర్, ఇండోర్ విభాగాలలో, సైబర్ భద్రత, అంతర్గత భద్రతపై నిపుణులచేత అభ్యర్థులకు శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఇదే సమయంలో యువ అధికారులకు పది వారాల సునిశిత కఠిన శిక్షణ >>2



గురువారం బ్రహ్మోత్సవాల సందర్భంగా సర్వభూపాల వాహనంపై ఊరేగుతున్న మలయప్ప స్వామి

## సర్వభూపాల వాహనంపై రాజాధిరాజు

**తిరుమల, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో అంగరంగ వైభవంగా జరుగుతున్న నవరాత్రి బ్రహ్మోత్సవాలలో గురువారం రాత్రి ఉభయదేవేరులతో కలసి సర్వభూపాల వాహనంపై మలయప్పస్వామి భక్తులను కటాక్షించాడు.. వాహనంముందు గజరాజులు నడుస్తుండగా భక్తజనబృందాలు కోలాటలు, భజనలు, జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తించారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, టిటిడి అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, జెఇఒ(విద్య, ఆరోగ్యం) ప్రభల గోపీనాథ్, సివిఎస్ఒ మురళీకృష్ణ, డిప్యూటీ ఇఒ భాస్కర్, పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి అధికారులు పాల్గొన్నారు.

## మతం మారితే రిజర్వేషన్లు వర్తించవు

**సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం స్పష్టీకరణ**

**మద్రాస్ హైకోర్టు తీర్పు సమర్థన**

**తమిళనాడు ప్రభుత్వ పిటిషన్ కొట్టివేత**



**న్యూఢిల్లీ, అక్టోబరు 15:** మతం మారితే రిజర్వేషన్లు వర్తించవని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. హిందూ మతంలోని కొన్ని సామాజిక వర్గాల నుంచి ఇస్లాంలోకి మారిన వారికి వెనుకబడిన తరగతుల ముస్లిం రిజర్వేషన్ ప్రయోజనాలను విస్తరించకూడదంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తాజాగా సమర్థించింది. ఒక మతంలో ఉన్న సామాజిక వెనకబాటుతనాన్ని మరో మతంలోకి మారిన తర్వాత కూడా అదే విధంగా పరిగణించలేమని పేర్కొంది. ఈ మేరకు తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఆ అంశంపై మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ చంద్రశేఖర్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఆ తీర్పు వెలువరించింది. హిందూ సామాజిక వ్యవస్థ నుంచి మరో మతంలోకి మారిన వ్యక్తి, గతంలో తన సామాజిక వర్గానికి ఉన్న వెనకబాటుతనాన్ని చూపించి రిజర్వేషన్ పొందలేరని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ విషయంలో మద్రాస్ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. హిందూ కుల వ్యవస్థతో ముడిపడి ఉన్న సామాజిక వెనుకబాటుతనం అనేది మతం మారిన తర్వాత ఇతర మతాల్లోకి లేదా సామాజిక వ్యవస్థల్లోకి దానంతట అదే రాదని కోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగ సూత్రాల ఆధారంగానే హైకోర్టు ఈ తీర్పు ఇచ్చిందని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది.



## స్పామ్, ఫ్రాడ్ కాల్స్‌కు చెక్

**నవంబరు 1 నుంచి కాలర్ ఐడి ప్రత్యక్షం**

**సిఎన్‌ఎపి సేవ తప్పనిసరి అందించాలి**

**టెలికం సంస్థలకు ట్రాయ్ ఆదేశాలు**

**న్యూఢిల్లీ, అక్టోబరు 15:** దేశంలో తెలియని నంబర్ల నుంచి వచ్చే స్పామ్, ఫ్రాడ్ కాల్స్‌కు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నవంబర్ 1నుంచి అన్ని టెలికాం సంస్థలు కాలింగ్ నేమ్ ప్రెజెంటేషన్ (సిఎన్‌ఎపి) సేవను తప్పనిసరిగా అందించాలని టెలికమ్యూనికేషన్స్ విభాగం ఆదేశాలు జారీ చేసింది. ఈ కొత్త విధానంతో వినియోగదారులకు ఫోన్ చేసే వారి పేరు, నంబర్‌తో సహా కనిపిస్తుంది. ఈ కొత్త నిబంధన అమల్లోకి వచ్చాక, 4జి లేదా 5జి నెట్‌వర్క్‌లలో మీకు ఇన్‌కమింగ్ కాల్ వచ్చినప్పుడు, కాల్ చేసే వారి నంబర్‌తో పాటు వారి పేరు కూడా ఫోన్ స్క్రీన్‌పై >>2



## చేదెక్కిన చక్కెర

**నిల్వలపై కేంద్రం కొరడా**

**వ్యాపారులు, డీలర్లకు ఆదేశాలు**

**నవంబరు 30 వరకు ఆంక్షలు అమలు**

2లో



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో మర్యాదపూర్వకంగా భేటీ అయిన మంత్రి లోకేష్

**విజయవాడ,అక్టోబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, సరస్ మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు విజయవాడ వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ ఉదయం విజయవాడ నోవాటెల్ హోటల్ కు వెళ్లిన మంత్రి లోకేష్.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్మును శాలువాతో ఘనంగా సత్కరించి మంగళగిరి చేనేత చీర, ఏటికొప్పాక కళాకృతిని బహూకరించారు. లోకేష్ రాష్ట్రపతితో బేటీలో ఆమె ఆశీర్వాదం తీసుకున్నారు. పలు సామాజికాంశాలపై సలహాలు తీసుకున్నారు.

# ఆసియా క్రీడల విజేతలను అభినందించిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 15:** ఆసియా క్రీడల్లో పతకాలతో మెరిసిన భారత బృందాన్ని ప్రధాని నరేంద్ర మోడీ అభినందించారు. దేశం గర్వపడే ప్రదర్శన చేసిన క్రీడాకారులతో గురువారం భేటీ అయిన మోడీ మీరు 140 కోట్ల భారతీయులను గర్వపడేలా చేశారని అన్నారు. ఆసియాడ్‌లో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించిన అథ్లెట్లు, క్రికెట్ టీమ్‌లను ప్రధాని ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియంలో సన్మానించారు. ఈ సందర్భంగా భారత బృందం సతకాలు చేసిన జెర్సీని మోడీకి బహూకరించింది. ఐయిచీ - నగోయ వేదికగా జరిగిన 18వ ఆసియా క్రీడల్లో పతకాలు కొల్లగొట్టిన భారత బృందాన్ని గురువారం ప్రధాని నరేంద్ర మోడీ కలిశారు. గత ఎడిషన్‌లో మాదిరిగా ఈసారి సెంచరీ కొట్టకున్నా సరే దేశ ప్రజలంతా గర్వపడే ప్రదర్శన చేసినందుకు వారిని మోడీ అభినందించారు. మీరు 140 కోట్ల భారతీయులు గర్వపడేలా చేశారు. పోడియం మీద త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగరేయడం మీరు సాధించిన పెద్ద విజయం. అందుకే ఈ విజయం మీది మాత్రమే కాదు దేశంలోని కోట్లాది మందికి చెందుతుంది. దేశ ప్రజలందరి తరఫున మిమ్మల్ని అభినందిస్తున్నా అని పేర్కొన్నారు. 18వ ఆసియాడ్‌లో గెలుపొందిన 85 పతకాల్లో 38 మహిళా అథ్లెట్లు సాధించినవే. వీటిలో పదకొండు స్వర్ణాలు ఉండడం భారత్‌కు చాలా ప్రత్యేకం. అద్భుత ప్రదర్శన చేసిన మహిళా అథ్లెట్లకు నేను శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. ఇక్కడ హాకీ జట్లు రెండు ఉన్నాయి. హాకీలో పురుషుల, మహిళల జట్లు స్వర్ణాలు పట్టేశాయి. ముఖ్యంగా మహిళల జట్టు 41 ఏళ్ల తర్వాత ఆసియాడ్‌లో మొదటిసారి పసిడి పతకంతో చరిత్ర లిఖించిందని ఆసియా క్రీడల బృందంతో భేటీ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర క్రీడా శాఖా మంత్రి మన్సూఖ్ మాండవీయ, భారత కోచింగ్ బృందం, తదితరులు పాల్గొన్నారు. ఇటీవలే ముగిసిన ఆసియా క్రీడల్లో వందకు పదిహేను పతకాల దూరంలో ఆగిపోయిన భారత్ నాలుగో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే.



# మహిళా శక్తితోనే వికసిత్ భారత్ సాధ్యం

## - జాతీయ సరస్ మేళా ద్వారా 15 వేల మందికి నైపుణ్య శిక్షణ

## - కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

**విజయవాడ, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళా సంఘాల ఉత్పత్తులకు నాణ్యత, బ్రాండింగ్, విస్తృత మార్కెట్లు. కల్పించే దిశలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్థిరమైన కార్యచరణను అమలు చేస్తున్నాయన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేసారు. విజయవాడలో జరుగుతున్న జాతీయ సరస్ మేళా ప్రారంభోత్సవంలో మాట్లాడుతూ.. మహిళా శక్తిని ఆర్థిక శక్తిగా మార్చడం ద్వారా వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చు అన్నారు. గ్రామీణ మహిళలకు తగిన అవకాశాలు కల్పిస్తే పారిశ్రామికవేత్తలుగా ఎదిగి వందలాది కుటుంబాలకు ఉపాధి కల్పించగలరన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యమైన ఆరు కోట్ల మంది మహిళలను లఖ్‌పతి దీదీలుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో ఇప్పటికే సుమారు మూడున్నర కోట్ల మంది మహిళలు లక్ష్యాన్ని చేరుకున్నారని వివరించారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఒడిశాలోని మారుమూల మన్యం నుంచి భారత రాష్ట్రపతి పీఠం వరకు సాగించిన ప్రయాణం, శ్రీమతి ద్రౌపది ముర్ము జీవితం మహిళల ఆత్మవిశ్వాసానికి, పట్టుదలకు, సామర్థ్యానికి నిదర్శనం. అడుగడుగునా సామాజిక అడ్డంకులు, వ్యక్తిగత జీవితంలో తీరని విషాదాలు ఎదురైనా, ఆ కన్నీటినే సమాజ సేవకు ఇంధనంగా మార్చుకున్న అపర ధైర్యశాలి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాలు దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఒకప్పుడు బ్యాంకు గుమ్మం తొక్కడానికే భయపడిన గ్రామీణ మహిళలు, నేడు దేశ బ్యాంకింగ్ వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నారు. 2014లో సుమారు రూ.23 వేల కోట్లుగా ఉన్న మహిళా సంఘాల వార్షిక రుణ లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. ఇప్పటివరకు మహిళా సంఘాలకు సుమారు రూ. 13 లక్షల కోట్ల రుణాలు అందించబడ్డాయి. డ్వాక్రా సంఘాలకు మరింత ఊతమిచ్చేలా రూ. 20 లక్షల వరకు రుణాలపై ప్రాసెసింగ్, తనిఖీ, డాక్యుమెంటేషన్ తదితర ఛార్జీలను రద్దు చేయడం ద్వారా ఒక్కో డ్వాక్రా సంఘానికి సుమారు రూ.33 వేల వరకు ఆదా అయ్యే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది. రాష్ట్రంలో అమలు చేసిన ఈ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించింది. మహిళా సంఘాల లావాదేవీల్లో పారదర్శకత పెంచేందుకు, డిజిటల్ విధానంలో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సాఫ్ట్‌వేర్ ఆధారిత వ్యవస్థలను ప్రవేశపెట్టింది. స్వయం సహాయక సంఘాల సమగ్ర వివరాలను, వారి ఆర్థిక లావాదేవీలను డిజిటలైజ్ చేయడం కోసం భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ లోకో ఎస్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. గతంలో ఢిల్లీకి పరిమితమైన జాతీయ సరస్ మేళాను విజయవాడలో నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణం. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 1,500 మంది మహిళా ప్రతినిధులు పాల్గొంటూ హస్తకళలు, చేనేత ఉత్పత్తులు, సంప్రదాయ వస్తువులను ప్రదర్శిస్తున్నారు. సరస్ మేళాను విక్రయాల వేదికగానే కాకుండా మహిళలకు నైపుణ్యాభివృద్ధి, వ్యాపార నిర్వహణ, మార్కెటింగ్‌పై శిక్షణ అందించే కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు. రానున్న 15 రోజుల్లో రోజుకు సుమారు 1,000 మంది



చొప్పున రాష్ట్రానికి చెందిన 15 వేల మంది మహిళలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు మెరుగైన ధరలు, విస్తృత మార్కెట్లు కల్పించేందుకు నాలుగు అంశాలపై దృష్టి సారించనున్నారు ఉత్పత్తుల నాణ్యత పెంపు. ప్యాకేజింగ్, బ్రాండింగ్ ద్వారా ఉత్పత్తుల విలువ పెంపు. పెద్ద వ్యాపార సంస్థలు, రిటైల్ మార్కెట్లతో అనుసంధానం, ఆన్‌లైన్ వేదికల ద్వారా విక్రయాల విస్తరణ తదిదరంశాల్లో ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లోని మహిళా సంఘాల ప్రతినిధులు, ఆసక్తి ఉన్న మహిళలు సరస్ మేళాను సందర్శించి శిక్షణ అవకాశాలను వినియోగించుకునేలా ప్రోత్సహించాలి. గ్రామీణ మహిళలు కుటుంబ నిర్వహణతో పాటు వ్యాపారాలు అభివృద్ధి చేయడం, వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్ల వినియోగంలోనూ ముందుకు సాగగలరు. మహిళలకు సరైన అవకాశాలు, శిక్షణ,

ఆర్థిక సహకారం అందిస్తే స్వయం సమృద్ధి సాధించడంతో పాటు అనేక కుటుంబాలకు ఉపాధి కల్పించగలరు. జాతీయ సరస్ మేళా నిర్వహణకు కృషిచేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, నిర్వాహకులకు కేంద్ర మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

## జగన్‌కు సిజెపి నేతలు ధన్యవాదాలు

**విజయవాడ,అక్టోబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాల అక్రమ అరెస్ట్‌లను వ్యతిరేకించినందుకు, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌కు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ధన్యవాదాలు తెలిపారు. అభిజిత్ ఎక్స్ వేదికగా వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు సీజేపీ నేతల అరెస్ట్‌పై ఎక్స్ వేదికగా వైఎస్ జగన్ స్పందించారు. ఎన్నికల ప్రక్రియలో లోపాలను సరిదిద్దాలి. ముందస్తు చర్యలతోనే మెరుగైన పరిష్కారం. ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించాలి. అరెస్టులతో సమస్య పరిష్కారంకాదు వ్యాఖ్యలు చేశారు.

## రాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు



రాష్ట్రపతికి వీడ్కోలు పలుకుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్రమంత్రులు పెమ్మసాని, శివరాజ్‌సింగ్ చౌహాన్ తదితరులు

**గన్నవరం(కృష్ణా), అక్టోబర్ 15, ప్రభాతవార్త :** రెండురోజుల విజయవాడ పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమైన రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు పలువురు మంత్రులు, అధికారులు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. విజయవాడలో జరుగుతున్న పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్రపతి ముర్ము బుధవారం విజయవాడ వచ్చిన సంగతి పాఠఖులకు తెలిసిందే. తన పర్యటన ముగించుకున్న రాష్ట్రపతి విజయవాడ నుండి రోడ్డుమార్గాన గురువారం మధ్యాహ్నం 2.45 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. రాష్ట్రగవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్రవ్యవసాయ, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, కేంద్రగ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్‌లశాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్రగ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్, రాష్ట్రహోం మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శి జి.సాయిప్రసాద్, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా, ఎన్‌సిసి బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ప్రవీణ్ యాదవ్, కృష్ణాజిల్లా కలెక్టర్ డికె.బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు రాష్ట్రపతికి వీడ్కోలు పలికారు.

### ఇంటర్ పరీక్షా విధానంలో మార్పులు

అమరావతి, అక్టోబర్, 15,ప్రభాతవార్తప్రతినిధి: ఇంటర్ పరీక్షా విధానంలో మార్పులు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ బోర్డు కీలకనిర్ణయం తీసుకుంది. నూతన విధానాలు 2027 మార్చిలో జరగబోయే ఇంటర్ పరీక్షల నుంచి అమల్లోకి రానున్నట్లు బోర్డు వెల్లడించింది. ఈ మేరకు ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఈ మార్పులపై అవగాహన కల్పించాలని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఏపీ ఇంటర్ బోర్డు సెక్రటరీ పి. రంజిత్ బాషా ఆదేశాలు జారీ చేశారు. ఒకేషనల్ కోర్సులకు యథాతథంగా పాత పద్ధతిలోనే 24 పేజీల ఆన్సర్ బుక్‌లెట్‌ను ఉంచారు.

## హైకోర్టులో వైసిపి మరో పిటిషన్

### - నేడు విచారణకు వచ్చే అవకాశం

**విజయవాడ, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** హైకోర్టులో వైఎస్సార్‌సిపి మరో పిటిషన్ వేసింది. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఉన్న కేసు వివరాలు దరఖాస్తు చేసిన 24 గంటల్లో ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలంటూ వైఎస్సార్‌సిపి ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పిటిషన్ వేశారు. అభ్యర్థులపై ఎక్కడ ఏఏ కేసులు ఉన్నాయో తెలియని పరిస్థితి ఉందని పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు. వైఎస్సార్‌సిపి పిటిషన్ ఈ నెల 16న అంటే శుక్రవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై నమోదైన, పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల వివరాలను వెల్లడించేలా రాష్ట్రవ్యాప్తంగా పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఇసి)ని కూడా వైఎస్సార్‌సిపి కోరింది. ఈ మేరకు లేళ్ల అప్పిరెడ్డి.. ఎస్ఇసికి లేఖ రాశారు. కూటమి సర్కారు పోలీసుల సాయంతో వైఎస్సార్‌సిపి ఆశావహ అభ్యర్థులపై చేస్తున్న వేధింపుల్ని ఈ లేఖలో ప్రస్తావించారు. వాటిని అడ్డుకోవడంతో పాటు తమ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు అవసరమైన వివరాలు అందించేందుకు రాష్ట్ర డిజిపికి తగిన ఆదేశాలు ఇవ్వాలని కూడా లేఖలో కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎలాంటి సంబంధం లేకపోయినా, వివిధ పోలీస్ స్టేషన్లలో తమ పార్టీ నేతలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. తద్వారా వారిలో భయాందోళనలు సృష్టించి, ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా ఆటంకం కలిగిస్తున్నారన్నారు.

## బిసి రిజర్వేషన్ల అమలు పిటిషన్‌పై ముగిసిన విచారణ

### - తీర్పు రిజర్వు చేసిన న్యాయస్థానం

**విజయవాడ, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణను నిలిపివేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన పిటిషన్ పై హైకోర్టు విచారణ జరిగింది. పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖలు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారు కోసం విడుదల చేసిన జిఒలు గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు విరుద్ధంగా ఉన్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం రిజర్వేషన్లను సరిగ్గా అమలు చేసేవరకు ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషనర్ విన్నవించారు. స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్ల కోసం ఏర్పాటు చేసిన డెడికేషన్ కమిషన్‌పై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించిన తర్వాత మాత్రమే దాని సిఫార్సులను అమలు చేయాల్సి ఉందని పిటిషనర్ వాదించారు. దీంతో పాటుగా సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం కమిషన్ నివేదికను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాల్సి ఉన్నప్పటికీ, అధికారులు అలా చేయకుండా అభ్యంతరాలను స్వీకరించ లేదని కోర్టుకు తెలిపారు. నిబంధనలను పాటించకుండా రిజర్వేషన్లు అమలు చేయడం చట్టవిరుద్ధమని పిటిషనర్ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు.

## వడ్డీరేట్లను సవరించిన ఎస్‌బిఐ




**ముంబయి, అక్టోబరు 15:** దిగ్గజ ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రుణగ్రహీతలపై వడ్డీ భారాన్ని పెంచింది. వివిధ రుణాలపై వడ్డీ రేట్లను సవరిస్తూ బ్యాంకు కీలక నిర్ణయం తీసుకుంది. సవరించిన ఈ నూతన రేట్లు గురువారంనుంచే అమల్లోకి వస్తాయని ప్రకటించింది. రిజర్వుబ్యాంకు ఇటీవల రెపో రేటును 25 బేసిస్ పాయింట్ల మేర పెంచిన నేపథ్యంలో ఎస్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ పెంపుతో గృహ, వాహన, వ్యక్తిగత రుణాలకు సంబంధించిన నెలవారీ వాయిదాలు పెరగనున్నాయి. ఎస్‌బీఐ తాజా సవరణ ప్రకారం, ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు 7.90 శాతం నుంచి 8.15 శాతానికి పెరిగింది. రెపో లింక్డ్ లెండింగ్ రేటు 7.50 శాతం నుంచి 7.75 శాతానికి చేరింది. ఈ రెండు రేట్లు పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) మేర పెరిగాయి. సాధారణంగా కొత్త గృహ, వాహన రుణాలు ఈ రేట్లకే అనుసంధానమై ఉంటాయి కాబట్టి, ఈ రుణాల ఈఎంఐలు తక్షణమే పెరగనున్నాయి. వీటితో పాటు మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటును కూడా ఎస్‌బీఐ సవరించింది. మూడు నెలలు, ఏడాది, రెండేళ్లు, మూడేళ్ల కాల పరిమితి కలిగిన ఎంసీఎల్ఆర్‌పై వడ్డీ రేటును 15 బేసిస్ పాయింట్ల (0.15 ) మేర పెంచింది. దీంతో ఏడాది కాలపరిమితి గల ఎంసీఎల్ఆర్ 8.70 శాతం నుంచి 8.85 శాతానికి చేరుకుంది. పాత గృహ రుణాలు, వ్యక్తిగత, కార్పొరేట్ రుణాలు ఎక్కువగా ఎంసీఎల్ఆర్‌తో ముడిపడి ఉంటాయి. ఓవర్‌నైట్, ఒక నెల కాలపరిమితి గల ఎంసీఎల్ఆర్‌లో ఎటువంటి మార్పులు చేయకపోవడం గమనార్హం. వడ్డీ రేట్ల పెంపు నిర్ణయంతో బాహ్య రుణపరపతి వడ్డీరేట్లు, రెపోరేట్ లింక్ వడ్డీరేట్లు, వ్యయాధారిత ఫ్లోటింగ్ వడ్డీ రేట్లతో రుణాలు తీసుకున్న వారిపై ఈఎంఐల భారం పడనుంది. సవరించిన ఈ రేట్లను తమ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఎస్‌బీఐ వెల్లడించింది.

# రాష్ట్రంలో రెండు కార్పొరేషన్లు, ఏడు మున్సిపాలిటీలు బిజెపికి కేటాయింపు

## - అనంతపురం, రాజమండ్రి మేయర్ స్థానాలు బిజెపికే - కూటమి సర్దుబాట్లు ఫైనల్

**అనంతపురం, అక్టోబర్ 15 ప్రభాతవార్త బ్యూరో :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక మున్సిపల్ ఎన్నికల్లో కూటమి పార్టీల పొత్తులో భాగంగా టిడిపి, జనసేన, బిజెపి పార్టీల మధ్య సర్దుబాటుకు గురువారం రాత్రి ఫైనల్ అయినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బిజెపి అధినేత మాధవ్ తదితర ముఖ్యులతో పలు విడతలుగా చర్చలు జరిపిన తర్వాత రాష్ట్రంలో కార్పొరేషన్ మేయర్, మున్సిపాలిటీ చైర్మన్ స్థానాలు ఎవరికి కేటాయించాలన్నది కూటమి పార్టీల మధ్య ఒక కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ముఖ్యంగా కూటమి పార్టీల పొత్తులో భాగంగా బిజెపికి అనంతపురం, రాజమండ్రి కార్పొరేషన్లలో మేయర్ స్థానాలను పొత్తులో భాగంగా కేటాయించారు. అదే విధంగా రాష్ట్రంలోని మున్సిపల్ చైర్మన్ స్థానాల్లో ఏడింటిని బిజెపికి కేటాయించారు. అందులో భాగంగా కావలి, బాపట్ల, సిద్దలూరు, ఎలిమెర్ల, గూడూరు, ఎలిమంచలి, ఎర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ స్థానాలను పొత్తుల్లో భాగంగా భారతీయ జనతా పార్టీకి కేటాయించారు. ఈ స్థానాల్లో టిడిపి, జనసేన పార్టీ వర్గాలు మద్దతి పలకాల్సి ఉంటుంది. పొత్తుల్లో భాగంగా జనసేన, టిడిపికి కూడా ఏఏ మున్సిపాలిటీలు, ఏఏ కార్పొరేషన్ పదవులున్నది ఓ నిర్ణయానికి వచ్చారన్నది వాటి పూర్తి వివరాలు అందాల్సి ఉంది. శుక్రవారం నుంచి మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో నామినేషన్ల గట్టం ప్రారంభం అవుతుండటంతో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు అభ్యర్థుల ఎంపిక కొలిక్కి వస్తోంది.

**అనంతపురంలో బిజెపి వర్గాలకు షాక్ :** అనంతపురం కార్పొరేషన్‌లో మేయర్ స్థానానికి టిడిపి తరుపున పలువురు అభ్యర్థులు నువ్వా..నేనా అన్నట్లు పోటీ పడుతున్న నేపథ్యంలో ఎవరు ఊహించని విధంగా అనంతపురం మేయర్ స్థానాన్ని బిజెపికి పొత్తుల్లో భాగంగా కేటాయించడం విశేషం. ఈ సంఘటన ఇటు టిడిపి, అటు బిజెపి వర్గాలకు షాక్ ఇచ్చినట్లు అయింది. అనంతపురం మేయర్ స్థానాన్ని తమకు ఇవ్వాలని బిజెపి అడగకపోయినప్పటికీ సీట్ల సర్దుబాటులో భాగంగా కూటమి పార్టీలు అనంతపురం మేయర్ స్థానాన్ని బిజెపికి ఇవ్వడం టిడిపి అభ్యర్థులకు, నాయకులకు మింగుడు పోవడం లేదు. అదే సమయంలో బిజెపి తరుపున అభ్యర్థిని ఎవరిని బరిలోకి దింపాలన్న వేటలో బిజెపి నాయకులు సన్నాహాలు మొదలు పెట్టారు. అనంతపురంలో బిసి వర్గాలకు సంబంధించి పలువురు బిజెపి నాయకులు, సానుభూతి పరులు ఉన్నప్పటికీ ఆర్థికంగా లేకపోవడంతో ఎవరిని బరిలోకి దింపాలన్నది గుల్లాలు పడుతున్నట్లు సమాచారం.

## మహిళల ఆర్థిక పరిస్థితి పటిష్టంగా ఉంటే అనూహ్యమైన మార్పులు

### - గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్



సరస్ మేళాలో ప్రసంగిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

**విజయవాడ, అక్టోబరు 15 ప్రభాతవార్తప్రతినిధి:** మహిళల ఆర్దికంగా పటిష్ట స్దితిలో ఉంటే వారి కుటుంబాలు.,తద్వారా వ్యవస్ద అనుహ్యమైన మార్పులు వస్తాయని ఏపీ గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ అన్నారు. వారిలో ఉన్న సృజనాత్మక దృక్పథం ఏ రంగంలోనైనా రాణింపునిస్తుందన్నారు. తమ ప్రభుత్వం మహిళల అభ్యున్నతిపై దృష్టి కేంద్రీకరించి పని చేస్తుందని అన్నారు. గురువారం పున్నమిఘాట్‌లో జాతీయ సరస్ మేళా ప్రారంభోత్సవం సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఉపాధి కల్పనను దాటి, లాభదాయకమైన, స్థిరమైన, విస్తరించదగిన మహిళా పారిశ్రామిక సంస్థలను నిర్మించడంపై దృష్టి సారించాలన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు తగిన ఆర్థిక వసతులు, ఆధునిక సాంకేతికత, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, బ్రాండింగ్, ప్యాకేజింగ్, నాణ్యతా ప్రమాణాలు పెంచుకోవాలని సూచించారు. నమ్మకమైన మార్కెట్ అనుసంధానాలు కల్పించడం ద్వారా వారి వ్యాపారాలను విస్తరించుకోవడానికి విస్తృత మార్కెట్లలో పోటీ పడేలా మద్దతునివ్వాలని అన్నారు. ఈ సరస్ మేళా కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన ఎంతో మందికి మంచి అవకాశాలు కలిగిస్తుందని గవర్నర్ తెలిపారు. సరస్ ఆజీవిక మేళా వంటి కార్యక్రమాలు గ్రామీణ ఉత్పత్తిదారులకు పట్టణ వినియోగదారులకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చగలవన్నారు. మహిళల్లో పెట్టుబడి పెట్టడం అంటే బలమైన కుటుంబాలు, సమ్మిళిత సమాజాలు మరింత సుసంపన్నమైన దేశంలో పెట్టుబడి పెట్టడమే అని చెప్పుకొచ్చారు. మహిళా సాధికారత అంటే మహిళలను బలవంతులుగా మార్చడం కాదన్నారు. మహిళలు ఇప్పటికే బలంగా ఉన్నారని, ప్రపంచం ఆ బలాన్ని చూసే విధానాన్ని మార్చడమే సాధికారత అనేది గుర్తించాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.

## ఎసిబికి పట్టుబడ్డ టిజిఎస్‌పిడిసిఎల్ ఎఇ

### రూ.1.20 లక్షల లంచంతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు

**హైదరాబాద్, (సైదాబాద్) అక్టోబర్ 15, ప్రభాతవార్త:** చోరీకి గురైన కరెంటు మీటర్ల స్థానంలో కొత్త వాటిని మంజూరు చేసేందుకు ఒక భవన యజమాని నుంచి లక్షా 20 వేల రూపాయలు లంచం తీసుకుంటూ టిజిఎస్‌పిడిసిఎల్ ఏఈ ఎసిబికి పట్టుబడ్డాడు. సంతోష్‌నగర్ డివిజన్‌లో గురువారం జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. సిటీ రేంజ్ 2లోని టిజిఎస్‌పిడిసిఎల్ ఏఈగా పనిచేస్తున్న పండాల సందయ రాకేష్ మాదన్నాపేట్‌లోని ట్రాన్స్‌కో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతంలో గల భవన యజమాని ఇంట్లోని ఆరు కరెంటు మీటర్లు చోరీకి గురవగా వాటి స్థానంలో కొత్తవాటి కోసం దరఖాస్తు చేసుకున్నాడు. వీటిని మంజూరు చేసేందుకు ఏఈ రాకేష్ లక్షా 50 వేల రూపాయలు లంచం డిమాండ్ చేయగా చివరకు లక్షా 20 వేల రూపాయలు తీసుకునేందుకు అంగీకరించాడు. దీనిపై బాధితుడు ఎసిబికి ఫిర్యాదు చేశాడు. అనంతరం ఎసిబి అధికారుల సూచనల మేరకు బాధితుడు గురువారం రాకేష్‌కు రూపాయలు ఇచ్చాడు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సీట్ల సర్దుబాటు వ్యవహారం పూర్తి

## నేటి ఉదయంలోపు అభ్యర్థుల పేర్లు వెల్లడి

**విజయవాడ,అక్టోబరు 15,ప్రభాత వార్తప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సీట్ల సర్దుబాటు వ్యవహారం పూర్తయింది.సుదీర్ఘ కసరత్తు తరువాత టీడీపీ, జనసేన,బిజెపి పోటీ చేసే స్దానాలపై అవగాహనకు వచ్చాయి. గురువారం రాత్రి ఎంతపొద్దుపోయిన కూటమి అభ్యర్దులు పోటీ చేసే స్థానాలు,పేర్లు వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.లేని పక్షంలో శుక్రవారం ఉదయం వెల్లడిస్తారు.ఇప్పటికైతే పేచీ లేకుండా కలిసికట్టు నిర్ణయాన్ని సీఎం చంద్రబాబు,డీసీఎం పవన్ కల్యాణ్‌తో దశలవారిగా జరిపిన చర్చలో నిర్ణ యించారు. బిజెపి సైతం సర్దుబాటులో సమన్వతకు ప్రాధాన్యతను ఇచ్చింది. మేయర్ పీఠాలు, మున్సిపల్ ఛైర్మన్ స్థానాలపై రెండురోజులుగా సాగిన చర్చలు కీలక దశకు చేరాయి. విజయవాడ సహా నాలుగు కార్పొరేషన్లు, 20కి పైగా మున్సిపాలిటీలపై జనసేన దృష్టి పెట్టగా రాజమహేంద్రవరం కార్పొరేషన్‌తో పాటు నాలుగైదు మున్సిపాలిటీల్లో బీజేపీ పోటీకి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఏ పార్టీకి ఎన్ని స్థానాలు అన్నదానికంటే స్థానిక రాజకీయ సమీకరణాలు, గెలుపు అవకాశాలే సీట్ల ఖరారులో కీలకం కానున్నాయి. ఇవాళ రేపట్లో కూటమి నేతలు వీటిపై అధికారిక ప్రకటన చేయనున్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీలు సన్నద్ధమవుతున్న వేళ మేయర్, మున్సిపల్ ఛైర్మన్ స్థానాల పంపకంపై ఉత్కంఠకు తెరపడుతోంది. స్థానిక రాజకీయ పరిస్థి తులను బట్టి కొన్ని స్థానాల్లో మార్పులు, చేర్పులకు అవకాశం ఉంది. చర్చల్లో ప్రస్తావనకు వచ్చిన స్థానాల జాబితాలో విజయవాడ, కాకినాడ, శ్రీకాకుళం, ఏలూరు కార్పొరేషన్లు జనసేనకు కేటాయించే అవకాశముంది. మున్సిపాలిటీల్లో పిఠాపురం, పెద్దాపురం, గొల్లప్రోలు, తుని, అమలాపురం, మండ పేట, నిడదవోలు, జంగారెడ్డిగూడెం, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, రంపచోడవరం, జగ్గయ్యపేట, రేపల్లె, తెనాలి, పొన్నూరు, నరసరావుపేట, సత్తెనపల్లి, దర్శి, కావలి, శ్రీకాళహస్తి, మదనపల్లె, పుట్టపర్తి, ఆదోని స్థానాలు చర్చకు వచ్చాయి. నగర పంచాయతీల్లో పాలకొండ, నెల్లిమర్ల, ముమ్మిడివరం, మడకశిర పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచార బీజేపీకి రాజమహేంద్రవరం కార్పొరేషన్ దక్కే అవకాశం కనిపిస్తోంది. యలమంచిలి, బాపట్ల, శ్రీకాళహస్తి, ఎర్రగుంట్ల, కర్నూలు జిల్లాలోని గూడూరు మున్సిపాలిటీల పేర్లు కూడా చర్చల్లో ప్రస్తావనకు వచ్చాయి. మొత్తంగా ఒక కార్పొరేషన్, నాలుగు నుంచి ఐదు మున్సిపాలిటీలు, ఒక నగర పంచాయతీలో బీజేపీ పోటీ చేసే అవకాశం ఉంది. జనసేనకు నాలుగు కార్పొరేషన్లు, 20 నుంచి 24 మున్సిపాలిటీలు, మూడు నుంచి నాలుగు నగర పంచాయతీల్లో అవకాశం కల్పించే అంశం చర్చకు వచ్చింది.గురువారం రాత్రి మంత్రులు నాదెండ్ల, సత్య కుమార్, లింగమనేని, చంద్రబాబుల మధ్య జరిగిన సమావేశం ముగిసింది. సీట్ల పంపకం, అభ్యర్థుల ఎంపికపై కూటమి పార్టీలు తమ చర్చలను పూర్తి చేశాయి.

ఏయే నియోజకవర్గాల్లో పోటీ చేయాలనే అంశంపై టీడీపీ, జనసేన, బీజేపీలు స్పష్టమైన అవగాహనకు వచ్చాయి. పోటీ చేసే స్థానాలకు సంబం ధించి కూటమి తరఫున అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుంది. స్థానిక ఎన్నికల్లో ఐక్యంగా ముందుకు సాగాలని కూటమి ఇప్పటికే నిర్ణయించుకుంది.

## స్థానిక ఎన్నికల పరిశీలకులుగా ఐఎఎస్ అధికారులు

**విజయవాడ,అక్టోబరు 15,ప్రభాత వార్తప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు 28 మంది ఐఎఎస్ అధికారులను సాధారణ పరిశీలకులుగా రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నియ మించింది. ఆ పరిశీలకుల జాబితాను ఎస్ఈసీ గురువారం విడుదల చేసింది.పల్నాడు జిల్లాకు కె.కన్నబాబు, కృష్ణా జిల్లాకు ముదవతు ఎం.నాయక్.మార్కాపురం జిల్లాకు సి.హెచ్.శ్రీధర్ పశ్చిమ గోదావరి జిల్లా: ఎం.వి.శేషగిరి బాబు, బాపట్ల జిల్లాకి కె.వి.ఎన్. చక్రధర్ బాబు పకాశం జిల్లాకి హేప్సీ బారాణి ఏలూరు జిల్లా కిమనజీర్ జిలానీ సమూన్ ఎన్టీఆర్ జిల్లాకి ఎస్.నాగలక్ష్మికి వైఎస్ఆర్ కడప జిల్లాకి పి.రంజిత్ బాషా చిత్తూరు జిల్లాకి శివ శంకర్ లోతేటి. డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాకి పి.ప్రశాంతి, గుంటూరు జిల్లాకి షాంగిలి షాన్ మోహన్,తూర్పు గోదావరి జిల్లాకి ఎం.గౌతమి, శ్రీ సత్యసాయి జిల్లాకి పి.అరుణ్ బాబు..అనంతపురం జిల్లారి డా. కె. శ్రీనివాసులు, కాకినాడ జిల్లాకి బి.లావణ్య వేణి, నెల్లూరు జిల్లా: ఎస్. భార్గవి, నంద్యాల జిల్లాకి జె.వెంకట మురళి పోలవరం జిల్లాకి చేతన్ టి.ఎస్. అల్లూరి సీతారామరాజు జిల్లాకి రోణంకి కూర్మనాథ్, **అనకాపల్లి జిల్లా:** గోపాలకృష్ణ రోణంకి,అన్నమయ్య జిల్లాకి ప్రవీణ్ ఆదిత్య సి.వి,విజయనగరం జిల్లాకి ఎన్. తేజ్ భరత్ కర్నూలు జిల్లాకి బి. శ్రీనివాస రావు, పార్వతీపురం మన్యం జిల్లాకి ఎస్. చిన్న రాముడు,శ్రీకాకుళం జిల్లాకి మల్లవరపు సూర్యతేజ తిరుపతి జిల్లాకి డా.మామిడిపల్లి వరప్రసాద్ విశాఖ పట్నం జనరల్ అబ్జర్వర్‌గా గీతాంజలి శర్మ. రిజర్వ్ జాబితాలో జి.వీరపాండియన్, షోబిక ఎస్.ఎస్ ఉన్నారు.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నిట్ నం. 83/EE/R&B/VZM/2026-27, తేది: 05.10.2026
విజయనగరం జిల్లాలో (ఆర్ & బి) డివిజను పరిధిలో ఒక (1) పని కొరకు టెండరు పిలువబడినది. పని విలువ: రూ.3.50 లక్షలు. టెండరు స్వీకరణ కొరకు ఆఖరు తేది: 26.10.2026 సా.4.00 గం.ల వరకు. తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును. సం/- కార్యనిర్వాహక ఇంజనీరు (ఆర్ & బి), విజయనగరం
DIPR.No.21804/CL/Advt/1/1/2022-23, తేది: 15.10.2026

16-10pg4.qxd:16-10pg4.qxd 1/1/02 6:11 AM Page 1



వార్త

మంచి మాట సులువైన కర్తవ్యం వంటిది. చెడు పలుకకుండా ఉండడానికి మూల్యం లేని మౌనం చాలు.

న- టిలొట్సన్

# సూత్రధారులే మూలం!

చట్టాలకు సామాన్యులు లోకువైతే సమర్థులకు చట్టాలు లోకువ అంటారు. ఏ సందర్భంలో ఎవరిని ఉద్దేశించి అన్నారో కానీ మారిన కాలమాన పరిస్థితుల్లో ఇది అక్షరాల నిజమనిపిస్తున్నది. ఆర్థిక, అంగ, అధికార, రాజకీయబలం ఉన్నవారు తప్పు చేస్తే చర్యల సంగతి అటుంచి వేలెత్తి చూపడానికి కూడా జంకే దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. హత్యలు, అత్యాచారాలు చేసినవారు ఎందరో చట్టంలోని లొసుగులను అడ్డం పెట్టుకొని నిర్భయంగా తిరగ గలుగుతున్నారు. మిగిలిన విషయాలు ఎలా ఉన్నా మానవ జాతిని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల నియంత్రణలో అటు పాలకులు కానీ, ఇటు అధికార యంత్రాంగం కానీ సమర్థవంతంగా వ్యవహరించలేకపోతున్నదేమోనని పిస్తున్నది. దేశవ్యాప్తంగా ఎంతో పోలీసు సిబ్బంది ఉంది. నిఘా వ్యవస్థలున్నాయి. ఏకంగా నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో ఉంది, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర విభాగాలు ఎన్నో ఉన్నాయి. నిత్యం వెయ్యికళ్లతో నిఘా పెడుతున్నామని చెబుతున్నారు. అప్పుడప్పుడు మాదకద్రవ్యాల విక్రయదారులను పట్టుకుంటున్నారు కానీ ఇది ఆగడం లేదు. యేడాది యేడాదికి విస్తరిస్తూనే ఉంది. ఇటీవల కాలంలో దేశంలో విమానాశ్రయాల్లోనూ ఇతర ప్రాంతాల్లోనూ పట్టుబడుతున్న మాదకద్రవ్యాలు వేల కోట్లల్లో ఉంటున్నాయి. ఆ మధ్య కేరళ సమీపంలో అరేబియా సముద్రంలో నౌకాదళం స్వాధీనం చేసుకొన్న మాదక ద్రవ్యాల విలువ అంతర్జాతీయ మార్కెట్లో దాదాపు నాలుగువేల ఐదు వందల కోట్ల రూపాయలకుపైగా ఉంటుందని అధికార వర్గాలే అంచనా వేశాయి. ఇది వ్యూహం ప్రకారం వలపన్ని పట్టుకున్నది కాదు. చాలా వరకు ఇలానే అధికారులు చేస్తున్న తనిఖీల్లో పట్టుబడుతున్నాయి. విమానాల్లో రహస్యంగా తీసుకువస్తున్న మత్తు పదార్థాలు తక్కువేమీ కాదు. ఆహార సరఫరా ముసుగులో మత్తు పదార్థాలు పంపిణీ చేస్తున్న బాగోతం దేశంలో పలు చోట్ల బయటపడుతూనే ఉన్నది. పంజాబ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, హర్యానా, తదితర రాష్ట్రాల్లో మత్తుపదార్థాల వినియోగం అంతంతకు పెరుగుతున్నట్లు అధికార వర్గాలు అంగీకరిస్తున్నాయి. ముంబాయి, గోవా లాంటి నగరాలు కొకైన్‌కు కేంద్రాలుగా మారి నట్టు మాదకద్రవ్యాల నియంత్రణ సంస్థ అంగీకరించక తప్పడం లేదు. ఇక గంజాయి సాగు దేశంలో అనేక రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రాల్లోనూ భారీగానే సాగుచేస్తున్నట్లు సమాచారం. అప్పుడప్పుడు ఎక్సైజ్ పోలీసు అధికారులు దాడులు చేసి గంజాయి పంటను ధ్వంసం చేస్తున్నా మళ్లీ రెండు, మూడు నెలల్లో రెట్టింపు స్థాయిలో సాగులోకి వస్తున్నాయి. అడవుల్లో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఈ సాగు చేసే స్మగ్లర్లు పట్టుబడగానే అదృశ్యమైపోతున్నారు. కేవలం ఆయా ప్రాంతాల్లోని అమాయక రైతులు, రైతు కూలీలు, ఈ కేసుల్లో ఇరుక్కుపోతున్నారు. కొన్ని సందర్భాల్లో గంజాయి సాగు చేయడం చట్టప్రకారం నేరమనే విషయం కూడా ముఖ్యంగా గిరిజన రైతులకు తెలియడం లేదు. దీనిపై అవగాహన కలిగించడంలో అధికారగణం విఫలమవుతున్నారేమోననిపిస్తున్నది. ఇక అత్యంత విలువైన మాదకద్రవ్యాల రవాణా, వ్యాపారంలో పట్టుబడుతున్నది పాత్రధారులే. వారి వెనుక ఉండే అసలైన సూత్రధారులను పట్టుకోలేకపోతున్నారు. మాదక ద్రవ్యాలు అనేక మార్గాల్లో భారత్‌కు చేరుకుంటున్నాయి. ఆఫ్ఘనిస్థాన్ నుండి ఆఫ్రికా మీదుగా భారత్‌కు చేరుకొని వివిధ మార్గాల ద్వారా దేశంలోని అన్ని నగరాలకు సరఫరా చేస్తున్నారు. కొన్ని మాదకద్రవ్యాల ముఠాలు ఈశాన్య భారతంలోనూ వివిధ తీవ్రవాద బృందాలకునిధులు అందిస్తున్నట్లు సమాచారం. ఇది దేశ భద్రతకు అత్యంత ప్రమాదకరంగా తయారైంది. ఆ మధ్య మయన్మార్ వలసదారుల నుంచి పద్దెనిమిది ఆయుధాలు, డెబ్బైనాలుగు కోట్ల విలువైన అక్రమ రవాణా వస్తువులు, దాదాపు రెండువందల కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు పట్టుబడ్డాయి. ఇక కేసుల విషయంలో కూడా సంబంధిత అధికార వర్గాలు అంతగా శ్రద్ధ వహించడం లేదనే విమర్శలు న్యాయస్థానాల్లో వీగిపోతున్న కేసులు సజీవ సాక్ష్యాలుగా మిగులుతున్నాయి. అందుకే మత్తు పదార్థాల రవాణాలో పట్టుబడినవారు జైలుకు వెళ్లినాతిరిగి వచ్చి అదే వ్యాపారంలో కొనసాగుతున్నారు. వీటన్నిటికంటే మించి మత్తు ముఠాల కదలికలపై నిఘా వేసి నియంత్రించాల్సిన నార్కోటిక్ కంట్రోల్‌బ్యూరో, ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు తదితర శాఖల మధ్య సమన్వయం లేకపోవడం కూడా మత్తుపదార్థాల విస్తరణకు కారణమవుతుంది. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ప్రస్తుతం అంతకంతకు పెరిగి సమాజాన్ని పట్టిపీడిస్తున్న మత్తుపదార్థాల వాడకం, వినియోగం ఆందోళన కలిగిస్తున్నది. చాపకింద నీరులా ఈ స్మగ్లర్లు తమ సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూపోతున్నారు. ఈ జాఢ్యం విస్తరించడం అత్యంత ప్రమాదకరం. మాదకద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకుండా ఆచారణలో చూపించాల్సిన తరుణమిది. అవసరమైతే చట్టానికి మరింత పదును పెట్టాలి. ముఖ్యంగా మాదకద్రవ్యాల సరఫరాలో పట్టుబడుతున్న పాత్రధారులను కాకుండా అసలైన సూత్రధారులను బయటకు తీయాలి. ఉత్పత్తి, నిల్వ,వినియోగం వ్యాపారానికి పాల్పడడం అత్యంత తీవ్రమైన నేరాలుగా కొన్ని దేశాలు పరిగణిస్తున్నాయి. కాంబోడియా, వియత్నాం, సింగపూర్, థాయిలాండ్ లాంటి దేశాలు ఈనేరాలకు ఏకంగా మరణ శిక్ష విధిస్తున్నాయి. పాలకులు అలాంటి కఠిన శిక్షల వైపు దృష్టిసారించాలి. ఒక్కసారి మాదక ద్రవ్యాల వ్యాపారంలో, రవాణాలో పట్టుబడి రుజు వైతే శాశ్వత జైలు జీవితమే శరణ్యమనే భయం ఆ స్మగ్లర్లలో కలిగించాలి. అన్నింటి కంటే ముఖ్యంగా పాత్రధారులే కాదు సూత్రధారులను కూడా పట్టుకుంటే తప్ప ఇది ఆగే పరిస్థితులు కన్పించడం లేదు. ఇందులో ఏ మాత్రం జాప్యం చేసిన యువతపై తీవ్ర ప్రభావం చూపి నేర ప్రవృత్తి పెరిగి అరాచకం ప్రబలే ప్రమాదం ఉంది.



ఓర్పు లేకపోవడం ఒక రకమైన దౌర్జన్యం. అది ప్రజాస్వామ్య ప్రగతికి అవరోధం.

మహాత్మా గాంధీ



ఆశ ఉత్తర ధృవం, విధి దక్షిణ ధృవం ఈ రెండింటి మధ్య ఎగిరిపడే ప్రహసనమే మానవుడు.

బాలగంగాధర్ తిలక్

# ప్రజావాక్కు



### వ్యక్తిత్వాన్ని గౌరవించాలి

రహూ బదులుగా చుడీదార్ ధరించిందనే కారణంతో ఒక ప్రధానోపాధ్యాయురాలిని విధులకు అనుమతించకపోవడంపై కేరళ హైకోర్టు చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగత స్వేచ్ఛ, సమానత్వం,గౌరవప్రదమైన జీవనహక్కుల ప్రాముఖ్యతను మరోసారి గుర్తుచేశాయి. వస్త్రధారణ అనేది వ్యక్తి అభిరుచికి సంబంధించిన అంశమని,అది ప్రాథమిక హక్కుల పరిధిలోకివస్తుందనిన్యాయస్థానం స్పష్టంచేసింది. భారత రాజ్యాంగం ప్రతిపౌరుడికి సమానత్వం, వ్యక్తిగత స్వేచ్ఛ, గౌరవంతో జీవించేహక్కును కల్పించింది. ఉద్యోగ సంస్థలు,విద్యాసంస్థలు క్రమశిక్షణను పాటించడం అవసరమే. అయితే ఆ పేరుతో హేతుబద్ధతలేని ఆంక్షలు విధించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ముఖ్యంగా మహిళల విషయంలో దుస్తుల ఆధారంగా అంచనాలు లేదా పరిమితులు విధించడం లింగ సమానత్వ సూత్రాలకు వ్యతిరేకం. ఒక ఉపాధ్యాయురాలి ప్రతిభ, కర్తవ్యనిర్వహణ, విద్యార్థులపై ప్రభావం ఆమెధరించిన దుస్తుల వల్ల నిర్ణయించబడవు. వ్యక్తుల వ్యక్తిత్వాన్ని గౌరవిస్తూ వృత్తిపరమైన నైపుణ్యాలను ప్రోత్సహించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పారదర్శకత అవసరం

ప్రజాస్వామ్యంలో ప్రమాదకరమైన వ్యక్తుల చేతికి పగ్గాలు ఇవ్వడం,పెత్తందారీతనంఇవ్వడం,హోదాలు కల్పించడం, తాగుబోతులు వ్యసనపరులు చెప్పుడు మాటలు నమ్మే వారు,ఆక్షణానికి అవసరం తీర్చుకునేవారుఓట్లు వేయడం వల్ల రౌడీలు, గూండాలు ప్రజాపతినిధులుగా ఎన్నికవుతున్నారు.ఎన్నికలకు ముందుఓటర్లకు నమస్కారం పెడుతున్నారు, ఎన్నికలు అయినతర్వాత అధికారం చెలాయిస్తున్నారు. ప్రజల బాగోగులకంటే వాళ్ల బాగోగులే చూసుకుంటున్నారు.ఆడంబరాలను ఐశ్వర్యాలను అనుభవిస్తున్నారు. ఇకనైనా ఇది మారాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### పేదింటి కల

సమాజంలోమధ్యతరగతి,బడుగుబలహీన వర్గాల కుటుంబాలు చిన్నప్పటి నుండి అష్టకష్టాలు పడుతూ ఉన్నదో లేనిదో తింటూ సంవత్సరాల తరబడి రెక్కలు ముక్కలు జేసుకుని ఇల్లునిర్మించినప్పుడుగాని ఏవైనా కార్యక్రమాలు చేసినప్పుడు ఆ కుటుంబంలోని ఆనందం మాటల్లో వర్ణించలేనిది.కావున ప్రభుత్వ పథకాల్లో నిరుపేదలకే మొదటి ప్రాధాన్యత ఇచ్చి చేయుతానందించాలి.

-ఎం. శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ఓట్లు వేసేవారెవరు?

ఓట్ల తొలగింపు అనే కారణంగా దేశ రాజధాని ఢిల్లీలో కొంత కాలంగా ఉధృతంగా నిరసన కార్యక్రమాలు కూటమి, కాంగ్రెస్ పార్టీలునిర్వహిస్తున్నాయి.వీరికిమేధావులనబడేవారు, న్యాయవాదులు, ఇతరరంగాలలోని ప్రముఖులు మద్దతునిస్తున్నాయి.వీరిలో అసలు ఓటు వేసావారెంతమంది? క్యూలలో నిలబడి ఓటు వేయనివారే అధికంగా ఉంటారు. ఇంతవరకు జరిగిన ఎన్నికలలో ఈవాస్తవం బయట పడింది. కాని వీరు ఓట్ల జాబితాలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని మాత్రం నేరం మోపుతారు. అసలీ ఓట్ల భాగవతం ఏమీ తెలియని సామాన్య ప్రజలే ఎండలకు, వానలకు తట్టుకుని క్యూలలో నిలబడి ఓటు వేస్తారు. వీరేమన ప్రజాస్వామ్యాన్ని గౌరవించి నిలబెట్టే దేశభక్తులు. వీరికి ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనల గురించి పూర్తి అవగాహన కూడా ఉంటుందనుకోము. ఇకపోతే చాలా రోజులుగా కొనసాగుతున్న సమస్యను ఏదో విధంగా పరిష్కారం కనుగొనాలి.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### వైభవ్ సూర్యవంశీకి అవకాశాలివ్వాలి

చిన్న వయసులోనే అసాధారణమైన బ్యాటింగ్ నైపుణ్యంతో అందరి దృష్టిని ఆకర్షిస్తూ, దిగ్గజ క్రికెటర్ల చేత ప్రశంసలు అందుకుంటున్న అద్భుత ప్రతిభావంతుడు వైభవ్ సూర్యవంశీ అలాంటి ప్రత్యేకమైన ప్రతిభ ఉన్న యువ ఆటగాడిని అలా బెంచ్‌మీద కూర్చోబెట్టడం సరికాదు. మ్యాచ్‌లు ఆడించకుండా ఇలా బెంచ్‌కే పరిమితం చేస్తే అది అతని ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తుంది. మైదానంలో ఆడే అవకాశం దక్కినప్పుడే ఇలాంటి ఆటగాళ్లలోనమ్మకం పెరుగుతుంది. మ్యాచ్‌పరిస్థితుల్లో ఒత్తిడిని ఎదుర్కొంటూ ఆడినప్పుడే వారిఆట మరింత మెరుగవుతుంది.వివిధరకాల బౌలింగ్‌ను ఎదుర్కొంటూ,మ్యాచ్ ఒత్తిడిని అధిగమించే అనుభవం కేవలం ప్రాక్టీస్ వల్ల మాత్రమే రాదు.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### దివ్యాంగులకు అవకాశం కల్పించాలి

నెట్‌పిహెచ్‌డికి క్వాలిఫైడ్ అభ్యర్థులను కూడా పరిగణలోనికి తీసుకోవాలి.యూనివర్సిటీ గ్రాంట్‌కమిషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న యూనివర్సిటీ పోస్టులకు నెట్ లో పీహెచ్‌కి అర్హత సాధించిన నెట్ క్వాలిఫైడ్ దరఖాస్తు దారులను కూడా పరిగణలోనికి తీసుకోవాలి. నెట్ 2025లో నెట్ హెచ్డి కి క్వాలిఫై అయిన వికలాంగులను, ఎస్సీ ఎస్టీ వెనుకబడిన విద్యార్థులను కూడా పరిగణలోనికి తీసుకొని అవకాశం కల్పించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ద్రవ్యోల్బణం నియంత్రణేది?

**ఆర్థిక నమూనాలు విధాన నిర్ణయాలకు దిశానిర్దేశం చేయగలవు కానీ అన్ని సమస్యలకు పరిష్కారం చూపలేవు. చిన్న వ్యాపార సంస్థలు రుణాలపై ఎక్కువగా ఆధారపడవచ్చు. పెద్ద కంపెనీలకు నిధుల లభ్యత మెరుగ్గా ఉండవచ్చు. అందువల్ల వడ్డీ రేట్ల మార్పు అందరిపై ఒకే ప్రభావం చూపదు. చిన్న సంస్థలకు రుణవ్యయం పెరిగితే కొత్త పెట్టుబడులు పెట్టడం, కార్మికులను నియమించుకోవడం కష్టమవుతుంది. మరోవైపు, ధరల పెరుగుదల వల్ల ముడిసరుకు ఖర్చులు పెరిగినా వాటిని వినియోగదారులపై పూర్తిగా మోపలేని సంస్థల లాభాలు తగ్గవచ్చు. ఈ వ్యత్యాసాలను గుర్తించేందుకు విశ్వసనీయమైన గణాంకాలు, సమస్యలపై సరైన అంచనా, విధానాల ఫలితాలపై నిరంతర సమీక్ష అవసరం. భారతదేశం ముందున్న లక్ష్యం ద్రవ్యోల్బణాన్ని అదుపు చేస్తూ పెట్టుబడులు, ఉపాధిని పెంచడం, ప్రజల కొనుగోలు శక్తిని కాపాడటం.**

డి జె మోహన రావు

రెండువేల ఇరవైఆరు ఆర్థిక శాస్త్ర నోబెల్ పురస్కారాన్ని రాబర్ట్ ఈ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌లకు ప్రకటించడం ఆర్థిక విధానాల ముందున్న కీలక ప్రశ్నను గుర్తుచేస్తోంది. దీర్ఘకాలిక వృద్ధికి ఆటంకం కలగకుండా ఆర్థిక ఒడుదొడుకులను ఎలా తగ్గించాలి? ప్రజలు, వ్యాపార సంస్థలు తీసుకునే నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థను ఎలా ప్రభావితం చేస్తాయో అర్థం చేసుకోవడంలో వీరి పరిశోధనలు తోడ్పడ్డాయి. భారతదేశానికి ఇందులోని ప్రధాన సందేశం స్పష్టం. వడ్డీ రేట్లను మార్చడం, వృద్ధి గణాంకాలను పెంచడం మాత్రమే సరిపోదు. ప్రజల ఆదాయాలు, ఖర్చులు, భవిష్యత్తుపై అంచనాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక విధానాలను రూపొందించాలి. జీడీపీ, ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి గణాంకాలు ఆర్థిక పరిస్థితిని తెలియజేస్తాయి.కానీ వాటి వెనుకఉన్న కారణాలను పూర్తిగా వివరించలేవు.కుటుంబాలు తమ ఆదాయం, పొదుపు, రుణ సదుపాయాలను బట్టి ఖర్చులు నిర్ణయించుకుంటాయి.వ్యాపార సంస్థలు భవిష్యత్తులో గిరాకీ, రుణ వ్యయం, ఆర్థిక అనిశ్చితిని అంచనా వేసుకుని పెట్టుబడులు పెడతాయి. ఈ నిర్ణయాలుపరస్పరం ప్రభావితం చేసుకుంటూ వృద్ధికిఊతమివ్వవచ్చు లేదామంద గమనాన్ని తీవ్రం చేయవచ్చు. ఉదాహరణకు, భవిష్యత్తులో ఉద్యోగాలు తగ్గుతాయనే భయం ప్రజల్లో పెరిగితే వారు ఖర్చులను తగ్గిస్తారు. గిరాకీ పడిపోతుందన్న అంచనాతో సంస్థలు పెట్టుబడులను వాయిదా వేస్తాయి. దీంతోఉత్పత్తి, ఉపాధి మరింత తగ్గే ప్రమాదం ఉంటుంది. ఈ పరస్పర సంబంధాలను అర్థం చేసుకోవడానికి హాల్, వుడ్‌ఫోర్డ్ పరిశోధనలు బలమైన పునాదిని అందించాయి. ప్రజలు ప్రస్తుత ఆదాయాన్నే కాకుండా భవిష్యత్తులో వచ్చే ఆదాయాన్ని కూడా అంచనా వేసుకుని ఖర్చులు చేస్తారని హాల్ పరిశోధనలు వివరించాయి. ఉద్యోగం, వేతనం, భవిష్యత్తు అవకాశాలపై నమ్మకం ఉంటే తాత్కాలిక ఇబ్బందుల్లోనూ కొందరు ఖర్చులను కొనసాగిస్తారు. అనిశ్చితి పెరిగితే ఖర్చులు తగ్గిస్తారు. అయితే, పొదుపు తక్కువగా ఉండి, రుణ సదుపాయాలు పరిమితంగా ఉన్న కుటుంబాలకు ఆదాయం తగ్గిన వెంటనే ఖర్చులు తగ్గించడం తప్ప మరో మార్గం ఉండకపోవచ్చు. అందువల్ల ఒకే స్థాయిలో ఆదాయం తగ్గినప్పటికీ అన్ని కుటుంబాలపై దాని ప్రభావం ఒకేలా ఉండదు. ఈ వ్యత్యాసాలను గుర్తించడం ఆర్థిక విధానాలను సమర్థంగా రూపొందించేందుకు అవసరం. ఈ ప్రవర్తనకు ద్రవ్య విధానాన్ని అనుసంధానించడంలో వుడ్‌ఫోర్డ్ పరిశోధనలు కీలకమయ్యాయి. కేంద్ర బ్యాంకు ప్రస్తుత వడ్డీరేటును నిర్ణయించడమే కాకుండా, భవిష్యత్తులో తన విధానం ఎలా ఉండబోతోందన్న విషయంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. అలా కల్పించే నమ్మకం రుణాలు తీసుకోవడం, ఖర్చులు చేయడం, ధరలు నిర్ణయించుకోవడం వంటి నిర్ణయాలను ప్రభావితం చేస్తుంది. వడ్డీ రేట్లు భవిష్యత్తులో పెరుగుతాయనే అంచనా ఉంటే కొన్ని కుటుంబాలు,సంస్థలు ముందుగానే తమ ఆర్థిక నిర్ణయాలను మార్చుకోవచ్చు. అదే విధానాలపై నమ్మకం ఉంటే అనిశ్చితి తగ్గి దీర్ఘకాలిక ప్రణాళికలకు అవకాశం ఏర్పడుతుంది. ముఖ్యంగా ధరలు నిరంతరం పెరుగుతాయన్న అంచనాలు బలపడుతున్నప్పుడు లేదా ఆర్థిక కార్యకలాపాలు బలహీనపడినప్పుడు కేంద్ర బ్యాంకు విశ్వసనీయతకు ప్రాధాన్యం పెరుగుతుంది. భారతదేశంలో వృద్ధిని కొనసాగిస్తూనే ప్రజల కొనుగోలు శక్తిని కాపాడుకోవడం ప్రధాన సవాలు.అధికారిక అంచనాల ప్రకారం,2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వాస్తవ జీడీపీ వృద్ధి 7.8 శాతంగా నమోదైంది. అయితే, ఈ గణాంకం ఒక్కటే ప్రజల ఆదాయాలు, ఉపాధి అవకాశాలు, జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయని నిరూపించదు. వృద్ధి ఫలి



తాలు ఉత్పాదక పెట్టుబడులు, స్థిరమైన ఉపాధి, కుటుంబాల కొనుగోలు శక్తిగా ఎంతవరకు మారుతున్నాయో కూడా పరిశీలించాలి. ఆర్థిక వృద్ధి వేగంగా ఉన్నప్పటికీ ఉద్యోగాల కల్పన బలహీనంగా ఉంటే, ఆదాయాలు కొద్దిమంది వర్గాలకే ఎక్కువగా పరిమితమైతే దేశీయ గిరాకీకి అవసరమైన విస్తృత పునాది ఏర్పడదు. అందువల్ల వృద్ధి రేటుతోపాటు దాని నాణ్యత, ప్రయోజనాల విస్తరణను కూడా అంచనా వేయాలి. ఆహార ధరలు పెరిగినప్పుడు తక్కువ ఆదాయ కుటుంబాలు తమ సంపాదనలో అధిక భాగాన్ని నిత్యావసరాలకే ఖర్చు చేయాల్సి వస్తుంది.ఇతర వస్తువులు, సేవలపై వ్యయం తగ్గడంతో వాటికి గిరాకీపడిపోవచ్చు. దాని ప్రభావం ఉత్పత్తి, ఉపాధిపై కూడా పడుతుంది. అంటే, సరఫరాలో ఏర్పడిన సమస్యతో మొదలైన ధరలపెరుగుదల క్రమంగా మొత్తం ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయవచ్చు. అంతేకాక, నిత్యావసరాల ధరలు పెరిగినప్పుడు కుటుంబాలు విద్య, ఆరోగ్యం, ఇతర ముఖ్యమైన అవసరాలపై ఖర్చులను కూడా తగ్గించుకునే పరిస్థితి రావచ్చు. దీనిప్రభావం తక్షణ వినియోగానికే పరిమితం కాకుండా ప్రజల జీవన ప్రమాణాలపైనా పడుతుంది.అందువల్ల కొనుగోలు శక్తిని కాపాడటం సామాజిక సంక్షేమానికే కాకుండా దేశీయ గిరాకీ నిలకడకు కూడా అవసరం. ఈనేపథ్యంలో భారతీయ రిజర్వ్‌బ్యాంకు ధరలు పెరగడానికి గల కారణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలి. గిరాకీ అధికమవడంవల్ల ధరలు పెరుగుతున్నప్పుడు వడ్డీరేట్ల పెంపు రుణాలు, ఖర్చులను తగ్గించి ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయవచ్చు. కానీ ఆహార కొరత, రవాణా సమస్యలు లేదా అంతర్జాతీయ ఇంధన ధరల పెరుగుదలను వడ్డీ రేట్లతో పరిష్కరించలేం. ఇలాంటి సందర్భాల్లో ఉత్పత్తిని పెంచడం, నిల్వ సదుపాయాలను మెరుగుపరచడం, రవాణా సమస్యలను తొలగించడం అవసరం. అదే సమయంలో ధరల పెరుగుదల దీర్ఘకాలం కొనసాగితే ప్రజలు,వ్యాపార సంస్థలు భవిష్యత్తులోనూ ధరలు పెరుగుతాయని భావించి తమ నిర్ణయాలను మార్చుకోవచ్చు.అందువల్ల ద్రవ్యోల్బణం మూల కారణాన్ని గుర్తించడంతోపాటు అది ఇతర రంగాలకువ్యాపించే ప్రమాదాన్ని కూడా విధాన నిర్ణేతలు అంచనా వేయాలి. ప్రభుత్వ ఆర్థిక విధానం కూడా ఇదే సమతుల్యతను పాటించాలి. రహదారులు, రైల్వేలు, విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు ఉపాధిని పెంచడంతోపాటు దీర్ఘకాలిక ఉత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయి.రైతులకు మెరుగైన నిల్వ, రవాణా సదుపాయాలు అందుబాటులో ఉంటే పంట నష్టాలు తగ్గి సరఫరా వ్యవస్థ బలపడుతుంది. ధరల పెరుగుదలతో ఇబ్బందిపడే వర్గాలకు లక్షిత సాయం అందించాలి. అదే సమయంలో ప్రణాళికలేని రాయితీలు, అధికప్రభుత్వ వ్యయాలు ఆర్థిక భారాన్ని పెంచకుండా జాగ్రత్తపడాలి.అవసరమైనవారికి అండగా నిలుస్తూనే పెట్టుబడులు, ఉత్పాదకత, ఉపాధికి ఆటంకం కలగకుండా చూడాలి. ద్రవ్యోల్బణం, బలహీనమైన గిరాకీ, అంతర్జాతీయ అనిశ్చితి ఒకేసారి ఎదురైనప్పుడు ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంకు సమన్వయంతో వ్యవహరించాలి. ఆర్థిక నమూనాలు విధాన నిర్ణయాలకు దిశానిర్దేశం చేయగలవు కానీ అన్నిసమస్యలకు పరిష్కారం చూపలేవు. చిన్న వ్యాపార సంస్థలు రుణాలపై ఎక్కువగా ఆధారపడవచ్చు. పెద్దకంపెనీలకు నిధుల లభ్యత మెరుగ్గా ఉండవచ్చు. అందువల్ల వడ్డీరేట్ల మార్పు అందరిపై ఒకే ప్రభావం చూపదు. చిన్న సంస్థలకు రుణవ్యయం పెరిగితే కొత్త పెట్టుబడులు పెట్టడం, కార్మికులను నియమించుకోవడం కష్టమవుతుంది. మరోవైపు, ధరల పెరుగుదల వల్ల ముడిసరుకు ఖర్చులు పెరిగినా వాటిని వినియోగదారులపై పూర్తిగా మోపలేని సంస్థల లాభాలు తగ్గవచ్చు. ఈ వ్యత్యాసాలను గుర్తించేందుకు విశ్వసనీయమైన గణాంకాలు, సమస్యలపై సరైన అంచనా, విధానాల ఫలితాలపై నిరంతర సమీక్ష అవసరం. భారతదేశం ముందున్న లక్ష్యం ద్రవ్యోల్బణాన్ని అదుపు చేస్తూ పెట్టుబడులు, ఉపాధిని పెంచడం, ప్రజల కొనుగోలు శక్తిని కాపాడటం. ఇందుకోసం వడ్డీ రేట్ల మార్పులతోపాటు ప్రభుత్వ పెట్టుబడులు, ఉత్పత్తి పెంపు, సరఫరా వ్యవస్థల మెరుగుదల వంటి చర్యలను అవసరానికి అనుగుణంగా అమలు చేయాలి. ఆర్థిక విధానాల లక్ష్యం కేవలం గణాంకాల్లో మెరుగుదల చూపడం కాకుండా,ప్రజల జీవితాల్లో స్థిరత్వాన్ని పెంచడం కూడా కావాలి. దాని ప్రయోజనాలు విస్తృత వర్గాలకు చేరినప్పుడే ఆర్థిక వృద్ధి నిజమైన అభివృద్ధిగా మారుతుంది.

# ఎల్‌నినో నేర్పేను... నీటి విలువ!

కొలను వెంకటేశ్వర రెడ్డి

ప్రతి నీటి చుక్క విలువైనదే, డేటా సెంటర్ల నీటి అవసరాలపైనా ముందుచూపు అవసరమే కేప్‌టౌన్‌లో తలెత్తిన తీవ్రమైన నీటి సంక్షోభం,మహారాష్ట్రలోని లాతూర్‌కు రైళ్ల ద్వారా నీటిని తరలించిన పరిస్థితులు మనకు ఇచ్చిన హెచ్చరిక ఒక్కటే, నీరులేని అభివృద్ధికి అర్థంలేదు. హైదరాబాద్ జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గుతున్నాయన్న వార్తలు, భూగర్భ జలాలు అడుగంటుతున్న వాస్తవాలు మనల్ని అప్రమత్తం చేయాలి. వర్షాలు తగ్గినప్పుడు, అవసరానికి సరిపడా నీరుఅందుబాటులో లేనప్పుడు, నిన్నటి నిర్లక్ష్యమే రేపటి సంక్షోభంగా మారుతుంది. చెరువుల ను పూడ్చి భవనాలు నిర్మించడం, అడవులను నరికివేయ డం, వర్షపు నీరుభూమిలోకి ఇంకే మార్గాలను మూసివేయ డం, నీటిని విచ్చలవిడిగా వాడటం, ఇవన్నీ జలసంక్షోభా నికి కారణాలే. కుళాయి తిప్పితే నీరు వస్తుందనే నమ్మకం తో వాహనాలను పైపులతో కడగడం, ర్యాంపులు,సెల్లార్లు, రోడ్లపై నీటిని పారించడం సాధారణమైపోయింది. కానీ ఆ నీరు ఎక్కడి నుంచి వస్తోంది? తిరిగి మన భూగర్భ జలా లను నింపేందుకు మనం ఏం చేస్తున్నాం? ఈ ప్రశ్నలు ప్రతి ఒక్కరినీ వెంటాడాలి. వ్యక్తిగత పొదుపుతో పాటు పారిశ్రామిక బాధ్యత కూడా ముఖ్యమే. ఇక్కడ మరో కీలక మైన అంశాన్ని విస్మరించకూడదు. తెలంగాణను దేశంలోనే ప్రధాన డేటా సెంటర్ కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం పెట్టుబడులు, ఉద్యోగాలు, సాంకేతిక అభివృద్ధికి అవకాశాలను కల్పించవచ్చు. అయితే, కృత్రిమ మేధ, క్లౌడ్ కంప్యూటింగ్ సేవలకు అవసరమైన డేటాసెంటర్లలోకంప్యూ టర్లను చల్లబరచడానికి గణనీయమైన నీరు, విద్యుత్తు అవ సరమవుతాయి. దేశంలోని డేటా సెంటర్లలో సగానికి పైగా నీటి ఒత్తిడి ఉన్న ప్రాంతాల్లోనే ఉన్నాయని వరల్డ్‌రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ ఇండియా అధ్యయనం హెచ్చరిస్తోంది. తెలంగాణ కూడా ఈసవాలును ఎదుర్కొంటున్న రాష్ట్రాల్లోఒకటి. ఈ పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకే ఇబ్బందులు ఎదురయ్యే ప్రాంతాల్లో భారీ డేటా సెంటర్లకు అనుమతులు ఇచ్చేటప్పుడు వాటి నీటి అవసరాలను సమగ్రంగా అంచనా వేయడం తప్పనిసరి. అభివృద్ధిని వ్యతిరేకించడం పరిష్కారం కాదు. కానీ ప్రజల తాగునీటి అవసరాల కంటే పరిశ్రమల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడం కూడా సరైన విధానం కాదు. డేటా సెంటర్లకు సాధ్యమైనంత వరకుశుద్ధి చేసిన మురుగునీటిని వినియోగించడం, నీటి పునర్వినియోగ వ్యవస్థలను తప్పనిసరి చేయడం,తక్కువ నీరు అవసరమయ్యే శీతలీకరణ సాంకేతికతలను ప్రోత్సహించడం అవసరం. ప్రతి ప్రాజెక్టుకు రోజువారీ నీటి అవసరం, నీటి వనరు, భూగర్భజలాలపై ప్రభావం, అత్యవసర పరిస్థితుల్లో నీటి వినియోగ ప్రణాళికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. పరిశ్రమలు తెచ్చేపెట్టుబడుల లెక్కలతోపాటుఅవి వినియోగించే నీటి లెక్కలూ ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలి.కారుతున్న కుళాయిలను వెంటనే బాగుచేయాలి.వాహనాలను పైపులతో కాకుండా బకెట్‌తో కడగాలి. రోజు వారీ శుభ్రతకు నీటినిపారబోయకుండా చీపురుతోఊడ్చాలి. కూరగాయలు కడిగిన నీటిని మొక్కలకు ఉపయోగించాలి. ప్రతి భవనంలో వర్షపు నీటిసంరక్షణ, నీటి పునర్వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలి. సమాజంలో యువత ముందు కొచ్చి ఇంటింటికీవెళ్లి నీటిపొదుపు ప్రాధాన్యాన్ని వివరించాలి.ప్రతి కుటుంబం రోజూ కొంతనీటిని ఆదా చేస్తే సమా జానికి

# మరువలేని చారిత్రక శోధకుడు డా.ముదిగొండ

ఎ.వి.వి ప్రసాద్

కొందరు చరిత్రను సృష్టిస్తారు. మరికొందరు ఆ చరిత్రను రచిస్తారు. అయితే చరిత్ర రచనలో చరిత్రను సృష్టించేవారు అరుదుగా కనిపిస్తారు. వారిలో అగ్రగణ్యులు డా. ముదిగొండ శివప్రసాద్. చరిత్రలోని ఎన్నో అంశాలను తీసుకొని ప్రామాణికత తగ్గకుండా రచనలు చేసినవారిసంఖ్య ఆధునికుల్లో వేళ్లమీద లెక్కించవచ్చు. చారిత్రక అంశాలతో నవలారచన చేసి 'చారిత్రక నవలా చక్రవర్తి' బిరుదు అందుకొన్నది కూడా ఆయనే. 'ఎ జనరేషన్ విచ్ ఇగ్నోర్స్ హిస్టరీ హాజ్ నో పాస్ట్ నో ఫ్యూచర్' అన్నాడు ప్రముఖ ఆంగ్ల రచయిత రాబర్ట్ ఎ హెన్లెన్. అంటే చరిత్రను విస్మరించే వారికి గతమూ ఉండదు, భవిష్యత్తూ ఉండదన్నమాట, దానిని బాగా ఆకళింపు చేసుకొన్నందునో ఏమో! తాతలనాటి కథలన్నీ తవ్వితీసి, వాటిలోని వాస్తవాలను వడబోసి, దానికి తన వర్ణనాశక్తిని జోడించి తెలుగు వారిగత వైభవచరిత్రను టన్నుల కొద్దీ పేర్చారు డా. ముదిగొండ. దేశభక్తి, జాతీయ సమైక్యతా దృష్టి ఉన్న రచయిత నుంచే వాస్తవికతను ప్రతిబింబించే రచనలు జాలువారుతాయి. ఆ రెండు లక్షణాలు పుష్కలంగా ఉన్నందునే నాగానిక, శ్రీలేఖ, శ్రీపదార్చన, తంజావూరు వైభవం వంటి గొప్ప రచనలు చేయగలిగారనిపిస్తుంది. ఆయన రచించిన 150 పైగా గ్రంథాలలో చరిత్రకు దర్పణం పట్టేవి రెండు డజన్లపైనే ఉన్నాయి. ఒక విశ్వనాథ,ఒకనోరి నరసింహశాస్త్రి తరహాలో ఒక ముదిగొండ అనిపించుకొన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన ఒక చారిత్రక రచనల కొండ. ఆంధ్రుల చరిత్ర గురించి గతంలో అనేక మంది పండిత కవులు పలు గ్రంథాలు రచించినా వాటిలో కల్పితాలు ఎక్కువ. అందుకే అవి కావ్యాలుగా వన్నెకెక్కాయి. ఆ మార్గాన్ని ప్రక్షాళనం చేసి చరిత్రను వాస్తవిక దృక్పథంతో అందించే ప్రయత్నం చేశారు ముదిగొండ. శాతవాహనులు, కాకతీయులు, విజయనగర, తంజావూరు నాయకరాజులు, ముసునూరు రాజవంశాల చరిత్రలు తీసుకొని ఎన్నో నవలలుగా అందించారు. కేవలం శాతవాహనుల ఇతివృత్తాలతోనే ఆరు నవలలు రాశారు. కాకతీయులు కాలం నాటి చరిత్రను అందించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొన్నారు. 'తంజావూరు విజయం' చారిత్రక రచనల్లోనే ఆణిముత్యం అనిచెప్పవచ్చు. ఆ ఒక్క పుస్తకం 3లక్షల ప్రతులు పైగా అమ్ముడయిందంటే ఆయన రచనలకు గల పాఠకాదరణ ఎంతటితో ఊహించుకోవచ్చు. హైందవజాతి వైభవోజ్వల చరిత్రను మథించి, తాను ఏర్పరచుకున్న బాటలోదానిని పదిమందికి పరిచయం చేయడానికి శ్రీలేఖ, శ్రావణి, నాగపూర్ణిమ,అమృతోదయం వంటి మేలిమి రచనలుచేశారు. చరిత్ర అంటే రాజులు, యుద్ధాలు, తేదీలు, వాటి సమాహారంగా గాక ఆయా పాత్రలతో ఒక సజీవమైన కథగా రూపొందించి, ఒక గొప్ప చరిత్రను తెలుసుకొన్నామనే అనుభూతి పాఠకునిలో కలిగిస్తే రచయిత ప్రతిభకు అంతకు మించిన కొలమానం ఏముంటుంది! ప్రాచీన భారతీయ, గ్రీకు సాహిత్యం, నాటకాలు, తత్వశాస్త్రాన్ని బాగా ఆకళింపు చేసుకొని, ఆసారాన్ని తెలుగు పాఠకులకు తగినట్లుగా అందించారు ముదిగొండ. వంశధార, బసవగీత, గంగ నుంచి గంగవరకు, పుష్యమిత్ర వంటి రచనలు పరిశీలిస్తే ఇదే విషయం అర్థమవుతుంది. అందుకే ఆయన చారిత్రక రచనలు కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో పాఠ్యగ్రంథాలుగాగౌరవాన్ని అందుకొన్నాయి. ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని ఆకులల్లూరులో 1940లో జన్మించిన శివప్రసాద్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పదవీ విరమణకుముందు కొన్ని పత్రికలకు సంపాదకత్వం కూడావహించారు. డా.సి.నారాయణ రెడ్డి మార్గదర్శకత్వంలో 'ఆధునికాంధ్ర కవిత్వంపై



ఆచార్య ముదిగొండ శివప్రసాద్

ఉద్యమాల ప్రభావం' అనే అంశంపై పరిశోధనతో డాక్టరేట్ పొందారు. ప్రాచీన ఆంధ్రుల రాజకీయ వైభవం,ధాన్యకటక ప్రాంత చరిత్ర, బౌద్ధసంస్కృతి, అప్పటి సామాజిక జీవన విధానాలు తెలియాలంటే శ్రీలేఖ, శ్రావణి, వసంతగౌతమి వంటి రచనలు చదవాల్సిందే. ఆచార్య నాగార్జునుని కాలం నాటి చారిత్రక పరిస్థితులపై అవగాహన కలగాలంటే 'నాగపూర్ణిమ' చదవాలి. కాకతీయుల చరిత్రపై కూడా ఎన్నో ప్రామాణిక రచనలు ఆయన చేశారు. వేయిస్తంభాల గుడిని నేపథ్యంగా తీసుకొని రాసిన 'ఆవాహన' నవల కాకతీయుల కాలం నాటి చారిత్రక పరిణామాతో 'మాలిక్ కాఫర్' నవల, సమ్మక్కసారలమ్మల చరిత్ర, తెలంగాణ ప్రాంత జానపద సంప్రదాయాల నేపథ్యంలో 'చంద్రకళ' వంటి రచనలు చేశారు. కాకతీయ సామ్రాజ్యపతనం తరువాత ఆంధ్రదేశ చరిత్రలో కీలకపాత్ర పోషించిన ముసునూరు నాయకుల చరిత్రను 'అమృతోదయం' ద్వారా ఆ పాఠకులకు అందించారు. ఆయన పరిశోధనా వైదుష్యానికి ప్రతీకగా నిలిచిన గ్రంథం 'కాకతీయ కళాదర్శనం'. ఆ కాలంలోని రాజ్యపాలన, సామాజిక వ్యవస్థ,సాహిత్య వికాసం,శిల్పకళ, ఆలయ నిర్మాణ సంప్రదాయాలు, సాంస్కృతిక జీవనాన్ని విస్తృతంగా విశ్లేషించిన పరిశోధనాత్మక రచన ఇది. నాయక రాజుల కాలంలోని తంజావూరు సాంస్కృతిక వైభవం,తెలుగుభాషా సాహిత్యాలకు అక్కడ లభించిన ఆదరణ, రాజ్యపాలన, కళాపోషణను అద్భుతంగా చిత్రీకరించిన 'తంజావూరు విజయం' విశేషమైన పాఠకాదరణ పొందిన రచనగాచెప్పవచ్చు. చారిత్రక నవలలేగాక పట్టాభి, రెసిడెన్సీ,మహాసర్గ, సమ్రాట్ పుష్యమిత్ర, సగం విరిగిన చంద్రుడు వంటి అనేకానేక సాహితీ రచనలు కూడా ఆయన చేశారు. కళనే జీవితంగా స్వీకరించిన ఓ కళాకారిణి మనో ప్రపంచాన్ని 'ప్రతిభ' నవలలో ఆయన ఆవిష్కరించిన తీరు అనుపమానం. వంశధార నవలలో చలనచిత్ర రంగంలోని రచయిత జీవితం, మానవ సంబంధాలను కథావస్తువుగా తీసుకొన్నారు. నన్నయభట్టు మళ్లీ పుట్టాడు వంటి వ్యంగ్యరచనలు సమకాలీన భాషా సాహిత్య పరిస్థితులను అద్దంపడతాయి. జాతీయ వాదం, హిందూధర్మ పరిరక్షణ, సాంస్కృతిక చైతన్యం ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. పాల్కురికి సోమనాథునిపై ఆయన రచించిన ఆంగ్ల పరిశోధనాత్మక పరిచయ గ్రంథం ఎన్నో ప్రశంసలనందుకొంది. సమకాలీన సామాజిక పరిస్థితులపై వివిధపత్రికల్లో వందలాది వ్యాసాలను కూడా ఆయన రచించారు. నికషోపలం, శివవాక్యం, వ్యాసదర్శనం వంటి 25 సంపుటాలలో ఆ వ్యాసాలను గ్రంథస్థం చేశారు. కుర్తాళం పీఠాధిపతి చేతులమీదుగా కనకాభిషేకం చేయించుకొన్న ఘనత కూడా ఆయనదే. స్వర్ణగండపెండేరం, స్వర్ణ కంకణ సత్కారాలు అనేకానేకం. ఆయన స్వీయ చరిత్ర చదివితే ఇటువంటి ఇంకా అనేక అద్భుతమైన విషయాలు తెలుస్తాయి. ఆచార్య ముదిగొండ రచనావైదుష్యాన్ని భవిష్యత్ తరాలకు భద్రంగా అందించడం తెలుగువారి బాధ్యతగా భావించాలి. ఇటీవలే, స్వర్గస్థులైన ఆయన రచనలన్నీ 'ముదిగొండ రచనా సర్వస్వం'గా ముద్రించి అందిస్తే మన చరిత్ర, సంస్కృతిని

16-10Pg5exH.qxd:16-10Pg5exH.qxd 1/1/02 5:53 AM Page 1



# సిఇసిని తొలగించాలన్న డిమాండ్‌పై ఇండియా కూటమి నిరసనలో టివికె!



**చెన్నై, అక్టోబరు 15:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం గురువారం చెన్నైలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి నిర్వహించిన నిరసనలో పాల్గొంది. ఓటర్ల జాబితాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు వ్యతిరేకంగా ఈ ఆందో ళన చేపట్టారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనలో టీవీకే పాల్గొనడం ఇదే తొలిసారి. దేశ రాజధాని ఢిల్లీలో ఓటర్ల జాబితాల్లో అక్రమాల ఆరోపణలపై నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో, చెన్నైలో కాంగ్రెస్ ఎంపీ బి. మాణికం ఠాగూర్, తమిళనాడు కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడండి" అనే నినాదంతో ఈ ఆందో ళన నిర్వహించారు. ఇండియా కూటమిలోని ఏడు భాగస్వామ్య పార్టీల నాయకులు ఇందులో పాల్గొన్నారు. ఈనెల 3న ఇండియా కూటమిలో చేరిన తర్వాత, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలని కోరుతూ చేపట్టిన ప్రచారంలో టీవీకే పాల్గొనడం ఇదే మొదటిసారి. ఈ నిరసనలో టీవీకే నాయకుడు, పాఠశాల విద్యాశాఖ మంత్రి ఎ. రాజ్‌మోహన్, విదుత్ చిరుతైగళ్ కచ్చి అధ్యక్షుడు, ఎంపీ తొల్ తిరుమావళవన్, మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి వైకో తదితరులు పాల్గొన్నారు. నిరసన సందర్భంగా మాట్లాడిన వీసీకే నాయకుడు ఎస్.ఎస్. బాలాజీ మాట్లాడుతూ, న్యాయం చివరికి గెలుస్తుందని, ప్రజాస్వామ్యమే విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. ఇండియా కూటమిలో పలు జాతీయ పార్టీలు ఉన్నాయని, తమిళనాడులో మాత్రం భాగస్వామ్య పార్టీల సంఖ్య పరిమితంగా ఉందని తెలిపారు. టీవీకే తమిళనాడు ఇండియా కూటమిలో చేరేందుకు ఆసక్తి వ్యక్తం చేసిందని చెప్పారు. జాతీయస్థాయిలో ఇండియా కూటమి సమావేశమై నప్పుడు టీవీకే అధికారిక చేరికకు ఆమో దం లభిస్తుందని, టీవీకే ఇప్పటికే కూ టమిలో చేరిందని ఆయన వ్యాఖ్యా నించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ ఎంపీ విజయ్‌వసంత్ డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ బీజేపీ తరఫున పనిచేస్తోందని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్య విరుద్ధమని, బీజేపీ ప్రభుత్వం ప్రజల గొంతును వినడం లేదని విమర్శించారు. ఈ నిరసనకు మరింత బలం చేకూర్చేందుకు టీవీకే కూడా పాల్గొంటోందని తెలిపారు. ఈ ఆందోళనలో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అధినేత కె.ఎం. ఖాదర్ మొహిద్దీన్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి. షణ్ముగం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం. వీరపాండియన్, సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి పాల అసైతంబి కూడా పాల్గొన్నారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ తమిళనాడు ఇన్‌ఛార్జ్ నివేదిత్ అల్వాతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు నిరసనకు హాజరయ్యారు. చెన్నైలో జరిగిన ఈ నిరసనకు రాజకీయంగా మరో ప్రాధాన్యం కూడా ఉంది.

కాంగ్రెస్, ద్రవిడ మున్నేట్ర కళగం మధ్య విభేదాలు పెరుగుతున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ నేతృత్వంలోని ఆందోళనలకు డీఎంకే దూరంగా ఉంటూ, గతంలో తన మిత్రపక్షంగా ఉన్న కాంగ్రెస్‌పై నమ్మకద్రోహం చేసిందంటూ విమర్శలు గుప్పించింది. ఈ నేపథ్యంలో టీవీకే ఇండియా కూటమి నిరసనలో పాల్గొనడం తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.



## యుపిలో 19.2 లక్షల దొంగ ఓట్లు చేర్పించారు!

### ఇసిపై ఎంపి అఖిలేష్ ధ్వజం

**లక్నో, అక్టోబరు 15:** కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ), బీజేపీపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఎంపీ అఖిలేష్ యాదవ్ సంచలన ఆరోపణలు చేశారు. ఈసీఐ చేపట్టిన సర్ ప్రక్రియ ద్వారా 19.2 లక్షల దొంగ ఓటర్లను జాబితాలో చేర్చారని అఖిలేష్ ఆరోపించారు. 2027లో జరగనున్న యూపీ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఈసీఐ, బీజేపీ కలిసి ఈ మోసానికి తెరతీశారన్నారు. ఈ మేరకు గురువారం యూపీ రాజధాని లక్నోలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈసీఐ, సర్ ప్రక్రియ, బీజేపీపై విమర్శలు చేశారు. యూపీలో 19,20,732 దొంగ ఓట్లను సమాజ్‌వాదీ పార్టీ గుర్తించింది. ఇందులో ఎలక్షన్ కమిషన్ ప్రచురించని 16.18 లక్షల ఓట్లు ఉన్నాయి. మరో మూడు లక్షల అనుమానిత ఓట్లు ఉన్నాయి. ఈ జాబితా కోసం బూత్ లెవెల్ ఆఫీసర్లపై, ప్రభుత్వ అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ ఒత్తిడి తట్టుకోలేక 29 మంది సిబ్బంది కూడా మరణించారు. యూపీలో అక్టోబర్ 2025 నుంచి ఏప్రిల్ 2026 మధ్య సర్ ప్రక్రియ జరిగింది. అనంతరం ఓటర్ లిస్ట్ వెల్లడైంది. ఇందులో 87.56 లక్షల ఫాం 6 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కొత్త ఓటర్లు కూడా ఉన్నారు. చివరి జాబితాలో 84.3 లక్షల కొత్త ఓటర్లు చేరారు. మొత్తం 87.56 లక్షల ఫాంలు రాగా వాటిలో 71.38 లక్షల దరఖాస్తుల వివరాల్ని మాత్రమే ఈసీ బహిరంగంగా ప్రచురించింది.

# నవంబర్‌లో భారత్‌కు రానున్న నేపాల్ ప్రధాని



**ఖాట్మండు, అక్టోబరు 15:** నేపాల్ ప్రధాని బాలెన్ షా ఆనవాయితీకి చెక్ పెట్టారు. జెన్‌జి ప్రతినిధిగా ప్రధాని పదవి చేపట్టిన ఆయన కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతూ ద్వైపాక్షిక చర్చల కోసం భారత్‌ను ఎంచుకున్నారు. తనకంటే ముందువారు తొలుత చైనా, టర్కీ, యుకె వంటి దేశాలకు వెళ్లగా తను మాత్రం ఇండియాకు తొలి ప్రాధాన్యమిచ్చారు. ఇరుదేశాల మధ్య దౌత్య పరమైన చర్చల కోసం నవంబరులో ఆయన వస్తున్నారు. బాలెన్‌షా ప్రధాని అయ్యాక దేశ ప్రయోజనాల కోసం చేపడుతున్న తొలి విదేశీ పర్యటన ఇదే కావడం విశేషం. జెన్‌జి ఆందోళనల తర్వాత నేపాల్ ప్రధాని పీఠంపై కూర్చున్న బాలెన్ షా భారత్‌తో పర్యటించనున్నారు. ఆనవాయితీ ప్రకారం మాజీ ప్రధానులు తమ తొలి విదేశీ పర్యటనకు ఇతర దేశాలను ఎంచుకోగా ఆయన మాత్రం ఇండియాకు ఓటేశారు. మార్చిలో ప్రధాని పదవి చేపట్టిన ఆయన తొలుత భారత దౌత్యాధికారులతో మాట్లాడేందుకు నిరాకరించినా.. చివరకు పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈ నవంబరులోనే ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చల కోసం బాలెన్‌షా విచ్చేస్తున్నారు. నవంబరు రెండు లేదే మూడో వారంలో ఆయన ఇండియా రానున్నారు. కఠ్మాండు పోస్టు ప్రకారం ఈ పర్యటన సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీతో ఆయన ప్రధాన నిర్మాణపరమైన ప్రాజెక్టులు, సరిహద్దు వివాదాలు, వరదల నియంత్రణ చర్యలు వంటి అంశాలపై చర్చించే అవకాశం ఉంది. సంప్రదాయానికి బ్రేక్ గత రెండు దశాబ్దాల కాలంలో ప్రధానులు తమ తొలి విదేశీ పర్యటనకు భారత్‌ను ఎంచుకోవడం ఇదే మొదటిసారి. 2008లో పుష్పకమాల్ ప్రచండ మొదట చైనాలో పర్యటించారు. 2011లో ప్రధానిగా ఝలనాథ్ ఖనల్ ఐక్యరాజ్య సమితి సమావేశం కోసం టర్కీ వెళ్లారు. ఆపై 2021లో షేర్ బహదూర్ డీబా ప్రధానిగా తొలి ద్వైపాక్షిక చర్చలు యుకెతో జరిపారు. 2021 ప్రధాని కెపి ఓలీ తొలుత భారత్‌లో పర్యటించేందుకు అంగీకరించారు. కానీ, మాట మార్చిన ఆయన చైనాలో పర్యటించారు. కానీ, జెన్‌జి నాయకుడిగా ప్రధాని అయిన బాలెన్ షా మాత్రం తొలి విదేశీ పర్యటనకు ఇండియాను ఎంచుకున్నారు. ఆగస్టులో వరదల విధ్వంసానికి అతలాకుతలమైన నేపాల్‌క భారత్ భారగీ సాయమందించింది. టన్నుల కొద్దీ నిత్యావసరాలు, మందులను వరద బాధితుల సహాయార్థం సైనిక విమానాల్లో తరలించింది. దాంతో.. ఆ కృతజ్ఞతతో ఆయన ఇండియాతో చర్చలకు ప్రాధాన్యం ఇస్తున్నారని సమాచారం.

# మార్నింగ్ వాక్‌కు వెళితే చేతికి విదేశీ కరెన్సీ బ్యాగ్

## నిజాయితీతో పోలీసులకు అప్పగించిన వాకర్



**అజ్మేర్, అక్టోబరు15:** రాజస్థాన్‌లోని అజ్మేర్‌లో ఓ అరుదైన నిజాయతీ ఘటన వెలుగులోకి వచ్చింది. మార్నింగ్ వాక్‌కు వెళ్లిన ఓ వ్యక్తికి దారిలో ఓ బ్యాగు దొరకగా, అందులో ఏకంగా రూ.9.48 లక్షల విలువైన విదేశీ కరెన్సీ, కీలక పత్రాలు ఉన్నాయి. ఏమాత్రం ఆశపడకుండా ఆ వ్యక్తి దానిని పోలీసులకు అప్పగించడంతో వారు అసలు యజమానిని గుర్తించి సురక్షితంగా అందజేశారు. ఈ ఘటనపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. అజ్మేర్‌లోని భోపోన్ కా బాడా ప్రాంతానికి చెందిన రాజేశ్ కుమార్ రోజులాగే మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. సోఫియా కాలేజీ సమీపంలో రోడ్డుపై పడి ఉన్న ఓ బ్యాగును ఆయన గమనించారు. దానిని తెరిచి చూడకుండా నేరుగా సివిల్ లైన్స్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించారు. పోలీసులు ఆ బ్యాగును పరిశీలించగా, అందులో పాస్‌పోర్ట్, కొన్ని ముఖ్యమైన డాక్యుమెంట్లు, భారీ మొత్తంలో విదేశీ కరెన్సీ నోట్లు లభించాయి. బ్యాగులోని పత్రాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టగా, అది పశ్చిమ బెంగాల్‌కు చెందిన సద్దాం ఆలం అనే వ్యక్తిదని తేలింది. ఆయన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ప్రఖ్యాత అజ్మేర్ దర్గాను దర్శించుకోవడానికి ఆయన నగరానికి వచ్చారు. దర్గా దర్శనం అనంతరం ఓ టెంపోలో ప్రయాణిస్తుండగా, ప్రమాదవశాత్తు ఆయన బ్యాగు కింద పడిపోయింది. ఈ విషయం తెలియని సద్దాం ఆలం, తన బ్యాగు ఎక్కడ పోయిందోనని ఆందోళన చెందుతుండగా పోలీసులు ఆయనను సంప్రదించారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న బ్యాగులో 500 దినార్ల నోట్లు, 200 దినార్ల నోటు, 100 దినార్ల నోట్లు, 10 దినార్ల నోట్లు ఉన్నాయి. వీటి మొత్తం విలువ భారత కరెన్సీలో సుమారు రూ.9.48 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ నగదుతో పాటు ఆయన పాస్‌పోర్ట్, ఇతర కీలక పత్రాలను కూడా పోలీసులు సద్దాం ఆలంకు సురక్షితంగా అందజేశారు. పోయాయనుకున్న తన విలువైన వస్తువులు తిరిగి దొరకడంతో సద్దాం ఆలం తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. రాజస్థాన్ పోలీసులకు, అజ్మేర్ ప్రజలకు, ముఖ్యంగా బ్యాగును అప్పగించిన రాజేశ్ కుమార్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. లక్షల రూపాయల విలువైన వస్తువులు కళ్లముందు కనపడినా, ఏమాత్రం చలించకుండా నిజాయతీని చాటుకున్న రాజేశ్ కుమార్‌పై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. ఆయన చేసిన పని ఎందరికో ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు కొనియాడుతున్నారు.

# న్యాయవ్యవస్థను ఎవ్వరూ బెదిరించలేరు! రాహుల్‌గాంధీ వివరణ ఇవ్వాల్సిందే: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, అక్టోబరు 15:** సుప్రీంకోర్టు వైపు నిరసన ర్యాలీ చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీరుపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై ఆయన వివరణ ఇవ్వాల్సిందేనని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలను సహించబోమని, ఎవరూ న్యాయవ్యవస్థను బెదిరించలేరని వ్యాఖ్యా నించారు. అక్టోబర్ 12న రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టు వైపు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఎన్నికల సంఘం నిర్ణయాలను వ్యతిరేకిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం రాహుల్ గాంధీ స్వయంగా సుప్రీంకోర్టుకు వెళ్లి, ఈ అంశంపై ఉమ్మడి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ సందర్భంగా రాహుల్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌తో ప్రధాన న్యాయమూర్తి మాట్లాడారు. ర్యాలీ సందర్భంగా ఏర్పడిన గందరగోళాన్ని ప్రస్తావిస్తూ, రాహుల్ తన చర్యలపై వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు. సర్ రద్దు చేయాలంటూ కాంగ్రెస్ అగ్ర నేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారించింది. అయితే రాహుల్ గాంధీ పాదయాత్రగా వెళ్లి పిటిషన్ వేయడంపై కూడా చర్చకు వచ్చింది. సుప్రీంకోర్టు ప్రాంగణం వరకు పాదయాత్రగా రావడంపై సీనియర్ న్యాయవాది గౌరవ్ భాటియా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనికి సీజేఐ స్పందిస్తూ మేము వాస్తవ ప్రపంచానికి అతీతులం కాదు. మాకు అన్ని విషయాలూ తెలుసు. న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు, అని వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలో రాజకీయ ఊరేగింపు నిర్వహించడాన్ని సీనియర్ న్యాయవాది గౌరవ్ భాటియా తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది ఆమోదయోగ్యం కాదని అన్నారు. న్యాయ వ్యవస్థను బెదిరించి, ఒత్తిడి తెచ్చే ప్రయత్నంగా అభివర్ణించారు. న్యాయవాది వ్యాఖ్యలకు ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని ఇటువంటి ప్రయత్నాలు చాలా బలహీనమైనవని, వాటిని ఎవరూ పట్టించుకోరని సూర్యకాంత్ అన్నారు. తాము వాస్తవ ప్రపంచానికి దూరంగా కూర్చోలేదని తమకు అన్నీ తెలుసని చెప్పారు. ఇక జంతర్ మంతర్ విషయమై సుప్రీంకోర్టు ఆదేశం మేరకు దానిని నిరసన ప్రదేశాల జాబితా నుంచి తొలగించలేదని ఎస్జీ తుషార్ మెహతా పేర్కొన్నారు. ఒక కమిటీ ఆ సూచన చేసింది.

# అరోరాలోని హిందూదేవాలయంపై కాల్పులకు కుట్ర

## నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



**అరోరా(ఇల్లినాయిస్), అక్టోబరు 15:** అమెరికాలోని ఇల్లినాయిస్ రాష్ట్రం, అరోరా నగరంలోని ఒక హిందూ దేవాలయంపై కాల్పులకు కుట్ర పన్నడాన్ని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన భారత్, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని అమెరికా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విదేశాంగ శాఖ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో, ఈ దాడి కుట్ర వెనుక హిందూ వ్యతిరేకత, జాతి విద్వేషం ఉండటం అత్యంత కలవరపరిచే అంశమని పేర్కొంది. ముఖ్యంగా భారత సంతతి ప్రజలను లక్ష్యంగా చేసుకోవడం ఆందోళనను మరింత పెంచుతోందని తెలిపింది. "అమెరికాలో భారత వ్యతిరేక ద్వేషం, జాతి వివక్షపూరిత దాడులు పెరుగుతుండటంపై మా ఆందోళనలు నిజమవుతున్నాయి. ఇలాంటి ద్వేషపూరిత హింస పట్ల ఏమాత్రం సహనం ప్రదర్శించకూడదు. భారత సమాజం రక్షణ కోసం మరింత అప్రమత్తత, కఠిన చర్యలు అవసరమని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఈ ఘటనపై అమెరికా అధికారులు సమగ్ర దర్యాప్తు జరిపి, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపింది. ఈ దాడి కుట్రకు సంబంధించి అమెరికా పోలీసులు 19 ఏళ్ల అలెగ్జాండ్రోస్ పపోరాకిస్ అనే యువకుడిని అరెస్ట్ చేశారు. ఈనెల 11న నిందితుడి నుంచి అనుమానాస్పద ఎలక్ట్రానిక్ సందేశాలు వస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో దర్యాప్తు ప్రారంభించిన అధికారులు, అతడు తన నివాసం నుంచి బయటకు వస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి ఒక రైఫిల్, మందుగుండు నింపిన మ్యాగజైన్లు, వందల సంఖ్యలో తూటాలు, బాడీ ఆర్మర్‌తో కూడిన టాక్టికల్ వెస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ వెస్ట్‌పై ఉన్న ప్యాచ్ తెల్లజాతి ఆధిపత్యాన్ని సమర్థించే సంస్థకు చెందినదిగా గుర్తించారు. అంతేకాకుండా, "నేనెందుకు పోరాడాను: అరోరా షూటర్ మేనిఫెస్టో" పేరుతో రాసిన ఒక డాక్యుమెంట్‌ను కూడా పోలీసులు కనుగొన్నారు. ఇందులో తెల్లజాతి ఆధిపత్య భావజాలంతో పాటు, దక్షిణాసియా వాసులపై, ముఖ్యంగా భారత సంతతి ప్రజలపై హింసకు ప్రేరేపించే రాతలు ఉన్నాయి. నిందితుడు ఈనెల 11న అరోరా ప్రాంతంలోని ఒక హిందూ దేవాలయంపై దాడికి ప్రణాళిక రచించినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక హిందూ ఆలయాలను అప్రమత్తం చేశారు.

# జెఎన్‌యూ లైంగిక వేధింపుల ఆరోపణలు..

## కాంగ్రెస్ ఎంపిపై చర్యలు తీసుకోవాలి

## లోక్‌సభ స్పీకర్‌ను కోరిన బిజెపి మహిళా ఎంపిలు



**న్యూఢిల్లీ, అక్టోబరు15:** జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ)లో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ ఎంపీ అంగోంచా బిమోల్ అకోయిజామ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ మహిళా ఎంపీల ప్రతినిధి బృందం గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసింది. బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు, ఎంపీ రూప్ కుమారి చౌధరి నేతృత్వంలోని ఈ బృందంలో మహిళా మోర్చా ఇన్‌ఛార్జి, ఎంపీ డి. పురందేశ్వరి కూడా ఉన్నారు. పార్లమెంట్ భవనంలో స్పీకర్‌తో వారు సమావేశమయ్యారు. మణిపూర్‌లోని ఇన్నర్ మణిపూర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ ఎంపీ అకోయిజామ్‌పై చర్యలు తీసుకోవాలంటూ బీజేపీ ఒత్తిడి పెంచుతున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. లైంగిక దుష్ప్రవర్తనకు సంబంధించిన ఆరోపణలపై జేఎన్‌యూ అంతర్గత విచారణ జరిపిన అనంతరం ఆయనను ప్రొఫెసర్ పదవి నుంచి తొలగించినట్లు వార్తలు వెలువడ్డాయి. అకోయిజామ్‌ను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నాయకత్వం స్పందించిన తీరును కూడా ప్రశ్నిస్తోంది. బీజేపీ మహిళా ఎంపీల బృందం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి, ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని కోరింది. అకోయిజామ్‌ను పార్లమెంట్ నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఆయనపై ఫిర్యాదులు చేసిన విద్యార్థినుల భద్రతపై కూడా ప్రతినిధి బృందం ఆందోళన వ్యక్తం చేసింది. బుధవారం బీజేపీ మహిళా మోర్చా ప్రతినిధులు జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు విజయ కిశోర్ రహత్కర్‌ను కలిసి, ఎంపీపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఎన్నికల సంఘానికి సుప్రీం నోటీసులు!

**న్యూఢిల్లీ,అక్టోబరు 15:** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణలో భారీగా ఓట్ల తొలగింపు, అక్రమాలు జరిగాయంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు నేడు ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఎస్ఐఆర్ వ్యవహారంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నేతలు ఇటీవల సుప్రీంకోర్టుకు ర్యాలీగా వెళ్లి ఉమ్మడి పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో జరిగిన ఓట్ల తొలగింపులు, మార్పులపై స్వతంత్రంగా ఆడిట్ నిర్వహించాలని ప్రతిపక్ష నేతలు కోరారు. ఇందుకోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో సాంకేతిక నిపుణులు, ప్రముఖ పౌరులతో కూడిన స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఎలాంటి ఓటరునైనా ముందస్తు నోటీసు ఇవ్వకుండా, తన వాదన వినిపించే అవకాశం కల్పించ కుండా ఓటర్ల జాబితా నుంచి తొలగించ కుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పంజాబ్‌తో పాటు ఎన్నికలు జరగనున్న ఇతర రాష్ట్రాల్లో అర్హులైన ఓటర్లు చట్టం అనుమతించిన చివరి తేదీ వరకు తమ పేర్లను నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. పిటిషన్‌పై తుది నిర్ణయం వెలువడే వరకు దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని అభ్యర్థించారు. రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అఖిలేశ్ యాదవ్, తేజస్వీ ప్రసాద్ యాదవ్, సౌగతా రాయ్, సుప్రియా సూలే, సంజయ్ రౌత్, డి.రాజా తదితరులు ఈ పిటిషన్‌లో సహ పిటిషనర్లుగా ఉన్నారు.

# ఇంటర్నెట్ నిలిపివేతపై సుప్రీంకు క్షమాపణలు చెప్పిన కేంద్రం

**న్యూఢిల్లీ, అక్టోబరు 15:** దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల సందర్భంగా ఇంటర్నెట్ సేవల నిలిపివేతకు సంబంధించి దాఖలైన కోర్టు ధిక్కరణ కేసులో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ వ్యవహారంపై కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సుప్రీంకోర్టుకు బేషరతుగా క్షమాపణలు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం అత్యున్నత న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఈనెల 10న ఢిల్లీలో భారీ నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 9వ తేదీ రాత్రి 10 గంటల నుంచి 10వ తేదీ రాత్రి 10 గంటల వరకు, అంటే 24 గంటల పాటు రైసీనా హిల్స్ పరిసరాల్లోని 4 కిలోమీటర్ల వ్యాసార్థంలో సెల్యులర్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. అయితే, వైఫై, బ్రాడ్‌బ్యాండ్ వంటి సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించలేదని హోం సెక్రటరీ తన అఫిడవిట్‌లో స్పష్టం చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా ఢిల్లీ పోలీసులు చేసిన అభ్యర్థన మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. నిరసనల సందర్భంగా మెట్రో, రైళ్లు సహా ఇతర అత్యవసర సేవలను పూర్తిగా నిలిపివేయవద్దని సుప్రీంకోర్టు గతంలో ఆదేశాలు జారీ చేసింది. ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం ఈ ఆదేశాలను ఉల్లంఘించడమేనంటూ కోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం, కేంద్ర హోం కార్యదర్శి, ఢిల్లీ పోలీస్ కమిషనర్ సహా ఇతర ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులోనే హోం సెక్రటరీ తాజాగా క్షమాపణలు చెబుతూ అఫిడవిట్ సమర్పించారు. మరోవైపు, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ సైతం తన అఫిడవిట్‌ను కోర్టుకు సమర్పించారు. జులై 20న జరిగిన నిరసనల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం, నిరసనకారులను నియంత్రించడం కష్టతరంగా మారడం, సామాన్య ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలగడం వంటి కారణాలతో 10న తలపెట్టిన ఆందోళనలకు అనుమతి నిరాకరించినట్లు ఆయన తెలిపారు. ఈ అఫిడవిట్‌లను పరిశీలించిన అనంతరం సుప్రీంకోర్టు తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనుంది.

# జననీతి పార్టీ ఏర్పాటు చేసిన లక్నో మాజీ ఐఎఎస్



**లక్నో, అక్టోబరు15:** మాజీ ఐఏఎస్ ఆఫీసర్ దివ్యా మిట్టల్ తన రాజకీయ పార్టీ పేరును ప్రకటించారు. జన నీతి భారత్ అని పేరు పెట్టారు. ఐఏఎస్ గా ఆమె స్వచ్ఛంధ పదవీవిరమణ తీసుకున్న విషయం తెలిసిందే. ఉత్తరప్రదేశ్‌లో 2027లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేయనున్నట్లు దివ్యా మిట్టల్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఇవాళ ఆమె తన ఎక్స్ అకౌంట్‌లో ఓ వీడియోను పోస్టు చేశారు. విధాన రూపకల్పనలో ప్రజలను కేంద్రబిందువుగా మార్చనున్నట్లు ఆమె తెలిపారు. అయిదేళ్ల సమయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించేలా చేయనున్నట్లు చెప్పారు. జన నీతి పార్టీలో మీరే పాలిస్తారని ఆమె అన్నారు. ఐఐటీ ఢిల్లీ, ఐఐఎం బెంగుళూరు, వాల్ స్ట్రీట్ ట్రేడర్ అయిన దివ్యా మిట్టల్.. సుమారు 13 ఏళ్ల పాటు ఐఏఎస్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆగస్టు 30వ తేదీన ఆమె తన పదవికి రాజీనామా చేశారు. రాజకీయాల్లోకి వస్తున్నట్లు ఆమె సెప్టెంబర్ 29వ తేదీన ప్రకటించారు. కొత్త పార్టీ ఏర్పాటు గురించి ఆమె చెబుతూ.. దేశంలో రాజ కీయ పార్టీల కొరత ఏమీ లేదని, కానీ ప్రజా సమ స్యలను ఆల కించే పార్టీలు లేవని, కొన్ని పార్టీ లు కొందర్ని మాత్ర మే వింటు న్నా యని ఆమె అన్నా రు. జననీతి భారత్ ప్రతినిధులు మాత్రం ప్రజలకు జవాబుదారులుగా ఉంటారన్నారు. జన నీతి భారత్ వద్ద ప్రకటనల కోసం పెద్దగా డబ్బులు లేవని,

కానీ ఇంటింటి ప్రచారంతో రంగంలోకి దిగనున్నట్లు ఆమె తెలిపారు.

రాజకీయాలు కాదు, జననీతి అన్న నినాదాన్ని ఆమె వినిపించారు.

రాజీనామా చేస్తున్న సమయంలో ఆమె లక్నో రెవన్యూ శాఖలో స్పెషల్ సెక్రటరీగా ఉన్నారు.

# సంక్షిప్త వార్తలు

## మా దేశ వ్యవహారాల్లో విదేశీ జోక్యం వద్దు: అభిజిత్ దీప్కే



**న్యూఢిల్లీ, అక్టోబరు 15:** కాక్రోచ్ జనతా పార్టీకి అమెరికా నుంచి నిధులు అందుతున్నట్లు సింగర్ మేరీ మిల్‌బెన్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలకు సిజెపి ఫౌండర్ అభిజీత్ దీప్కే కౌంటర్ ఇచ్చారు. మా దేశ వ్యవహారాల్లో విదేశీయుల జోక్యం అవసరం లేదని దీప్కే అన్నారు. అమెరికాలో ఉన్న డోనార్లు సిజెపికి నిధులు అందజేస్తున్నట్లు మిల్‌బెన్ తన ఎక్స్ లో పోస్టు చేశారు. విచ్ఛిన్నకర విధానంతో పనిచేస్తున్న సిజెపిని ఢీకొట్టేందుకు భారతీయ యువ దేశభక్తులు శాంతియుత ప్రదర్శన చేపట్టాలని మిల్‌బెన్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన దీప్కే.. ప్రధాని ఎందుకు అమెరికన్ల మద్దతు కోరుతున్నారు, భారత అంతర్గత వ్యవహారాల్లో విదేశీయులు జోక్యం చేసుకునే హక్కు ఎవరు ఇచ్చారని దీప్కే ప్రశ్నించారు.

## క్రూయిజ్ మిస్సైళ్లను పరీక్షించిన ఉత్తర కొరియా

**సియోల్, అక్టోబరు 15:** ఉత్తర కొరియా తన ఆయుధ సంపదను పెంచుకుంటోంది. అయితే జలాంతర్గాముల నుంచి ఫైర్ చేసే క్రూయిజ్ క్షిపణులను పరీక్షించినట్లు ఉత్తర కొరియా చెప్పింది. రెండు రకాల క్షిపణులను మిలిటరీ పరీక్షించినట్లు ఉత్తరకొరియా మీడియా పేర్కొన్నది. బుధవారం తూర్పు జలాల్లో ఈ పరీక్ష జరిగినట్లు చెప్పింది. వ్యూహాత్మక ఆయుధాలు.. న్యూక్లియర్ వార్‌హెడ్స్‌ను మోసుకెళ్లగలవని ఉత్తర కొరియా చెప్పింది. అయితే తాజా పరీక్ష నిజంగా సబ్‌మెరైన్ నుంచి జరిగిందా లేక అండర్‌వాటర్ టెస్ట్ ఫ్లాట్‌ఫామ్‌లో పరీక్ష జరిగిందా ఇంకా తెలియదు. ఈ పరీక్షతో తమ అండర్ వాటర్ యుద్ధ వ్యవస్థను పరీక్షించినట్లు స్థానిక మీడియా తెలిపింది. నేవీ సామర్థ్యాన్ని పెంచుకున్నట్లు చెప్పింది. ఈ పరీక్షలపై దక్షిణ కొరియా మిలిటరీ ఇంకా స్పందించలేదు.

## సిఇసిపై ఉద్యమానికి బంగ్లాదేశ్ ఉద్యమమే మాకు స్ఫూర్తి : నేహాబోరా



**న్యూఢిల్లీ, అక్టోబరు 15:** భారత్‌లో కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ, వామపక్ష విద్యార్థి సంఘాలు ఆందోళన నిర్వహిస్తున్నాయి. తమ ఉద్యమానికి బంగ్లాదేశ్‌లో జరిగిన విద్యార్థి ఉద్యమమే స్ఫూర్తి అని ఎఐఎస్ఎ విద్యార్థి నాయకురాలు నేహా బోరా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ దుమారానికి కారణమయ్యాయి. ఈ వ్యాఖ్యలు భారతదేశంలో పాలనమార్పు లక్ష్యాన్ని సూచిస్తున్నాయని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఆరోపించారు. నేహా బోరా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. భారత్‌లో ప్రస్తుతం కనిపిస్తున్న జెన్‌జీ ఉద్యమం ముందుగా బంగ్లాదేశ్‌లో మొదలైందని అన్నారు. ఈ దేశంలో మనం చూస్తున్న జెన్‌జీ ఉద్యమం మొదట బంగ్లాదేశ్‌లో ప్రారంభమైంది. మాకు దారి చూపినందుకు, ఈ దేశ యువతకు సంఘీభావం తెలిపినందుకు మీకు అభినందనలని ఆమె ఆ వీడియోలో చెప్పింది.

## 28లోగా దేశం విడిచి వెళ్లండి: ఇమ్రాన్‌ఖాన్‌కు నోటీసులు



**ముంబయి, అక్టోబరు 15:** బాలీవుడ్ నటుడు, అమీర్ ఖాన్ మేనల్లుడు ఇమ్రాన్ ఖాన్‌కు ముంబై పోలీసులు షాకిచ్చారు. ఈనెల 28 లోగా భారతదేశాన్ని విడిచి వెళ్లాలని పోలీసులు నోటీసులు జారీ చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 10న ముంబైలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ నిరసనలో ఇమ్రాన్ ఖాన్ పాల్గొన్నాడు. ఇమ్రాన్ ఖాన్‌తో పాటు ఆయన భాగస్వామి, నటి లేఖా వాషింగ్టన్, బంధువు జైన్ మేరీ ఖాన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసులు ఇమ్రాన్ ఖాన్, లేఖా వాషింగ్టన్, జైన్ మేరీ ఖాన్‌లను అదుపులోకి తీసుకున్నారు. అయితే ఇమ్రాన్ ఖాన్ భారత పౌరుడు కాదని అమెరికా పౌరసత్వం ఉందని మీడియాలో కథనాలు వచ్చాయి.

## బిఎస్‌ఎఫ్ శిబిరంలో ఆహార కల్తీ :జవాన్లకు అస్వస్థత

**ఇంఫాల్, అక్టోబరు 15:** మణిపూర్‌రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లోని బీఎస్ఎఫ్ (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్) క్యాంపులో ఫుడ్ పాయిజనింగ్ జరిగింది. ఈ ఘటనలో దాదాపు 75 మంది బీఎస్ఎఫ్ జవాన్లు అస్వస్థతకు గురయ్యారు. వీరితోపాటు మరో ముగ్గురు పౌరులు కూడా అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం వీరందరినీ ఆస్పత్రికి తరలించగా చికిత్స అందుతోంది. ఈ ఘటన గురువారం ఉదయం జరిగింది. ఉదయం బీఎస్ఎఫ్ జవాన్లు, ఇతర సిబ్బంది బ్రేక్‌ఫాస్ట్ చేశారు. ఆ తర్వాత కొద్ది సేపటికి ఆహారం తిన్న 78 మంది అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, కడుపునొప్పి వంటి లక్షణాలు మొదలయ్యాయి. దీంతో వెంటనే వారిని అత్యవసర ప్రాతిపదికన స్థానిక రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)కు తరలించారు. 78 మంది చికిత్స పొందుతుండగా.. వారి పరిస్థితి ప్రస్తుతం స్థిరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

16-10Pg6exHMNWJQE.qxd:16-10Pg6exHMNWJQE.qxd 1/1/02 5:57 AM Page 1



# స్కందమాతా దేవి అలంకారంలో ముత్యామ్మల అమ్మవారు



**శ్రీకాళహస్తి, అక్టోబరు 15 ప్రభాతవార్త:**శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో జరుగుతున్న దసరా నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. గురువారం జ్ఞాన ప్రసూనాంబదేవి ఆలయం ఎదురుగా ఉన్న బొమ్మల కొలువులో స్కందమాతాదేవి అలంకారం జరగగా, ముత్యాలమ్మకు స్కందమాత దేవి ఆలంకారం జరిపారు. మహిళా భక్తులు భవాని మాల ధరించి పూజలకు హాజరయ్యారు. ముత్యాలమ్మగుడి వీధిలోని ముత్యాలమ్మ ఆలయం, అలాగే ఏడుగంగమ్మల ఆలయంలో 'స్కందమాత ఆలంకారం' ప్రత్యేక అలంకారాలు జరిపారు. ఇక ఆలయాల్లో నేతి దీపాలతో కళ కళ లాడింది. ఆలయాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. వచ్చిన భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం, అలాగే తీర్థ ప్రసాదాలను ఏర్పాటు చేసారు. దుర్గమ్మ కొండపై అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకారం నిర్వహించారు.కాగా బజారు వీధిలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ధనలక్ష్మి అలంకారం నిర్వహించారు.

**అమ్మవారి ఆలయాల్లో...**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలోని దక్షిణ కాళి మాత ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పోటెత్తారు. అమ్మవారి విగ్రహం ప్రత్యేక రూపంలో ఉంటుంది. అమ్మవారు వీణా వాణిగా దర్శనమిస్తున్నారు. ఇక పట్టణంలోని పానగల్‌లో వెలసిన పొన్నాలమ్మ ఆలయంలో ప్రతి రోజూ ప్రత్యేక అలంకరణలతో ఆకట్టుకుంటున్నారు. ఇక్కడ నిర్వాహకులు వచ్చిన భక్తులకు ప్రత్యేక దర్శన ఏర్పాటు చేస్తున్నారు. కాగా కొత్తపేటలోని శీతలాంబ అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకాకర్షణగా ఉంది. ప్రతి రోజూ పట్టణంలోనూ, చుట్టుపక్కల ఉన్న కళాకారులతో సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

# అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నివాళి



**విజయవాడ,అక్టోబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, అక్టోబర్ 15న మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. విజయవాడ పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ముర్ము, అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలాం చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ భారతదేశ క్షిపణి మనిషిగా ప్రసిద్ధి చెందిన డాక్టర్ కలాం, దేశ ఏరోస్పేస్ మరియు రక్షణ పరిశోధన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు.ఒక శాస్త్రవేత్త నుండి భారతదేశంలో అత్యున్నత రాజ్యాంగ పదవిని అధిరోహించిన ఆయన ప్రస్థానం, విద్యార్థులకు, పరిశోధకులకు. యువ నిపుణులకు స్ఫూర్తినిస్తూనే ఉంది.తన శాస్త్రీయ విజయాలకు అతీతంగా, డాక్టర్ కలాం యువతను విద్య, ఆవిష్కరణలు మరియు ఉన్నత లక్ష్యాలను సాధించేలా ప్రోత్సహించినందుకు ప్రసిద్ధి చెందారు. అక్టోబర్ 15న జరుపుకునే ఆయన జయంతి, దేశానికి ఆయన చేసిన సేవలను మరియు తరతరాల భారతీయులపై ఆయన చెరగని (ప్రభావాన్ని) స్మరించుకోవడానికి ఒక అవకాశాన్ని కల్పిస్తుంది. స్వయం సహాయక బృందాల ఉత్పత్తులను మరియు పారిశ్రామిక కార్యకలాపాలను ప్రోత్సహించే జాతీయ సరస్ మేళాకు హాజరయ్యేందుకు రాష్ట్రపతి ముర్ము ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నారు.ఈ పర్యటన సందర్భంగా రాష్ట్రపతి డాక్టర్ కలాంకు నివాళులర్పించారు. రాష్ట్రపతి కార్యాలయం విడుదల గురువారం మధ్యాహ్నం విడుదల చేసిన ఒక అధికారిక ప్రకటనలో ఈ విషయం వెల్లడించారు.ద్వారా భారతదేశ శాస్త్రీయ మరియు విద్యా చరిత్రలో డాక్టర్ కలాం ఒక ప్రముఖ వ్యక్తిగా నిలిచిపోయారు.దేశ నిర్మాణంలో జ్ఞానం, ఆవిష్కరణలు మరియు యువత భాగస్వామ్యంపై ఆయన ఇచ్చిన ప్రాధాన్యత దేశవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తూనే ఉంది. భారతదేశం ఆయన జయంతిని జరుపుకుంటున్న తరుణంలో, ఆయన ప్రజా సేవకు దేశ ప్రగతికి చేసిన శాశ్వతమైన కృషికి స్మరణగా నిలుస్తుంది.



## అబ్దుల్ కలాం చిత్రపటానికి సీఎం నివాళి

**అమరావతి,అక్టోబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఘనంగా నివాళులు అర్పించారు.తన కార్యాలయంలో కలాం చిత్రపటానికి సీఎం చంద్రబాబు నివాళులర్పించారు,.అబ్దుల్ కలాం అంటే ఒక స్ఫూర్తి శిఖరమని సీఎం కొనియాడారు. అరుదైన వ్యక్తిత్వం ఆయన సొంతమన్నారు. దేశ అణు, సాంకేతిక రంగాలకు సరికొత్త మార్గనిర్దేశనం చేసిన దార్శనికుడు, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అని తెలిపారు. ఇదే సందర్భంలో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆ మానవతావాది దేశ, సమాజ సేవలను స్మరించుకుందాం అంటూ ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు.



## అబ్దుల్ కలాం వారసత్వాన్ని గౌరవిద్దాం -పవన్ కల్యాణ్

**అమరావతి,అక్టోబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివా ళుల టర్పించారు. రామే శ్వరంలోని ఒక నిరాడం బర కుటుంబం నుంచి ఎదిగి, భారతదేశపు అత్యంత గౌరవనీయమైన శాస్త్రీయ నాయకులలో ఒకరిగా ప్రజల ఆరా ధ్య రాష్ట్రపతిగా నిలిచిన దార్శనిక శాస్త్రవేత్త, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా వారిని స్మరించుకుందామని అన్నా రు. ఆయన ప్రస్థానం విద్య, క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావం శక్తికి నిదర్శనమన్నారు. ఒక యువ వార్తాపత్రిక పంపిణీదారుడిగా పనిచే యడం నుంచి భారతదేశపు స్వదేశీ ఎస్ఎల్వి౹౹౹ ప్రయోగ వాహనం అభి వృద్ధికి నాయకత్వం వహిం చారన్నారు. కలాం జయంతి సందర్భంగా ఆయన ప్రతిబింబించిన విలు వలను శాస్త్రీయ దృక్పథం, ఆత్మనిర్భరత, నిరంతర అభ్యసనం చేద్దా మన్నారు. భారత ప్రగతి పట్ల అచంచలమైన నిబద్ధతను పాటిస్తూ అబ్దు ల్ కలాం వారసత్వాన్ని గౌరవిద్దామని ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## అబ్దుల్ కలాం జీవితం నేటి తరానికి ఆదర్శం - మంత్రి లోకేశ్

**అమరావతి,అక్టోబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి నారా లోకేశ్ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రపతిగా దేశానికి విశేష సేవలందించారని అన్నారు. తన ప్రసంగాలతో అందరిలో స్ఫూర్తి నింపిన కలాం జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు. భారతరత్న అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా దేశానికి వారందించిన సేవలను స్మరించుకుందామని మంత్రి లోకేశ్ వెల్లడించారు.

# దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు జగన్ నివాళి

**విజయవాడ,అక్టోబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ నివాళి అర్పించారు. దేశ రాష్ట్రపతి పదవిని అలంకరించిన ఆయన నిరాడంబర జీవితం అందరికీ ఆదర్శం అని ప్రశంసలు కురిపించారు.వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా.:విద్యతోనే వ్యక్తి ఎదుగుదల, యువశక్తితోనే దేశాభివృద్ధి సాధ్యమని నమ్మిన గొప్ప దార్శనికుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం. శాస్త్రవేత్తగా విశిష్ట సేవలందించి, దేశ రాష్ట్రపతి పదవిని అలంకరించిన ఆయన నిరాడంబర జీవితం అందరికీ ఆదర్శం. కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి అంటూ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపి, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయం. కలాం జయంతి సందర్భంగా నివాళుల్లు అని పోస్టు చేశారు.

# ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్‌పై బదిలీ వేటు

**అమరావతి, కుప్పం, అక్టోబరు 15,ప్రభాతవార్త ప్రతినిధి:** బెంగళూరులోని ఓ పబ్‌లో పోలీసులతో గొడవ పడిన ఘటనలో ఏపీకి చెందిన ఐఏఎస్ అధికారి వికాస్ మర్మత్‌పై బదిలీ వేటు పడింది. ఖకుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీఖ (కాడా) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను వెంటనే బాధ్యతల నుంచి తప్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి పోస్టింగ్ కోసం సాధారణ పరిపాలన శాఖలో (జీఏడీ) రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ ఈ బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు. ఖకాడాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పోస్టుకు వెంటనే ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించాలని చిత్తూరు జిల్లా కలెక్టర్‌కు సూచించారు.అక్టోబర్ 10న తెల్లవారుజామున 1:30 గంటల సమయంలో బెంగళూరులోని రెసిడెన్సీ రోడ్డులో ఉన్న ఓ పబ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. రాత్రిపూట తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు, వయసు నిర్ధారణ కోసం కస్టమర్ల గుర్తింపు పత్రాలు అడిగారు. ఈ క్రమంలో వికాస్ మర్మత్, ఆయన స్నేహితులు పోలీసులతో వాగ్వాదానికి దిగి, వారిని దూషించి విధులకు ఆటంకం కలిగించారని ఆరోపణలు వచ్చాయి.ఈ ఘటనపై పోలీస్ ఇన్‌స్పెక్టర్ అరుణ్ సాలుంకే ఫిర్యాదు మేరకు బెంగళూరు కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో వికాస్ మర్మత్‌తో పాటు అభయ్ ఉదయ్ సింగ్, నితేష్, రోషన్ అనే మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేయడం, బెదిరించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం వంటి పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ గొడవకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించినట్లు తెలుస్తోంది. సీఎం సొంత నియోజకవర్గమైన కుప్పం అభివృద్ధి బాధ్యతలు చూస్తున్న అధికారిపై ఆరోపణలు రావడంతో ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది.

# వన్యప్రాణులకు సురక్షిత నిలయం

- శేషాచల అటవి పరిరక్షణకు చర్యలు: టిటిడి ఎఫ్ఆర్ఒ దొరస్వామి

**తిరుమల, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:**శేషాచలంలోని పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలను మరింత హరితశోభితంగా తీర్చిదిద్దడమేగాక అటవీ ప్రాంతంలోని ప్రకృతి సంపదను, వన్యప్రాణులను సంరక్షించేందుకు టిటిడి ప్రత్యేక చర్యలు చేపడుతోందని టిటిడి అటవీశాఖ రేంజ్ అధికారి దొరస్వామి తెలిపారు. తిరుమలలో మీడియా సెంటర్‌లో మీడియా సమావేశంలో ఆయన అటవీ సంరక్షణ, పచ్చదనం పెంపు, వన్యప్రాణుల పర్యవేక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. టిటిడి పరిధిలోని తిరుమల అటవీ ప్రాంతంలో ఎర్రచందనం, శ్రీగంధం వంటి విలువైన వృక్షాలతో పాటు వివిధ ఔషధ మొక్కలను పెంచుతున్నట్లు రేంజర్ తెలిపారు. పార్వేట మండపం వద్ద నక్షత్ర వనాలను అభివృద్ధి చేయడంతో బాటు రెండు ఘాట్ రోడ్లు, అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో పచ్చదనాన్ని పెంపొందిస్తున్నట్లు చెప్పారు.

వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1, జిఎన్‌సి టోల్‌గేట్, అలిపిరి తదితర ప్రాంతాల్లో భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు వివిధ రకాల పూల మొక్కలను పెంచుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా అలిపిరి నడక మార్గంలో సువాసనలు వెదజల్లే మొక్కలు, రంగురంగుల పూల మొక్కలను పెంచి ప్రకృతి సౌందర్యాన్ని మరింత ఇనుమడింపజేస్తున్నట్లు తెలిపారు. అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంచారాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు దొరస్వామి తెలిపారు. ముఖ్యంగా చిరుతల కదలికలను గుర్తించేందుకు అటవీ సిబ్బంది 24 గంటల బాటు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు.సిసి కెమెరాలు, ట్రాప్ కెమెరాలు, సోలార్ కెమెరాలతో పాటు డ్రోన్ల సహాయంతో వన్యప్రాణుల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన రిమోట్ మోమోను కూడా త్వరలో వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

శేషాచల అటవీ ప్రాంతంలోని జీవవైవిధ్యాన్ని కాపాడటం, వన్యప్రాణుల సంరక్షణకు భంగం కలగకుండా చూడటం లక్ష్యంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించినట్లు ఎఫ్ఆర్ఓ స్పష్టం చేశారు. భక్తులు ప్లాస్టిక్ బాటిళ్లు, ప్లాస్టిక్ కవర్లను అటవీ ప్రాంతాల్లోకి తీసుకెళ్లవద్దని సూచించారు. ఈ మీడియా సమావేశంలో టిటిడి పిఆర్ఓ నీలిమ పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం



## కల్పవృక్షంపై కలియుగదేవుడు

**తిరుమల, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామినవరాత్రి బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం మలయప్పస్వామి ఉభయదేవేరులతో కలిసి బకాసుర వధ అలంకారంలో కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.గజరాజుల ముందు నడక, మంగళవాయిద్యాల నాదం, భక్తబృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ప్రబంధ పారాయణం నడుమ వాహనసేవ వైభవంగా సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి శ్రీవారి కృపాకటాక్షాలు పొందారు.

**కోరిన కోర్కెలు తీర్చే దివ్య వైభవం**

కల్పవృక్షవాహనం. క్షీరసాగర మథనంలో ఉద్భవించిన కల్పవృక్షం కోరిన ఫలాలను ప్రసాదించే దివ్య వృక్షంగా పురాణాలు పేర్కొంటాయి. అటువంటి కల్పవృక్ష వాహనంపై స్వామివారు దర్శనమివ్వడం భక్తులకు ఐహిక శుభాలు, సకలాభీష్టాల ప్రాప్తికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ కార్యక్రమంలో ఎద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, టిటిడి అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, జెఇఒ(విద్య, ఆరోగ్యం) ప్రభల గోపీనాథ్, సివిఎస్ఒ మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఇఒ భాస్కర్, పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి అధికారులు పాల్గొన్నారు.



## కనువిందు చేసిన జాతీయ కళారూపాలు

**తిరుమల, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో కల్పవృక్ష వాహనసేవలో వివిధ రాష్ట్రాల కళాకారులు తమ అద్భుత ప్రదర్శనలతో భక్తులను మంత్రముగ్ధులను చేశారు. దేశంలోని విభిన్న ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కళారూపాలు శ్రీవారి వాహనసేవకు విశేష శోభను చేకూర్చాయి. పది రాష్ట్రాలకు చెందిన 16 కళాబృందాల్లోని 412 మంది కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు భక్తుల్లో భక్తిభావాన్ని నింపాయి. కేరళకు చెందిన గోపికానృత్యం, తిరువాతిరకళి, అష్టపదమేళం, ఒయ్యాలాటం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కూచిపూడి, భాగవతం, జానపద నృత్యాలు, పశ్చిమ బెంగాల్‌కు చెందిన రైబెన్స్యా జానపద నృత్యం; హిమాచల్ ప్రదేశ్ లంబాడా నృత్యం; మణిపూర్ సంప్రదాయ నృత్యాలు అస్సాం సత్రియ, బిహు నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కల్పవృక్ష వాహనసేవలో ప్రతిభావంతమైన ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులను టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర సన్మానించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డాక్టర్ ఎస్. ఉషారాణి బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం, అస్సాంకు చెందిన దీప్సిక భూయన్ బృందం ప్రదర్శించిన సత్రియ నృత్యం, పశ్చిమ బెంగాల్‌కు చెందిన మోమితా పాల్ బృందం ప్రదర్శించిన రైబెన్స్యా జానపద నృత్యం, కేరళకు చెందిన కె.ఆర్. దేవదాస్ బృందం ప్రదర్శించి ఇఒ సన్మానించారు.

# శేషాచలాదీశునికి నేడే గరుడసేవ

- 3లక్షల మంది భక్తులకు గ్యాలరీల్లో సౌకర్యం

**తిరుమల, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలకొండల్లో సప్తగిరుల్లో కొలువైన తిరుమల వేంకటేశ్వరుని నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో అత్యంత కమనీయమైన,ప్రాధాన్యతవున్న గరుడవాహనసేవ శుక్రవారం(నేటి)రాత్రి జరగనుంది. రాత్రి 6.30గంటలకు ఈ గరుడవాహనసేవ మొదలవుతుంది. గరుడవాహనసేవ విశిష్టతను దృష్టిలోవుంచుకుని 3లక్షలమంది భక్తులు ఆలయమాఢవీధుల్లోని గ్యాలరీల్లో స్వామివారిని దర్శించుకునేలా ఏర్పాట్లుచేశారు. దసరా సెలవులు రావడంతో ఇప్పటికే తిరుమలభక్తజనసంద్రంగా మారిపోయింది. గరుడవాహనసేవకు తిరుమలలో వున్న గ్యాలరీలలో 2.60లక్షల మంది భక్తులు వుండే అవకాశం ఉంది.ఈ సారి బ్రహ్మోత్సవాలకు అదనంగా భక్తులు కూర్చునేలా గ్యాలరీలు అందుబాటులోకి వచ్చిందని, గరుడసేవలో



మొత్తం 2.60లక్షల మంది గ్యాలరీల్లో కూర్చుని స్వామివారిని దర్శించుకునేలా ఏర్పాట్లుచేపట్టారు. నాలు గుమాఢవీధుల్లో అధునాతన మరుగు దొడ్లు అందుబాటులో వున్నాయి. తిరుమల లో మొత్తం ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటుచేరు. ఉద యం 11గంటల నుండే భక్తులను అను మతి నిస్తారు. ఉదయం 11గంటలనుండి నిరంత రాయంగా భక్తులకు సాంబార న న్నం, పెరుగన్నం, బిస్మిల్లాబాత్, సాయంత్రం సుండలు, తదితర అన్నప్రసా దాలు, తాగునీరు, మజ్జిగ అందిస్తా రు. ప్రతిగ్యాలరీలో శ్రీవారి సేవకులు ,పారిశుధ్య సిబ్బంది అన్నప్రసాదం సిబ్బంది వుంటూ భక్తులకు కావలసిన ఏర్పాట్లు చేసేందుకు ఉద్యోగులు అందుబాటులో వుంచారు. తిరు మలలో పార్కింగ్ నిండితే అలిపిరిలో నిలిపి వేసి పార్కింగ్ ప్రదేశా లకు పంపుతారు. భక్తులకు సంతృప్తికరంగా మూలవర్ల దర్శ నం ,గరుడసేవవాహన వీక్షణ కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

# చంచల్‌గూడ జైల్లో ముగిసిన కారుమూరి సునీల్ విచారణ

**హైదరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త:** ఎపిలో సంచలనం రేపిన లిక్కర్ స్కాంకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అధికారులు అరెస్టు చేయడంతో చంచల్‌గూడ జైల్లో వున్న వైకాపా నేత కారుమూరి సునీల్ రెడ్డిని ఆ రాష్ట్ర సిఐడి అధికారులు గురువారం కూడా విచారించారు . విజయవాడ ఎసిబి కోర్టు ఆదేశాల మేరకు సునీల్ రెడ్డి రెండు రోజుల కస్టడీ విచారణ కోసం హైదరాబాద్ వచ్చిన ఎపి సిఐడి అధికారులు బుధవారం మొదటి రోజు ఆరు గంటల పాటు నిందితుడిని ప్రశ్నించారు. రెండవ రోజు గురువారం కూడా ఆరు గంటలకు పైగా సునీల్ రెడ్డిని వి చారించారు. ఈ విచారణలో వైకాపా హయాంలో వెలుగు చూసిన లిక్కర్ స్కాంకు సంబంధించి ఎవరి పాత్ర ఎంత...? ఇందులో ఎవరెవరు ...? ఎంతమేరకు కాజేశారు...? ఎప్పటి నుంచి ఎప్పటి వరకు ఈ స్కాం జరిగింది...? ఇందులో ఎవరెవరు ప్రధాన భూమిక వహించారు...? అనే అంశాలపై సిఐడి అధికారులు సునీల్ రెడ్డిని విచారించినట్లు తెలిసింది. విచారణ ముగిసిన తరువాత సిఐడి అధికారులు విజయవాడ వెళ్లి పోయారు. విచారణ తాలూకు అంశాలను ఒకటి రెండు రోజుల్లో విజయవాడలోని ఎసిబి కోర్టుకు అందజేయనున్నారని తెలిసింది.

# బ్రహ్మోత్సవ భక్తులకు 85 మంది వైద్యులు సిబ్బంది సేవలు

**తిరుమల, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేస్తున్న లక్షలాది మంది భక్తుల ఆరోగ్య భద్రతకు టిటిడి విస్తృత వైద్య ఏర్పాట్లు చేపట్టిందని టిటిడి ముఖ్య వైద్యాధికారి డాక్టర్ కుసుమ కుమారి తెలిపారు. భక్తులకు అత్యవసర వైద్య సేవలతో బాటు నిరంతర వైద్య సహాయం అందించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. తిరుమలలో మీడియా సెంటర్‌లో మీడియా సమావేశంలో ఆమె వైద్య సేవల వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల సందర్భంగా 75 మంది వైద్యులతో బాటు శ్రీవారి వైద్య సేవలో మరో 10 మంది వైద్యులు కలిపి మొత్తం 85 మంది వైద్యులు, 60 మంది పారామెడికల్ సిబ్బంది భక్తులకు వైద్య సేవలందిస్తున్నారని తెలిపారు. తిరుమలలోని టిటిడి వైద్య సిబ్బందితో బాటు స్విమ్స్, బర్డ్, శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల, రుయా ఆసుపత్రులకు చెందిన వైద్యులు, సీనియర్ డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది కూడా సేవల్లో భాగస్వాములవుతున్నారని వివరించారు. భక్తులకు సత్వర వైద్య సహాయం అందించేందుకు తిరుమలలోని అశ్విని ఆసుపత్రి,



అపోలో ఎమర్జెన్సీ కార్డియాక్ సెంటర్, ఏడు డిస్పెన్సరీలతో పాటు అలిపిరి, శ్రీవారిమెట్టు కాలిబాట మార్గాల్లో, తిరుమలలో కలిపి 28 ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.బ్రహ్మోత్సవాలకు తరలి వచ్చే భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులు, అత్యవసర వైద్య బృందాలు, నాలుగు మొబైల్ క్లినిక్‌లు, 15 అంబులెన్సులను సిద్ధంగా ఉంచినట్లు ఆమె తెలిపారు. నేడు గరుడసేవ రోజున భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నాలుగు మాడ వీధుల్లో ప్రత్యేక వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. సీనియర్ డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందితో బాటు 20 అంబులెన్సులను వాహన సేవ పూర్తయ్యే వరకు అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు.

# బ్రహ్మోత్సవాల్లో ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన

- ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణూ దీక్షిత్

**తిరుమల, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:**శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమ లలోని వరహాస్వామి విశ్రాంతి గృహం వద్ద ఏర్పా టు చేసిన



ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తోందని ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణూ దీక్షిత్ చెప్పారు. మీడియా సెంటర్‌లో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.1983లో ప్రారంభమైన ఆయుర్వేద కళాశాల దినదినాభివృద్ధి చెందుతూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని చెప్పారు. ఆయుర్వేద వైద్యశాలలో 260 బెడ్లతో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇటీవలే విష చికిత్స, న్యూట్రిషన్ విభాగం, ప్రత్యక విభాగాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శ్రీవారి వైద్య సేవ ద్వారా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుండి ఆయుర్వేద వైద్యులు విచ్చేసి రోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడం జరుగుతోందన్నారు. ఔషధ మొక్కల ద్వారా జబ్బులు నయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలోని కుటుంబాలకు ప్రత్యేక వైద్యం, అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. టిటిడి ఆయుర్వేద ఫార్మసీలో దాదాపు 80 రకాల ఔషధాలను తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ తయారు చేసే మందులు అత్యంత నాణ్యతతో తయారు చేస్తున్నట్లు చెప్పారు. టిటిడి పంచగవ్య ఉత్పత్తులను భక్తులకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో టిటిడి సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్ఒ నీలిమ పాల్గొన్నారు.

# తిరుమలలో పెరిగిన దసరా రద్దీ

- స్వామివారి దర్శనానికి 14గంటలు

**తిరుమల, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** పవిత్రమైన పెరటాసిమాసం ముగింపుకురాడం, దసరాసెలవులు, నవరాత్రిబ్రహ్మోత్సవాల వీక్షణకు తిరుమలకు భారీగా భక్తులు చేరుకుంటున్నారు. గురువారం కూడా తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. సామాన్యభక్తులు తిరుమలలో స్వామివారి దర్శనానికి 14గంటలుపాటు నిరీక్షించాల్సిన అవసరం వస్తోంది. గురువారం సాయంత్రానికి సర్వదర్శనం కోసం భక్తులు బారులుతీరారు. వైకుంఠం-2లో 32కంపార్టుమెంట్లలో నిండిపోయి సర్వదర్శనానికి భక్తులు వెలుపల క్యూలైన్లలో ఉన్నారు. సర్వదర్శనానికి 14గంటలు సమయం పడుతోంది. సాయంత్రంవరకు 43వేలమంది భక్తులు మహాలఘులో దర్శనం చేసుకున్నారు. బుధవారం అర్ధరాత్రి వరకు శ్రీవారిని దర్శించుకున్న 84 వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నారు.



కానుకల ద్వారా 3.33 కోట్లు రూపాయలు ఆదాయం చేకూరింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టిటిడి విస్తృత ఏర్పాట్లు చేసింది. క్యూలైన్లు, కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతరాయంగా అన్నప్రసాదం, పాలు, తాగునీరు పంపిణీ చేస్తున్నారు. అదేవిధంగా, లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాల వద్ద తోపులాటలు జరగకుండా భద్రతా సిబ్బందిని నియమించి, రద్దీని క్రమబద్ధీకరిస్తున్నారు.

# శ్రీవారి సేవ నిరంతర యజ్ఞం

**తిరుమల, అక్టోబరు 15 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో 2000 సంవత్సరంలో ప్రారంభమైన శ్రీవారిసేవ 25 ఏళ్లలో దాదాపు 18 లక్షల మంది శ్రీవారి సేవకులు శ్రీవారి సేవకు విచ్చేసినట్లు టిటిడి సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి తెలిపారు. తిరుమలలో శ్రీవారి సేవ నిరంతర యజ్ఞంగా కొనసాగుతోందని తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయం, క్యూలైన్లు, అన్నప్రసాదం విభాగం సహా టిటిడిలోని వివిధ విభాగాల్లో సుమారు 4,500 మంది శ్రీవారి సేవకులు సేవలందిస్తున్నారని చెప్పారు. గరుడసేవ రోజున నాలుగు మాడ వీధుల్లో సుమారు 2వేల మంది శ్రీవారి సేవకులు అన్నప్రసాదం, తాగునీటి పంపిణీ వంటి సేవల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సేవకుల విధులను సమన్వయం చేసేందుకు 150 మంది గ్రూప్ సూపర్‌వైజర్లను నియమించామని, వీరు సేవకుల విధులను పర్యవేక్షించడంతో పాటు, భక్తులకు టిటిడి కల్పిస్తున్న సౌకర్యాలపై అభిప్రాయాలను సేకరిస్తారని చెప్పా రు. భక్తుల రద్దీ పెరిగి క్యూలైన్లు వెలుపలికి విస్తరించే పరిస్థితుల్లో సేవలను పర్యవేక్షించేందుకు అదనంగా 20 మంది గ్రూప్ సూపర్‌వైజర్లను ప్రత్యేకంగా సామాజిక మాధ్యమం ద్వారా కూడా బ్రహ్మోత్సవాల సమాచారాన్ని భక్తులకు విస్తృతంగా అందించడం జరుగుతోందన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల అధికారిక సమాచారం, తాజా అప్‌డేట్ల కోసం టిటిడి అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాలను అనుసరించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. శ్రీవారి దర్శనం, వసతి, అన్న ప్రసాదం, రవాణా, ఇతర సౌకర్యాలకు సంబంధించిన సమాచారం పొందేందుకు ఈ కేంద్రాలు భక్తులకు సహాయపడుతున్నాయని తెలిపారు.

16-10Pg7exHMNWJQE.qxd:16-10Pg7exHMNWJQE.qxd 1/1/02 6:31 AM Page 1



# రెండు గంజాయి కేసుల్లో ఇద్దరు నిందితులకు జైలు

● విజయనగరం జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్

**విజయనగరం, అక్టోబరు 15, ప్రభాతవార్త :** విజయనగరం జిల్లాలో రామభద్రపురం, గజపతినగరం పోలీసు స్టేషన్లలో నమోదైన రెండు వేర్వేరు గంజాయి కేసుల్లో ఇద్దరు వేర్వేరు నిందితులకు ఒక సం. కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమాన విధిస్తూ ఫస్ట్ ఏడీజే కమ్ ఎన్‌డిపిఎస్ ప్రత్యేక న్యాయమూర్తి కే.విజయ కల్యాణి అక్టోబర్ 15న తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ తెలిపారు వివరాల్లోకి వెళితే.. గజపతినగరం మండలం మరుపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న నిందితుడు పీతల శివ (23) చెడు వ్యసనాలకు అలవాటుపడి, ఒడిస్సా రాష్ట్రం రాయఘడలో ఒక గుర్తు తెలియని వ్యక్తి నుండి 5 కిలోల గంజాయి కొనుగోలు చేసి, గజపతినగరం పోలీసులకు తే. 04-05-2023 దిన పట్టుబడ్డారన్నారు. ఈ కేసులో ఎస్సై గంగరాజు రైడ్ చేయగా, అప్పటి గజపతినగరం సిఐ ఎల్.అప్పలనాయుడు దర్యాప్తు చేపట్టారని జిల్లా ఎస్పీ తెలిపారు. అదే విధంగా ఒడిస్సా రాష్ట్రం మల్కనగిరి బలిమల ప్రాంతానికి చెందిన రతన్ సగారియా (48) అనే వ్యక్తి 2.890 కిలోల గంజాయిని ఒడిస్సా నుండి తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ కు తరలిస్తూ తే. 29.01.2020 దిన రామభద్రపురం పోలీసులకు పట్టుబడ్డారన్నారు. ఈ కేసులో అప్పటి రామభద్రపురం ఎస్సై ఎస్.కృష్ణమూర్తి రైడ్ చేయగా, అప్పటి సాలూరు రూరల్ సిఐ ఎల్.అప్పలనాయుడు దర్యాప్తు చేపట్టారని జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ తెలిపారు. ఈ రెండు కేసుల్లో నిందితులు పీతల శివ, రతన్ సాగరియా పై నేరారోపణలు న్యాయస్థానంలో నిరూపణ కావడంతో నిందితులు ఇద్దరికి 1 సం. కఠిన కారాగార శిక్ష, రూ. 10 వేలు జరిమాన, జరిమాన చెల్లించని పక్షంలో మరో 3 మాసాలు సాధారణ జైలుశిక్ష అనుభవించాలని ఫస్ట్ ఏడీజే కమ్ ఎన్‌డిపిఎస్ ప్రత్యేక న్యాయమూర్తి కే.విజయ కల్యాణి తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ తెలిపారు. ఈ కేసుల్లో ఏపీపీకే.ఈ.స్వర్ణలత భాను పోలీసుల తరుపున వాదనలు వినిపించగా, ఎస్ఐలు జ్ఞానప్రసాద్, కే.కే.కే.నాయుడు, ఎఎస్ఐలు డి.శంకరరావు, హెచ్‌సి కే.నరసింహ మూర్తి, కానిస్టేబుల్ త్రినాథ్ నిందితులకు శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టారని, క్రియాశీలకంగా పని చేసిన అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ అభినందించారు.

# చిన్న తప్పులకు జైలు శిక్షకు స్వస్తి!

● జన్ విశ్వాస్ చట్టంతో నిబంధనల్లో కీలక మార్పులు ● 79 కేంద్ర చట్టాల్లో 784 నిబంధనలకు సవరణలు ● 717 నిబంధనల్లో నేరపరమైన చర్యల తొలగింపు ● పౌరులు, వ్యాపార సంస్థలపై నిబంధనల భారం తగ్గించడమే లక్ష్యం




**అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 15 ప్రభాతవార్త:** చిన్న ్రపాటి నిబంధనల ఉల్లంఘనలకు జైలు శిక్ష విధించే విధా నానికి బదులుగా జరిమానాలు, పరిపాలనా చర్యలకు ప్రా ధాన్యమిస్తూ కేంద్ర ప్రభుత్వం జన్ విశ్వాస్ చట్టం ద్వారా కీలక సంస్కరణలు చేపట్టింది. వ్యాపార సంస్థలు, పారిశ్రా మికవేత్తలు, పౌరులు ఎదుర్కొనే నిబంధనల భారాన్ని తగ్గించడం, ప్రభుత్వ వ్యవస్థపై విశ్వాసాన్ని పెంచడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశం. 2026లో అమల్లోకి వచ్చిన జన్ విశ్వాస్ (సవరణల నిబంధనలు) చట్టం ద్వారా 23 మంత్రిత్వ శాఖల పరిధిలోని 79 కేంద్ర చట్టాల్లో 784 నిబంధనలను సవరించారు. వీటిలో 717 నిబంధనలకు సంబంధించి నేరపరమైన చర్యలను తొలగించారు. మరో 67 నిబంధనలను ప్రజలకు జీవన సౌలభ్యం కల్పించేలా సవరించారు.

**2026 ఏప్రిల్ 7 నుంచి అమల్లోకి:** జన్ విశ్వాస్ (సవరణల నిబంధనలు) చట్టం-2023 ద్వారా 42 కేంద్ర చట్టాల్లోని 183 నిబంధనలను నేరరహితం చేశారు. ఈ సంస్కరణలను మరింత విస్తరిస్తూ 2026 చట్టాన్ని తీసుకొచ్చారు. ఈ చట్టం 2026 ఏప్రిల్ 7 నుంచి అమల్లోకి వచ్చినట్లు కేంద్ర ప్రభుత్వ అధికారిక సమాచారం వెల్లడించింది.

**ఏమిటీ జన్ విశ్వాస్ చట్టం?:** జన్ విశ్వాస్ అంటే ప్రజలపై విశ్వాసం అని అర్థం. చిన్నపాటి సాంకేతిక తప్పిదాలు, విధివిధానాల ఉల్లంఘనలకు ప్రతిసారీ క్రిమినల్ కేసులు, జైలు శిక్షల వంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేకుండా చట్టాల్లో మార్పులు చేయడం దీని ముఖ్య ఉద్దేశం. కొన్ని ఉల్లంఘనలకు జైలు శిక్షను తొలగించడం, జరిమానాలను కొనసాగించడం లేదా సవరించడం, కొన్ని సందర్భాల్లో క్రిమినల్ చర్యలకు బదులుగా పరిపాలనా జరిమానాలు విధించే విధానాలను ప్రవేశపెట్టడం ఇందులో భాగంగా ఉన్నాయి.

**వ్యాపారులకు ఊరట:** వ్యాపారాలు ప్రారంభించడం, నిర్వహించడం, ప్రభుత్వ అనుమతులు పొందడం వంటి ప్రక్రియల్లో నిబంధనల సంక్లిష్టతను తగ్గించడం ద్వారా వ్యాపార సంస్థలకు ఊరట కల్పించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా చిన్న, మధ్యతరహా సంస్థలు సాంకేతిక లేదా విధివిధానపరమైన చిన్న తప్పిదాల కారణంగా ఎదుర్కొనే న్యాయపరమైన ఇబ్బందులను తగ్గించేందుకు ఈ మార్పులు దోహదపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

**పర్యావరణం, ఆరోగ్య రంగాల్లోనూ మార్పులు:** పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఔషధాలు, ఆహార భద్రత వంటి రంగాలకు సంబంధించిన కొన్ని నిబంధనల్లోనూ మార్పులు చేపట్టారు. చిన్నపాటి సాంకేతిక ఉల్లంఘనల విషయంలో నేరపరమైన చర్యలను తగ్గిం చినప్పటికీ, ప్రజారోగ్యం, వినియోగదారుల భద్రతకు ము ప్పు కలిగించే తీవ్రమైన ఉల్లంఘనలపై కఠిన నిబంధనలు కొనసాగుతాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

**వెయ్యికి పైగా ఉల్లంఘనల హేతుబద్ధీకరణ:** పాతబడిన, అవసరం లేని నిబంధనలను తొలగించడం, చిన్నపాటి ఉల్లంఘనలకు తగిన చర్యలను నిర్ణయించడం ద్వారా వెయ్యికి పైగా ఉల్లంఘనలకు సంబంధించిన నిబం ధనలను హేతుబద్ధీకరించడమే ఈ సంస్కరణల విస్తృత లక్ష్యమని కేంద్రం వెల్లడించింది. దీంతో ప్రభుత్వ కార్యా లయాలపై కేసుల భారం తగ్గడంతోపాటు, పౌరులు, వ్యా పార సంస్థలు ఎదుర్కొనే అనవసర న్యాయపరమైన ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది.

**అమలులో పారదర్శకత కీలకం:** చట్టాల్లో మార్పులు చేయడం మాత్రమే కాకుండా, వాటిని క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయడం కూడా కీలకం. ఏ ఉల్లంఘనకు జరిమానా విధించాలి? ఏ సందర్భంలో క్రిమినల్ చర్యలు కొనసాగుతాయి? సంబంధిత అధికారుల నిర్ణయాలపై అప్పీల్ చేసుకునే అవకాశం ఏమిటి? వంటి అంశాలపై స్పష్టత ఉండాలి. నిబంధనల సరళీకరణ పేరుతో తీవ్రమైన ఉల్లంఘనలకు మినహాయింపులు కలగకుండా పర్యవేక్షణ కొనసాగాలి. అప్పుడే జన్ విశ్వాస్ చట్టం ద్వారా ప్రభుత్వం ఆశిస్తున్న సులభతర పాలన, ప్రజలకు మెరుగైన సేవలు సాధ్యమవుతాయి.



# కల్వర్టును ఢీకొన్న కారు

**యువకుడు మృతి..ముగ్గురికి తీవ్రగాయాలు**

**పెద్దపంజాణి, అక్టోబరు 15 ప్రభాతవార్త :** చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలంలోని తులసిము నెమ్మగుడి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు రోడ్డుప్రక్కనే ఉన్న కల్వర్టును ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతిచెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. బాధితులంతా అనంతపురం జిల్లా కదిరి పట్టణానికి చెందినవారు. పోలీసుల తెలిపిన మేరకు వివరాలిలా..అనంతపురం జిల్లా కదిరికి పట్టణానికి చెందిన ఎస్.సాదిక్(27), అతని భార్య నఫీజ్, అతని స్నేహితుడు అజహర్, అతని భార్య అయేషాలు చిత్తూరులో జరిగిన బందువుల వివాహానికి కదిరి నుంచి కారులో బయలుదేరారు. వివాహానికి హాజరై తిరిగి వస్తూ కదిరిపట్టణానికి వెళ్తుండగా మండలంలోని తులసిము నెమ్మగుడి ప్రాంతంవద్ద వీరు వస్తున్న కారు రోడ్డుప్రక్కన ఉన్న కల్వర్టును ఢీకొంది. దీంతో కారు నడుపుతున్న సాదిక్ అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు గాయపడిన వారిని అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# మొక్క జొన్న మాటున గంజాయి సాగు

● దుత్తలూరులో గుర్తింపు... ముగ్గురు అరెస్టు?

**దుత్తలూరు (నెల్లూరు), అక్టోబరు 15, ప్రభాతవార్త :** దుత్తలూరు, నందిపాడు మార్గంలో మొక్కజొన్న పంట మాటున సుమారు రెండు ఎకరాల్లో గంజాయి సాగు చేస్తున్నట్లు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు గుర్తించారు. వెలుగొండ కాలువలోపలి ప్రాంతంలోని సర్వే నెంబర్ 1582-2 లో గురువారం ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోలీసుల రాకతో మరికొందరు పరారైనట్లు తెలుస్తొంది., వారి కోసం డ్రోన్ కెమెరాలతో గాలింపు చేపట్టారు. గంజాయి సాగు వెనుక ఇతర ప్రాంతాల వ్యక్తుల ప్రమేయం స్దానికంగా ఓ పాత నేరస్థుడి పాత్రపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. మండకేంద్రానికి సమీపంలోనే ఆ అక్రమసాగు వెలుగులోకి రావడంతో స్దానికంగా కలకలం రేగింది.

# నక్కపల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ స్వేచ్ఛగా జరగాలి

● సిపియం డిమాండ్ ● నిర్బంధంతో ప్రజాభిప్రాయాన్ని అణగదొక్కడం చట్ట విరుద్ధం




**అమరావతి,అక్టోబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో అక్టోబర్ 15న జరగనున్న మిట్టల్ పోర్టు ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనడానికి వెళుతున్న సిపియం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వ రరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణలను ఎస్. రాయవరం మండలం అడ్డరోడ్డులో పోలీసులు అడ్డుకొని అరెస్టుచేయడాన్ని సిపియం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. వెంటనే వారిని విడుదల చేసి ప్రజాభిప్రాయసేకరణలో పాల్గొనే అవకాశాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తున్నది. ఈ మేరకు సిపియం రా ష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేసారు.,గురువారం తెల్లవారి నుంచి సిపియం ఎస్.రాయవరం మండల కార్యదర్శి ఎం. సత్యనారాయణ, నక్కపల్లి మండల కార్యదర్శి ఎం.రాజేష్, రాజయ్యపేట సిపిఎం శాఖ కార్యదర్శి మైలపల్లి మహేష్ బాబులను గృహ నిర్బంధించడం అప్రజాస్వామికం. రైతు సంఘం జిల్లా కార్యదర్శి, సిపియం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. అప్పలరాజును 3 రోజులుగా గృహనిర్బంధంలో ఉంచడం గర్హనీయం. అరెస్టు చేసిన వారిని, గృహ నిర్బంధంలో ఉన్న వారిని భేషరతుగా విడుదల చేయాలని సిపియం డిమాండ్ చేస్తుంది.

పబ్లిక్ హియరింగ్‌లో ప్రజలందరూ పాల్గొని వారి అభిప్రాయాలు స్వేచ్ఛగా తెలియజేయకుండా కూటమి ప్రభుత్వం అడ్డుకోవడం అప్రజాస్వామిక చర్య. కార్పొరేట్‌ల ప్రయోజనాలు కాపాడటానికి ప్రభుత్వం చట్టాలను ఉల్లంఘిస్తున్నది. ప్రజాభిప్రాయ సేకరణకు వారికి అనుకూలంగా ఉండే వారిని ఆహ్వానించడం, వ్యతిరేకించే వారిపై నిర్బంధం ప్రయోగించడం దుర్మార్గమైన చర్య. దీనిని సిపియం రాష్ట్ర కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. స్వేచ్ఛగా ప్రజాభిప్రాయ సేకరణకు వాతావరణం సృష్టించాలని కోరుతున్నది.



# గణపవరంలో భారీ అగ్నిప్రమాదం

**చిలకలూరిపేట, అక్టోబరు 15 ప్రభాతవార్త :** నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలోని శివ టెక్స్‌టైల్స్‌లో బుధవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రాథమిక అంచనా ప్రకారం షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు సమాచారం. మంటలు వేగంగా వ్యాపించడంతో భారీ యంత్రాలు, పత్తి, దారపు కండలు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదంతో పరిశ్రమలో భారీగా ఆస్తినష్టం సంభవించింది. సుమారు రూ.కోటి వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. అగ్నిప్రమాదంతో స్థానికంగా ఆందోళన నెలకొంది.

# విద్యుత్ బస్సుల టెండర్లు రద్దు కోరుతూ ఆర్టీసీ ఇడి వినతిపత్రం

**విజయవాడ,అక్టోబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపీఎస్ఆర్టీసీలో 1,450 ఎలక్ట్రిక్ బస్సుల కోసం పిలిచిన టెండర్లను రద్దు చేయాలని కోరుతూ, ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మానంద రెడ్డికి వినతిపత్రం సమర్పించింది. ప్రైవేట్ టెండర్లపై ఆధారపడకుండా, ఆర్టీసీయే స్వయంగా ఈ ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయాలని జ జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. ఈ నెల 22, 23 తేదీల్లో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని నిర్ణయించారు. తమ నిరసన కార్యాచరణను ప్రకటించేందుకు, ఈ నెల 26న ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం కానుంది. ఒకవేళ టెండర్లను రద్దు చేయకపోతే, ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని జాయింట్ యాక్షన్ కమిటీ హెచ్చరించింది.

# గరుడసేవను సమష్టి కృషితో విజయవంతం చేయాలి

● భక్తులకు మెరుగైన సేవలందించడమే ప్రథమ కర్తవ్యం
● అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,అక్టోబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన గరుడసేవను నేడు సమష్టి కృషితో విజ యవంతం చేయాలని టిటిడి అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి పిలుపునిచ్చారు. స్వామివారిపై అపార విశ్వాసంతో తిరుమలకు వ చ్చే లక్షలాది మంది భక్తులకు సంతృప్తికరమైన ద ర్శనం, వాహనసేవను కల్పించడమే ప్రతి ఉద్యో గి ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. తిరు మలలోని ఆస్థాన మండపంలో గురువారం సా యంత్రం గరుడసేవ విధులకు నియమించిన సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టిటిడి ఉద్యో గులు, విజిలెన్స్, పోలీసు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో మరింత ఉత్సా హంగా, అంకిత భావంతో పనిచేసి గరుడసేవను విజయవంతం చేయాలని సూచించారు. వర్ష సూచనల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు వాతావరణ శాఖ వర్ష సూచనలు చేసిన నేపథ్యంలో సంబం ధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వర్షం వల్ల ఎదురయ్యే పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు విపత్తుల నిర్వహణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కేటా యించిన ప్రాంతాల్లో బాధ్యతాయుతంగా విధులు సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లోనే బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అదనపు ఇఒ సూచించారు. చిన్న చిన్న సమస్య లను అక్కడికక్కడే పరిష్కరిస్తే భక్తులకు మరిం త మెరుగైన సేవలు అందించవచ్చని తెలిపారు. ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్య లు చేపట్టాలని ఆదేశించారు. శాఖల వారీగా ఉన్నతాధికారులకు అప్పగించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వర్తించాలని, ప్రతి ఒక్కరూ పూర్తి సామర్థంతో పనిచేసి భక్తుల సౌకర్యానికి ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఈ సమావేశంలో జెఇఒలు డాక్టర్ ఎ. శరత్, ప్రభల గోపీనాథ్, సివిఎస్ఒ మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, అన్నప్రసాదం క్యాటరింగ్ అధికారి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి గరుడసేవకు మాడ వీధుల్లో పటిష్ట భద్రత



**తిరుమల,అక్టోబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన గరుడసేవ నేడు శుక్రవారం సాయంత్రం జరగనుంది. ఈ నేపథ్యంలో భక్తుల భద్రత, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణపై తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ కె.వి. మురళీకృష్ణ, సంయుక్తంగా పోలీసు, టిటిడి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి బందోబస్తు విధులపై దిశానిర్దేశం చేశారు. మాడ వీధుల్లో పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేసి, గ్యాలరీలు, ప్రవేశ మార్గాలు, ముఖ్య కూడళ్ల వద్ద భక్తుల రద్దీని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రాం భగీచా, లేపాక్షి, సారంగి కూడళ్లతో పాటు ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల వద్ద అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, రద్దీకి అనుగుణంగా భక్తుల రాకపోకలను క్రమబద్ధీకరించాలని సూచించారు. గ్యాలరీలు నిండినప్పుడు సంబంధిత అధికారులు సమన్వయం చేసుకోవాలని, అవసరమైన చోట ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టి భక్తులు గరుడ వాహన సేవను సురక్షితంగా దర్శించుకునేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వర్ష సూచన నేపథ్యంలో సిబ్బంది రెయిన్‌కోట్లు వెంట ఉంచుకోవాలని, విధులకు నిర్ణీత సమయానికి హాజరై తమకు కేటాయించిన పాయింట్లలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎస్ఎంసీ వైపు నుండి భక్తులను క్రమపద్ధతిలో పంపాలని సూచించారు. జీఎన్‌సీ-లేపాక్షి మార్గంలో ట్రాఫిక్ నియంత్రణ, సూచిక బోర్డులు, పబ్లిక్ అడ్రసింగ్ వ్యవస్థల ద్వారా సమాచార ప్రసారం, నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాలకు వాహనాల మళ్లింపు, పార్వేట మండపం వద్ద పార్కింగ్ సదుపాయాల మెరుగుదలపై దృష్టి సారించాలని ఆదేశించారు. రద్దీ సమయాల్లో శిలాతోరణం, బాటగంగమ్మ, ఆక్టోపస్ మార్గాల్లో బస్సుల నిర్వహణను క్రమబద్ధీకరించే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పోలీస్, విజిలెన్స్, ఫైర్, అంబులెన్స్, పారిశుద్ధం, అన్నప్రసాదం తదితర విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

# అమెరికాలో విమాన ప్రమాదం

**చిన్నారితోసహా ఆరుగురు దుర్మరణం**



**విస్కాన్సిన్, అక్టోబరు 15:** అమెరికాలో ఘోర విమాన ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో చిన్నారి సహా ఆరుగురు దుర్మరణం చెందారు. ఈ విషాదకర సంఘటన విస్కాన్సిన్ డెల్స్ సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. సాక్ కౌంటీ షెరీఫ్ కార్యాలయ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరు సీట్లు, ఒకే ఇంజిన్ కలిగిన పైపర్ పిఎ 46 రకం చిన్న విమానం కెనోషా నుంచి మెనోమోనీకి బయలుదేరింది. అయితే పైపర్ పిఎ46 విమానం 24,000 అడుగుల (7,315 మీటర్ల) ఎత్తులో ప్రయాణిస్తున్నప్పుడు దాని రెక్కలపై మంచు పేరుకుపోతున్నట్లు పైలట్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌కు చెప్పి, కిందికి దిగడానికి అనుమతి కోరాడు. ఇంతలోనే ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన విస్కాన్సిన్ డెల్స్‌కు దగ్గంలో ఉన్న మిర్రర్ లేక్ స్టేట్ పార్క్ సమీపంలోని అటవీ ప్రాంతంలో రాత్రి 10 గంటల సమయంలో కూలిపోయింది. ఈ ఘటనపై ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్, నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ దర్యాప్తు చేస్తున్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# నివాసభవనంలో అగ్నిప్రమాదం..!

**బెర్లిన్, అక్టోబరు 15:** జర్మనీలోని బోఖుమ్ నగరంలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ నివాస భవనంలో చెలరేగిన మంటల్లో ముగ్గురు భారతీయులు ప్రాణాలు కోల్పోగా మరో ఐదు గురు గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి అదే భవనంలో నివసిస్తున్న 41 ఏళ్ల రొమేనియా దేశస్థుడిని పోలీసులు హత్య అనుమానంతో అరెస్ట్ చేశారు. అగ్నిప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఉద్దేశపూర్వకంగా నిప్పంటించారా అనే కోణా ల్లో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో 25, 27 ఏళ్ల వయసున్న ఇద్దరు మహిళలు, 26 ఏళ్ల యువకుడు మరణించారు. వీరంతా భారతీయులు. మంటలను అదుపు చేసేందుకు వచ్చిన అగ్నిమాపక సిబ్బంది భవనం రెండో అంతస్తులోని ఓ అపార్ట్‌మెంట్‌లో మృతదేహాలను గుర్తించారు. అయితే గాయపడిన వారి జాతీయతకు సంబంధించిన వివరాలను స్థానిక మీడియా వెల్లడించలేదు. అగ్నిప్రమాదానికి సంబంధించి పోలీసులు అదే భవనం లో నివసించే 41 ఏళ్ల రొమేనియా దేశస్థుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక దర్యాప్తులో భవనంలో సాంకేతిక లోపం కారణంగా మంటలు చెలరేగినట్లు కనిపించడం లేదని అధికారులు భావిస్తున్నారు. దీంతో ఎవరో ఉద్దేశపూర్వకంగా నిప్పంటించి ఉండవచ్చనే అనుమానంతో దర్యాప్తు చేపట్టారు. మంటలు కావాలనే పెట్టారా? లేక ప్రమాదవశాత్తు చెలరేగాయా అనే విష యంపై దర్యాప్తు జరుగు తోంది. ముగ్గురు భారతీ యుల ప్రాణాలను బలిగొన్న ఈ ఘటనపై జర్మనీ పోలీసులుదర్యాప్తుకొనసాగిస్తున్నారు.

# నక్సల్ రహిత ప్రాంతంగా బస్తర్

● కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



**రాయ్‌పూర్, అక్టోబరు 15:** నక్సలిజం బస్తర్ ప్రాంతంలో పూర్తిగా అంతరించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాలనే సంకల్పంతో ప్రధాని మోడీ ఈ ఏడాది మార్చి 31 గడువును విధించారని, భద్రతా బలగాల కృషితో ఆ లక్ష్యం నెరవేరిందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ పాలనకు 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా, దివ్యాంగులు, నక్సల్ బాధితులకు సాయం అందించే కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అమిత్ షా పాల్గొన్నారు. దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించడం మాత్రమే సరిపోదని ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయుధాలను వదిలి జన జీవన స్రవంతిలో కలిసిన వాళ్లు తమ జీవితాన్ని పునర్నిర్మించుకోవాలని చెప్పారు. ఒకప్పుడు తుపాకీ మోతలు, బాంబు పేలుళ్లతో దద్దరిల్లిన బస్తర్ ప్రాంతంలో శాంతి పవనాలు వీచాయని షా చెప్పారు. నక్సలిజంలో మిగిలిన ఆనవాళ్లను కూడా పూర్తిగా తుడిచిపెట్టి, బస్తర్‌ను ప్రశాంతమైన, అభివృద్ధి చెందిన ప్రాంతంగా మార్చడానికి కేంద్రం పట్టుదలతో ఉందన్నారు. అదే సమయంలో కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఛత్తీస్‌గఢ్‌లో దశాబ్దాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ కనీసం ప్రాథమిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం మాత్రం మౌలిక వసతులు, సౌకర్యాలను మెరుగుపరచడానికి నిరంతరం కృషి చేస్తోందని వెల్లడించారు. హింసాత్మక ప్రాంతాల్లో సాధారణ స్థితి, గిరిజన సంస్కృతిని పునరుద్ధరించడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో కలిసి కేంద్రం పలు చర్యలు తీసుకుంటున్నట్లు అమిత్ షా వివరించారు. సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమం ద్వారా దాదాపు 3,600 మందికి పైగా దివ్యాంగులు లబ్ధి పొందారని అమిత్ షా పేర్కొన్నారు. అక్టోబర్ 5 నుంచి 7 వరకు నిర్వహించిన కార్యక్రమంలో ఒక్క బస్తర్‌లోనే 1,570 మంది లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా నక్సలిజం కారణంగా అంగవైకల్యానికి గురైన గిరిజనులకు కృత్రిమ అవయవాలు అందిస్తుండటం పట్ల షా సంతృప్తి వ్యక్తం చేశారు. నక్సలిజం ఐదు దశాబ్దాల పాటు ఛత్తీస్‌గఢ్‌ను ఎంతగా పీడించిందో అక్కడి వికలాంగుల సంఖ్యను బట్టి అంచనా వేయవచ్చునని షా పేర్కొన్నారు. నక్సలిజం వల్ల జీవితాలు ప్రభావితమైన వారికి మద్దతు ఇవ్వడమే ఈ సేవా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నొక్కి చెప్పారు. ఒకప్పుడు ఛత్తీస్‌గఢ్ అభివృద్ధికి నక్సలిజం పెద్ద అడ్డంకిగా ఉండేదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి పేర్కొన్నారు. ప్రధాని మోడీ నాయకత్వంలో నక్సలిజం నిర్మూలన దిశగా తీసుకుంటున్న చర్యలు రాష్ట్రానికి దక్కిన గొప్ప ప్రయోజనాల్లో ఒకటని అన్నారు. ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు.

# మహిళా జర్నలిస్టుకు సుప్రీంకోర్టు మధ్యంతర రక్షణ

● ఢిల్లీ నిరసనలపై వార్తా కవరేజీ చేస్తున్న
● జర్నలిస్టులందరికీ రక్షణ కల్పించేందుకు నిరాకరణ



**న్యూఢిల్లీ, అక్టోబరు 15:** పోలీసు అధికారిపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన ఒక మహిళా జర్నలిస్టు, అదే అధికారిపై కులవివక్షతో కూడిన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఆమెపై బలవంతపు చర్యలు తీసుకోకుండా సుప్రీంకోర్టు గురువారం మధ్యంతర రక్ష ణ కల్పించింది. ఢిల్లీలో జరుగుతున్న నిరసనల ను కవర్ చేస్తున్న మహిళా జర్నలిస్టులందరికీ ఇలాంటి రక్షణ కల్పించాలన్న అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ లతో కూడిన ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. మహిళా జర్నలిస్టులందరికీ రక్షణ కల్పిం చడాన్ని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వ్యతిరేకించారు. స్వతంత్ర జర్నలిస్టులకు, సోషల్ మీడియాలో రీల్స్ రూపొందించే వ్యక్తులకు మధ్య తేడాను గుర్తించడం కష్టంగా మారిందని ఆయన కోర్టుకు తెలిపారు. సంబంధిత జర్నలిస్టు చేసిన ఆరోపణలు తీవ్రమైనవని, వాటికి సమాధానం ఇస్తామని మెహతా పేర్కొన్నారు. విస్తృతమైన ఆదేశాలు జారీ చేయడానికి ముందు ప్రభుత్వ వాదనలు కూడా వినాలని కోరారు. మహిళా జర్నలిస్టులు పోలీసులపై చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలను అదే పోలీసు వ్యవస్థ నిష్పక్షపాతంగా విచారించగలదా అని సీనియర్ న్యాయవాది ఇం దిరా జైసింగ్ ప్రశ్నించారు. నిర సనలను కవర్ చేస్తున్న మహిళా జర్నలిస్టుల ఫిర్యా దులను పరిశీలించేందుకు స్వతంత్ర కమి టీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. నాకు పోలీ సుల ద్వారా విచారణ వద్దు. వారు తమపై వచ్చి న ఆరోపణలను తామే విచారించలేరు. తమ కేసులో తామే న్యాయనిర్ణేతలుగా ఉండలేరని ఆమె వాదించారు. నిరసనలను కవర్ చేస్తున్న ప్రతి మహిళా జర్నలిస్టుకూ రక్షణ కల్పించాలని జైసింగ్ కోరగా, జస్టిస్ బాగ్చీ ఆ రక్షణను కోర్టు ముందున్న నిర్దిష్ట కేసులకే పరిమితం చేశారు. మీరు పిటిషన్‌లో పేర్కొన్న నిర్దిష్ట ఘటనకు, అలాగే మీరు సమర్పించే అనుబంధ పత్రాల్లో పేర్కొన్న వ్యక్తుల పేర్లకు మాత్రమే ఈ రక్షణ పరిమి తమవుతుందని జస్టిస్ బాగ్చీ స్పష్టం చేశారు. దీనికి జైసింగ్ అంగీకరించి, సంబంధిత వివరాల ను సమర్పిస్తామని తెలిపారు. అనంతరం, దర్యా ప్తునకు సహకరించేలా జర్నలిస్టును కోరుతూ, ఆమెను అరెస్టు చేయబోమని మెహతా సూచిం చారు.



గురువారం కాంగ్రెస్ లెజిస్లేచర్ కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

# సింగరేణిని ప్రైవేటీకరించం

## బొగ్గు గనుల ప్రైవేటీకరణ చట్టానికి బిఆర్ఎస్ మద్దతు

## ఐటి, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులు భాగస్వాములై రాష్ట్రం రావడంలో కీలక పాత్ర పోషించారని రాష్ట్రానికి ఆ సంస్థ గుండెకాయ వంటిదని దానిని ప్రైవేటీకరించబోమని ఐటి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటన చేశారు. కాంగ్రెస్ లెజిస్లేచర్ కార్యాలయంలో గురువారం ప్రభుత్వ విప్ వేముల వీరేశం, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్ రాజ్ ఠాగూర్, కోరం కనకయ్య కలిసి మంత్రి శ్రీదర్‌బాబు మాట్లాడారు. సింగరేణి ప్రైవేటీకరణ గురించి ప్రస్తావన తెరపైకి తెచ్చిందే కెసిఆర్ అని, తాటిచెర్ల మైన్‌ను ప్రైవేట్ సంస్థకు అప్పగించింది బిఆర్ఎస్ ప్రభుత్వమని ఆయన ఆరోపించారు. బిజెపి బొగ్గగనుల ప్రైవేటీకరణకు చట్టం తీసుకొని రాగా దానికి సహకరించింది ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వమేనని విమర్శించారు. కెటిఆర్, హరీశ్‌రావు సింగరేణి ప్రతిష్టను దిగజార్చే కుట్రలు చేస్తున్నారని, బిఆర్ఎస్ హయాంలో టెండర్లు, కమీషన్ల సంస్కృతిని మొదలుపెడితే ఇప్పుడు అడ్డుకున్నామని వివరించారు. బిఆర్ఎస్ హయాంలో విద్యుత్ సంస్థలకు పెట్టిన బకాయిలను కప్పిపుచ్చుడానికి మాపై బురదజల్లుతున్నారని ఆవేదన చెందారు. పదేళ్ళు సింగరేణికి బకాయిలు ఎందుకు ఎగ్గొట్టారు? అప్పుల ఊబిలోకి ఎందుకు నెట్టారు?విద్యుత్ సంస్థల పేరిట సింగరేణికి వేల కోట్ల బకాయిలు పెట్టిన విషయాన్ని మరిచిపోయారా? బిఆర్ఎస్ హయాంలో కల్వకుంట్ల కుటుంబంలోని సభ్యుల్లో ఒకరు సింగరేణిని తమ జేబుగా చేసుకొని ఇప్పుడు కుంభకోణాలంటూ వారే మాట్లాడుతున్నారనీ ఎద్దేవా చేశారు.

# ఓట్ల చోరీతో అధికారంలోకి రావడానికి బిజెపి కుట్ర : విహెచ్

**హైదరాబాద్, అక్టోబరు15,ప్రభాతవార్త:** ఓట్ల చోరితో రాజ్యాధికారంలోకి రావడానికి బిజెపి కుట్రుల చేస్తోందని రాష్ట్రప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఆరోపించారు. గుజరాత్ మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి గెలిచిందనీ, కాంగ్రెస్ కు అన్ని ఓటములే అని అమిత్ షా అంటున్నారకానీ వాళ్ళు ప్రజాభిమానంతో కాకుండా ఎన్నికల ప్రక్రియను రిగ్గింగ్ చేస్తూ అధికారంలోకి వస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని తప్పులు చేస్తుందనీ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ను పక్కకు జరిపి కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ప్రధాన కమీషనర్ నియామకం చేసుకోవడానికి కుట్ర చేస్తున్నారనీ దుయ్యబట్టారు. నాలుగోసారి మోడీ ప్రధానమంత్రి కావాలనేది బీజేపీ కుట్ర, అందుకే సర్ పేరుతో అర్హుల ఓట్లు తొలగించారని ప్రజాచైతన్యంతో అర్హులకు తిరిగి ఓటు కల్పించేవరకు ఉద్యమాలు జరుగుతాయని నాలుగోసారి మోడీ షా అధికారంలోకి రావడమనేది ఎట్టి పరిస్థితుల్లో జరగదని అన్నారు.



మంజుభార్గవి చేతుల మీదుగా జ్ఞాపికను అందుకుంటున్న చావా దేవిక

# తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చింతల్ బాలిక చావా దేవిక

## 13 యేళ్లకే అద్భుత ప్రతిభ

## రెండు గంటలపాటు నిరంతర శాస్త్రీయ నృత్యప్రదర్శన.. శివార్పణంతో అరుదైన ఘనత

**హైదరాబాద్ (జీడిమెట్ల), అక్టోబరు 15, ప్రభాతవార్త:** చిన్న వయసులోనే శాస్త్రీయ నృత్యంలో అసాధారణ ప్రతిభను చాటుకున్న చింతల్‌కు చెందిన బాలిక (13) చావా దేవిక తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించి అరుదైన ఘనత సాధించింది. పరమశివునికి అంకితంగా శివార్పణం పేరుతో రెండు గంటలపాటు నిరంతరంగా శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేసి కళానైపుణ్యాన్ని చాటుకుంది. ఫ్యూచర్ టీచర్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కళాసంగమం-2026 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14న సాయంత్రం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఈ ప్రత్యేక నృత్యప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నృత్య కళాకారిణి, సినీనటి మంజుభార్గవి ముఖ్యఅతిథిగా హాజరై దేవిక ప్రదర్శనను అభినందించారు. అనంతరం ఆమె చేతుల మీదుగా తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డును దేవిక అందుకుంది. నృత్యగురువు డా. రేవతి ప్రసాద్ మార్గదర్శకత్వంలో దేవిక ఈ ప్రదర్శనను విజయవంతంగా పూర్తి చేసింది. 13 యేళ్ల వయస్సులోనే రెండు గంటలపాటు అలుపెరగకుండా శాస్త్రీయ నృత్యప్రదర్శన చేయడం ఆమె సాధన, ఏకాగ్రత, నృత్యంపై ఉన్న ఆసక్తికి నిదర్శనంగా నిలిచింది.

భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయానికి భక్తిభావాన్ని జోడిస్తూ పరమశివునికి ప్రదర్శనను అంకితం చేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్న వయస్సులోనే నృత్యరంగంలో ఈ స్థాయి గుర్తింపు పొందిన దేవికపై చింతల్‌ప్రాంత ప్రజలు, కళాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిరంతర సాధనతో ప్రతిభను మెరుగుపరుచుకుంటూ తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు. దేవిక భవిష్యత్తులో నృత్య రంగంలో మరిన్ని విజయాలు సాధించి, తన ప్రతిభతో రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు.

# కేంద్రహోంమంత్రిని క్షమించే ప్రసక్తిలేదు.. రాజీనామా చేయాల్సిందే

## మంత్రి పొన్నం ప్రభాకర్ ట్వీట్

**హైదరాబాద్,అక్టోబరు15,ప్రభాతవార్త:** సుప్రీంలో కేంద్రం అఫిడవిట్ దాఖలు చేస్తూ హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సుప్రీంకోర్టులో బేషరతు క్షమాపణలు చెప్పినా దీన్ని దేశ ప్రజలు కేంద్రహోం శాఖ మంత్రి అమిత్‌షాను క్షమించే ప్రసక్తే లేదనీ తక్షణం ఆయన పదవికి రాజీనామా చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఎక్స్ వేదికపై ఆయన ట్వీట్‌చేస్తూ ఇటీవల ఢిల్లీలో జరిగిన ఘటనలపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని చెప్పారు. ఏకంగా సుప్రీంకోర్టును కూడా కేంద్రం తప్పుదారి పట్టిస్తోందనీ ఆగ్రహం వ్యక్తంచేశారు దేశంలో అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు అంటే కూడా కేంద్రానికి కనీస గౌరవం లేదు.. సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా పాటించకుండా ధిక్కరిస్తోంది.. ఈ మొత్తానికి బాధ్యత వహిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నా అంటూ ట్వీట్‌లో పేర్కొన్నారు.

# అన్ని జిల్లాల్లో ఎఐపిసి విస్తరణ

## పదవిగా కాకుండా బాధ్యతగా భావిస్తున్నా

## ఎఐపిసి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మధుయాష్కీగౌడ్

## విడియో కాల్ ద్వారా సందేశం అందించిన సామ్ పిట్రోడా

**హైదరాబాద్,అక్టోబరు15,ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా 50 వేల సభ్యత్వంతో అభివృద్ధి చెందిన 100 అర్బన్ జిల్లాల్లో ఎఐపిసి కమిటీ విస్తరించడానికి కార్యాచరణ ప్రణాళికతో సంస్థాగత నిర్మాణం చేస్తానని దీనిని చైర్మన్ ఒక పదవిగా చూడటం లేదని తన బాధ్యతగా భావించి పనిచేస్తానని ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్ పర్సన్‌గా మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ప్రకటించారు. ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్‌పర్సన్‌గా మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం గురువారం ఢిల్లీలోని ఎఐపిసి భవన్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎఐపిసి మాజీ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి గారి నుంచి మధుయాష్కి బాధ్యతలు స్వీకరించారు. దీపాదాస్ మున్షిగా, రాజ్ పాల్ గౌతమ్, సిడబ్ల్యుసిమెంబర్స్ గురుదీప్ సింగ్ సప్పాల్, రాజ్యసభ ఎంపి దీపేందర్ హుడా, మాజీ ఎంపి ఉదిత్ రాజ్ తదితరులు హాజరయ్యారు. మధుయాష్కీ మాట్లాడు తూ అంబేద్కర్ సూచించిన బోధించు, సమీక రించు, పోరాడు అనే సూత్రంతో ఎఐపిసి రాజకీయ చైతన్య కార్యక్రమాలు ఉంటాయనీ తెలిపారు.

దేశంలో ప్రస్తుతం మోడీ ప్రభు త్వం రాజ్యాంగ హక్కు లను కాలరాస్తున్న తీరు, ప్రజాస్వామ్యం విలువలు మంట కలుపుతున్న తీరుకు వ్యతిరేకంగా ప్రొఫెషనల్స్ ను భాగస్వా మ్యం పెంచేలా పనిచేస్తా మన్నారు. రాహుల్‌గాంధీ విజన్‌కు అనుగుణంగా డెమొక్రటిక్ వాల్యూస్ ను దేశంలో పెంపొందించేందుకు ఎఐపిసి తగిన పాత్ర పోషించేలా కృషి చేస్తామ న్నారు. రాహుల్ గాంధీ కోరుకుంటున్నట్లుగా భిన్నత్వంలో ఏకత్వంగా కొనసాగుతూ.. దేశంలో ప్రతి పౌరుడు స్వేచ్ఛగా, గౌరవప్రదమైన జీవనం సాగించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యమని, ఆ దిశగా పౌర సమాజం, ఎఐపిసి కలిసి పని చేయాల్సిన అవసరం ఉం దని వివరించారు. మాజీ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి దేశంలో ఆధార్ సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో నందన్ నిలేకని తో కలిసి పనిచేశారని గుర్తు చేశారు. మొదటి చైర్మన్ శశిథరూర్. ఆ తర్వాత ప్రవీణ్ చక్రవర్తి బాటలో మరింత బలోపేతం చేస్తానని తెలిపారు.

ప్రవీణ్ చక్రవర్తి మాట్లాడుతూ ప్రొఫెషనల్స్ రాజకీయ రంగంలోకి రాకుండా దూరంగా ఉంటే దేశం ఉన్నతమైన విలువలతో అభివృద్ధి చెందలేదని పేర్కొన్నారు.

ప్రొఫెషనల్ అనుభవం, ఆలోచనలు దేశ నిర్మాణంలో భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రొఫెషనల్స్ కు




గురువారం ఢిల్లీలోని ఎఐపిసి భవన్‌లో ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్

తగిన గుర్తింపు, గౌరవం ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లుగా మరే రాజకీయ పార్టీలోనూ లేదన్నారు. అర్బన్ ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్నప్పుడే జాతీయ స్థాయిలో అధికారంలోకి వచ్చిందని.. అర్బన్ ప్రాంతాలలోనే నివసించే ప్రొఫెషనల్స్ ను ఒక వేదికపై తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. మధుయాష్కి తనకు పాత మిత్రుడని.. అతను సమర్థవంతంగా పనిచేసి బలోపేతం చేస్తాడన్న నమ్మకం ఉందని వివరించారు.

# సంక్షేమ గురుకులాల్లో సరకుల అంతరాయాలకు చెక్

## సరఫరా వ్యవస్థపై నిరంతర పర్యవేక్షణ

## సాంఘిక సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ గురుకులాలు, కళాశాలలు, వసతిగృహాల్లో విద్యార్థులకు అవసరమైన నిత్యావసర సరుకుల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని సాంఘిక సంక్షేమ మంత్రి ఎ లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో సరుకుల సరఫరా, నిల్వలు, పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సరుకులు అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికతో బఫర్ స్టాక్ నిర్వహించాలన్నారు. సరుకుల సరఫరా, నిల్వల పరిస్థితి, క్షేత్రస్థాయి తనిఖీల్లో గుర్తించిన అంశాలు, సరుకుల నాణ్యతకు సంబంధించి సమగ్ర నెలవారీ నివేదికను సమర్పించాలని తెలిపారు. అలాగే విద్యార్థులకు అందజేసే కిట్ల కొనుగోలు, సరఫరా, పంపిణీ ప్రక్రియను కూడా ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు. సరుకుల సరఫరాకు సంబంధించి తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణమే పరిష్కరించాలన్నారు. సరుకుల సరఫరా, నిల్వలు, నాణ్యత, పంపిణీ తదితర అంశాల్లో ప్రభుత్వ స్థాయిలో జోక్యం చేసుకునేలా తీవ్రమైన సమస్యలు ఏవైనా తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం, సౌకర్యాల విషయంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వెల్లడించారు. సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులకు అవసరమైన సరుకులు నిరంతరాయంగా, నాణ్యతతో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

# ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

## కవాడిగూడ, ముషీరాబాద్ యుపిహెచ్‌సిల్లో ఆధునిక వైద్య పరికరాలు అందచేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (ముషీరాబాద్), అక్టోబరు 15, ప్రభాతవార్త:** నిరుపేద ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందించటమే ప్రధాన లక్ష్యమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ముషీరాబాద్ నియోజకవర్గంలో కవాడిగూడ, ముషీరాబాద్ యూపీహెచ్‌సీలలో ఆయన ఆధునిక వైద్య పరికరాలను అంద చే శారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ యూపీహెచ్‌సీ కేంద్రాలలో మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక వైద్య పరికరాల కల్పనపై ప్రత్యే క దృష్టి సారించా మని, అందులో భాగంగా యూపీహెచ్‌సీ కేంద్రాలలో రోగులకు అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని తెలి పారు. ఉచిత మందుల లభ్యత, రోగులకు లభిస్తున్న వైద్యవసతులపై సిబ్బందితో చర్చించారు. రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు ఈసీజీ మెషిన్‌తో కూడిన రెక్లైనర్ బెడ్, బ్లడ్ శాంపిల్స్ సేకరణకు ఫ్లెబోటమీ కుర్చీలు, రోగుల సమాచారం కోసం ఎల్ఈడీ డిస్ప్లే బోర్డులు, గోప్యత కొరకు స్క్రీన్‌లు, శ్వాసకోశ సమస్యలతో బాధపడే పిల్లలు మరియు పెద్దల కోసం ప్రత్యేక నెబ్యులైజర్ యంత్రాలు, రక్తపోటును సరిచూసే బీపీ డిజిటల్ పరికరాలు(10), రక్తంలో చక్కెర స్థాయిలను తక్షణమే పరీక్షించే గ్లూకోమీటర్లు(10), సూదులను సరక్షితంగా విస్ఫోటనం చేసే నీడిల్‌హబ్ కట్టర్లు(10) అందచేసినట్లు తెలిపారు. రోగుల బరువులు కొలిచేందుకు డిజిటల్ యంత్రాలు, స్టీల్ వెయిటింగ్ కుర్చీలు, మంచినీటి డిస్పెన్సర్లు అందుబాటులోకి తీసుకువచ్చి, స్థానిక ప్రజలకు ప్రాథమిక స్థాయిలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు బండ కార్తికారెడ్డి, రమేష్‌రాం, భరత్‌గౌడ్, యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ముషీరాబాద్ యుపిహెచ్‌సిలో ఆధునిక వైద్యపరికరాలను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

# భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ప్రక్షాళన

## 2018 నుంచి క్లెయిమ్‌లపై సమగ్ర విజిలెన్స్ విచారణ

## అక్రమాలకు పాల్పడిన వారెవరైనా ఉపేక్షించం: మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, అక్టోబరు 15,ప్రభాతవార్త:** కార్మికుల సంక్షేమ నిధులను పరిరక్షించడంతో పాటు పరిపాలనలో పారదర్శకతే లక్ష్యంగా కార్మిక శాఖలో సమూల ప్రక్షాళన చేపట్టనున్నట్లు శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియను ప్రక్షాళన చేయడంతో పాటు, ఏళ్ల తరబడి ఒకే చోట తిష్టవేసిన అధికారులను త్వరలోనే బదిలీ చేస్తామని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించిన ప్రతి రూపాయి సక్రమంగా వినియోగమయ్యేలా పటిష్ఠమైన వ్యవస్థను రూపొందిస్తామన్నారు. సచివాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. కార్మిక శాఖలో క్లెయిమ్‌ల ప్రాసెసింగ్‌లో అవకతవకలు జరిగినట్లు గుర్తించిన వెంటనే ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని తెలిపారు. ప్రాథమిక ఆధారాల మేరకు ఇద్దరు అధికారులను ఇప్పటికే సస్పెండ్ చేశామని, వ్యవహారంపై సమగ్ర విజిలెన్స్ విచారణకు ఆదేశించామని వెల్లడించారు. విచారణలో ఎవరిపాత్ర బయటపడినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బోగస్ పత్రాలు, నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా అక్రమంగా క్లెయిమ్‌లు పొందినట్లు ఆరోపణలు రావడంతో 2018 నుంచి ఇప్పటివరకు నమోదైన అన్ని రకాల క్లెయిమ్‌లను సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించినట్లు చెప్పారు. జాయింట్ లేబర్ కమిషనర్ స్థాయిలో ప్రాథమిక విచారణ జరిపి ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకున్నామని వివరించారు. దాని ఆధారంగా విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. తప్పు చేసిన అధికారులు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని, వివిధ సంస్థలు, నిర్మాణదారుల నుంచి వసూలు కావాల్సిన వందల కోట్ల రూపాయల లేబర్ సెస్సును నిబంధనల ప్రకారం పెనాల్టీలతో సహా వసూలు చేస్తామని వెల్లడించారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో సింగరేణిలో ఉద్యోగుల సంఖ్య లక్ష నుంచి 38 వేలకు పడిపోయిందని, దాదాపు 62 వేల ఉద్యోగాలు తగ్గిపోయాయని అన్నారు. ఆ పదేళ్లలో ఒక్క కొత్త బొగ్గు గని కూడా సంస్థకు రాలేదని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అప్పుల ఊబిలోకి నెట్టిందని మంత్రి అన్నారు.

# కమీషన్ల దందాకు అడ్డాగా సిఎంఒ

## తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, అక్టోబరు 15, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి కార్యాలయాన్ని కమీషన్లకు అడ్డగా మార్చేశారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ పనికి 15 శాతం కమీషన్ కావాలంటూ నేరుగా సీఎంఓ నుంచే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆమె మండిపడ్డారు. ఇది నిజంగా సిగ్గుపడాల్సిన విషయమంటూ గురువారం ఎక్స్ లో ట్వీట్ చేశారు. తమ అనుచరులకు, ఆప్తులకు ప్రయోజనం చేకూర్చేందుకు చట్టాన్ని, నిబంధనలను ఏమాత్రం లెక్కచేయటం లేదన్నారు. ఏలాంటి అర్హతలు లేని వారికి కేవలం కమీషన్ల కోసం పనులు కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. ఇది ప్రజాపాలన కాదు. పచ్చి దోపిడీ, లూటీ పాలన అని తెలంగాణ సమాజం ఎట్టి పరిస్థితుల్లో ఈ అరాచకాలను సహించదని హెచ్చరించారు. ప్రజలకు, వ్యాపారులకు రక్షణగా ఉండాల్సిన ముఖ్యమంత్రి, ఆయన ఆఫీస్ నుంచే ఇలాంటి ఆగడాలు జరగటమేంటనీ ఆమె ప్రశ్నించారు. ప్రజలను దోచుకుంటూ కమీషన్ల కోసం బెదిరింపులకు పాల్పడుతున్న వాళ్లను ఎట్టి పరిస్థితుల్లో వదిలేదని లేదన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఈ లూటీకి పాల్పడిన వాళ్లందరిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మహారాష్ట్ర తరహా మహిళా రైతుల సాధికారత చట్టం తేవాలిమహిళా రైతుల కోసం మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విధంగా "మహిళా రైతుల సాధికారిత" చట్టాన్ని..తెలంగాణలోనూ తీసుకు రావాలని కవిత డిమాండ్ చేశారు. గురువారం మహిళా రైతుల దినోత్సవం సందర్భంగా తెలంగాణలో మహిళా రైతుల దయనీయ పరిస్థితి పై ఆవేదన వ్యక్తం చేస్తూ ఆమె ఎక్స్‌లో ట్వీట్ చేశారు. కుటుంబాన్ని చూసుకుంటూనే ఉదయం నుంచి రాత్రి వరకు పొలం, పాడి పనులతో తీరిక లేకుండా శ్రమిస్తున్న వారికి కనీస గుర్తింపు దక్కటం లేదన్నారు. గ్రామీణ ఆర్థిక ప్రగతి చక్రానికి ఇరుసుగా ఉన్న మా ఆడబిడ్డల కష్టాలు, త్యాగాలకు తగిన గుర్తింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన మహిళా రైతుల సాధికారత చట్టం 2026 ను స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ ప్రభుత్వం కూడా చట్టం చేయాలన్నారు. మహిళా రైతులకు, రైతు కూలీలకు చట్టపరమైన గుర్తింపును ఇవ్వడంతో పాటు ప్రభుత్వ పథకాలు, సామాజిక భద్రత ప్రయోజనాలు పొందే అవకాశం కల్పించాలన్నారు. మహిళా రైతుల దినోత్సవం సందర్భంగా సాగులో, వ్యవసాయ అనుబంధ రంగాల్లో 80 శాతం భాగస్వాములుగా ఉన్న మహిళల శ్రమను గుర్తిస్తూ..వారిని గౌరవించుకుందామని పేర్కొన్నారు.

# తెలంగాణ బ్రాహ్మణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఏర్పాటు

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 15, ప్రభాతవార్త:** గ్లోబల్ బ్రాహ్మిణ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (జిబిడబ్ల్యుఎ) ఆధ్వర్యంలో తెలంగాణ బ్రాహ్మణ గ్రాడ్యు యేట్స్ విభాగాన్ని ఏర్పాటు చేశామని అసోసియేషన్ కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ, కో-కన్వీనర్ విజయ్‌కుమార్, కార్యదర్శి వేదాంతి పాండే తెలిపారు. తెలంగాణలో బ్రాహ్మణ పట్టభద్రులనున ఒకే వేదికపైకి తీసుకువచ్చి విదా , ఉద్యోగం అకాశాలు, స్వయం ఉపాధి, సామాజిక సంక్షేమం, నాయకత్వం, ప్రజాస్వామ్య ప్రక్రియలపై అవగాహన కల్పించడం ఈ విభాగం ప్రధాన లక్ష్యమన్నారు.

గురువారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ హైదరబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అభ్యర్థిత్వంపై రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అధికారిక ప్రకటన వెలువడిన తరువాత ఎన్నికల పరిణామాలను పరిశీలిస్తామన్నారు. పట్టభద్రుల నియోజకవర్గాల్లో అర్హులైన ఓటర్లు నమోదు, ఓటరు జాబితా పరిశీలన, ఓటు హక్కు వినియోగం, అభ్యర్థుల ప్రజాసేవా అనుభవం, విద్యావంతుల సమస్యలపై వారి వైఖరి తదితర అంశాలపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 25వ తేదీన బర్కత్‌పురలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశంలో పట్టభద్రుల విభాగం విస్తరణ, సభ్యత్వ నమోదు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించడం జరుతుందని వారు వివరించారు. అర్హులైన బ్రాహ్మణ పట్టభద్రులు ఉచితంగా సభ్యత్వ నమోదు చేసుకోవాలని వివరాలకు 9701609689లో సంప్రదించాలని వారు కోరారు.

# చిన్న సినిమాలను అణగదొక్కుతున్నారు

## నిర్మాత, హీరో షిరాజ్ మెహదీ

## తెలంగాణ విభాగం ఏర్పాటుకు సిఎం రేవంత్‌రెడ్డికి వినతి

**హైదరాబాద్ (రవీంద్రభారతి), అక్టోబరు 15, ప్రభాతవార్త :** సినిమా తీయడం ఒకెత్తయితే దాన్ని థియేటర్లతో విడుదల చేయడం మరోయెత్తని, చిన్న సినిమా నిర్మాతలకు అసలు పరీక్ష సినిమా నిర్మాణంతరం మొదలవుతుందని, అప్పులుచేసి పెట్టుబడులు పెట్టి సినిమా తీస్తున్న నిర్మాతలకు థియేటర్లు దొరక్కపోవడం, ఓటీటీ, శాటిలైట్ హక్కులు విక్రయించుకునే అవకాశాలు లేకపోవడం, చిన్నసినిమాల విషయంలో తెలుగుచిత్ర పరిశ్రమలో వివక్ష కొనసాగడం వెనుకుండి అగణదొక్కుతున్న వారెవరు? అంటూ ఓ అందాల రాక్షసీ హీరో, నిర్మాత షిరాజ్ మెహదీ చేసిన సంచలన ఆరోపణలు పెద్ద చర్చనీయాంశంగా మారాయి. చిన్నసినిమాలకు థియేటర్లు ఇవ్వకుండా, వాటి వ్యాపార అవకాశాలను దెబ్బతీస్తున్నారని, ఆయా నిర్మాతలను ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నారంటూ పరిశ్రమలోని కొందరు ప్రముఖులు, సంస్థల తీరుపై ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చిన్నసినిమాల నిర్మాతల కష్టాలను పట్టించుకునే నాధుడేలేడని తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు. చిన్నసినిమాల వ్యాపార సమస్యలపై ఫిల్మ్‌చాంబర్ బాధ్యత తీసుకోకపోగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని, లీగల్ నోటీసులు పంపినా స్పందన లేదన్నారు. తక్షణమే తెలుగు ఫిలిం చాంబర్ స్థానంలో తెలంగాణ విభాగాన్ని ఏర్పాటు చేయాల్సిందేనని ఆయన ప్రభుత్వానికి సూచిస్తూ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి చిన్న సినిమాలను ఆదుకొని యువతను ప్రోత్సహించాలని షిరాజ్‌మెహదీ విజ్ఞప్తి చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న షిరాజ్ మెహదీ

# ఘట్‌కేసర్‌లో రోడ్డు ప్రమాదం

## రసూల్‌పురా వాసి మృతి

**ఘట్‌కేసర్, అక్టోబరు 15, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓయువకుడు మృతి చెందాడు. హైదరాబాద్‌లోని రసూల్‌పురకు చెందిన ఎస్‌డి.అమీర్ (18) పూల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల13వ తేదీన పని నిమిత్తం ఘట్‌కేసర్‌కు వచ్చి రాత్రి 11:45 గంటల సమయంలో తన డ్యూక్ మోటార్ సైకిల్‌పై గాంధీనగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్తుండగా మసీదు సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అమీర్‌ను ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈనెల14వ తేదీ సాయంత్రం 6:37 గంటలకు మృతి చెందాడు. మృతుడి బంధువు రఫీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి ముందు ధర్నా చేస్తున్న ఆర్.కృష్ణయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్లు

# వర్సిటీల అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి

## ఎంపి, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

## అసిస్టెంట్ ప్రొఫెసర్లతో ఉన్నత విద్యామండలి ముట్టడి

## జిఒ నం 31ని తక్షణమే నిలిపివేయాలి

**హైదరాబాద్ (మెహిదీపట్నం), అక్టోబరు 15, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని రాజ్యసభ సభ్యుడు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య. డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో పనిచేస్తున్న 1200 మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్ పిలుపు మేరకు గురువారం మాసబ్ ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వందలాదిమంది ప్రొఫెసర్‌లు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో ఉన్నత విద్యా మండలి ముందు ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. కార్యక్రమంలో ఆర్.కృష్ణయ్య పాల్గొని మాట్లాడుతూ...యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. హామీలను అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ధర్నాలో డా.పరశురాం, ధర్మ తేజ, వెంకటేశ్వర్లు, బీ.సీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పర్లగొర్ల మోడీరాందేవ్ యాదవ్, సి.రాజేందర్, లింగం యాదవ్‌లు పాల్గొన్నారు.

ఆట



## వరల్డ్ ఛాంపియన్‌షిప్: రెజ్లింగ్‌లో విశ్వజిత్‌కు రజతం

**లాస్‌వెగాస్:** లాస్‌వెగాస్‌లో గురువారం జరిగిన అండర్23 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో, భారత రెజ్లర్ విశ్వజిత్ రామచంద్ర మోర్, గ్రీకోరోమన్ రెజ్లింగ్‌లో భారతదేశానికి మొట్టమొదటి రజత పతకాన్ని గెలుచుకుని చరిత్ర సృష్టించాడు. పురుషుల 55 కేజీల ఫైనల్‌లో జార్జియాకు చెందిన కోబా కరుమిడ్జే చేతిలో అతను స్వల్ప తేడాతో ఓడిపోయాడు. నాటకీయమైన ఫైనల్‌లో జార్జియా క్రీడాకారుడు చివరి క్షణాల్లో విజయం సాధించి, భారత రెజ్లర్‌కు చారిత్రాత్మక స్వర్ణ పతకాన్ని దక్కకుండా చేయడంతో, మోర్ 12-13 తేడాతో ఓడిపోయాడు. అండర్23 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో రెండుసార్లు కాంస్య పతక విజేత అయిన మోర్, రెండు రోజుల క్రితం జరిగిన పోటీలో భారతదేశం తరపున మొట్టమొదటి గ్రీకోరోమన్ ఫైనలిస్ట్‌గా నిలిచి ఇప్పటికే చరిత్ర సృష్టించాడు. ఈ ఎడిషన్‌కు ముందు అండర్23 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో రెండు పతకాలు గెలిచిన దేశం యొక్క ఏకైక గ్రీకో రోమన్ రెజ్లర్ కూడా అతనే. మెక్సికోకు చెందిన ఐజాక్ మారిన్ మాతాపై 10-8 తేడాతో హోరాహోరీగా జరిగిన విజయంతో మోర్ తన ప్రచారాన్ని ప్రారంభించి, ఇరాన్‌కు చెందిన టీ20 ప్రపంచ ఛాంపియన్ అర్మిన్ షమ్సిపూర్‌తో క్వార్టర్‌ఫైనల్ పోరుకు సిద్ధమయ్యాడు.

క్వార్టర్‌ఫైనల్‌లో భారత ఆటగాడు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, 4పాయింట్ల త్రోతో 8-1 తేడాతో విజయాన్ని ఖాయం చేసుకున్నాడు. సెమీఫైనల్‌లో, మోర్ రష్యాకు చెందిన మాలిక్ గిగీవ్‌తో మరో హోరాహోరీ పోరులో తలపడ్డాడు. ఇద్దరు రెజ్లర్లు హోరాహోరీగా తలపడినప్పటికీ, మోర్ తన సంయమనాన్ని కోల్పోకుండా 6-4 తేడాతో విజయం సాధించి ఫైనల్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు.

## డెన్మార్క్ ఓపెన్: వరల్డ్ ఛాంపియన్ చేతిలో శ్రీకాంత్ ఓటమి



**ఒడెన్స్, డెన్మార్క్:** అరీనాలో గురువారం జరిగిన డెన్మార్క్ ఓపెన్ 2026 పురుషుల సింగిల్స్ రౌండ్ ఆఫ్ 16లో కిదాంబి శ్రీకాంత్, 2026 ప్రపంచ ఛాంపియన్ అలెక్స్ లానియర్ చేతిలో ఓడిపోయాడు. ప్రపంచ 31వ ర్యాంకర్ శ్రీకాంత్ న్యూఢిల్లీ విజయం తర్వాత తన మొదటి టోర్నమెంట్ ఆడుతున్న ఏడవ సీడ్ ఫ్రెంచ్ ఆటగాడి చేతిలో గంటా ఆరు నిమిషాల పోరులో 21-11, 15-21, 15-21 తేడాతో ఓడిపోయాడు. శ్రీకాంత్ తన గత రెండు టోర్నమెంట్లలో క్వార్టర్ ఫైనల్ దశకు చేరుకోవడంలో విఫలమయ్యాడు. ఫిన్లాండ్‌లో జరిగిన టోర్నమెంట్లో రౌండ్ ఆఫ్ 32లో, ఆసియా క్రీడల్లో చివరి 16 దశలో అతను ఓడిపోయాడు. ఈ సీజన్‌లో అతని అత్యుత్తమ ప్రదర్శన జూన్‌లో జరిగిన యూఎస్ ఓపెన్‌లో కనిపించింది, అక్కడ అతను చైనీస్ తైపీకి చెందిన సు లి యాంగ్ చేతిలో రన్నరప్‌గా నిలిచాడు. కాగా తదుపరి జరిగే మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో అష్మిత చలిహా, తన్వి శర్మలు బరిలోకి దిగనున్నారు.

## వుహాన్ ఓపెన్: సబలెంకా, పెగులా నిష్క్రమణ





**వుహాన్:** వుహాన్ ఓపెన్‌లో టాప్ సీడ్ అరీనా సబలెంకా, సెకండ్ సీడ్ జెస్సికా పెగులా అనూహ్య ఓటములను చవిచూడగా, చైనాకు చెందిన గ్వో హన్యు డబ్ల్యూటీఏ 1000 టోర్నమెంట్‌లో తొలిసారిగా రౌండ్ ఆఫ్ 16కు చేరుకుంది. ఉత్కంఠభరితమైన పోరులో మూడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన సబలెంకాను 3-6, 6-4, 7-6 (5) తేడాతో ఓడించి, అమెరికన్ క్రీడాకారిణి ఆన్ లీ ఆమె నాలుగో వుహాన్ ఓపెన్ టైటిల్ ఆశలకు తెరదించింది. సబలెంకా 35 నిమిషాల్లో తొలి సెట్‌ను కైవసం చేసుకోగా, లీ పుంజుకుని మ్యాచ్‌ను సమం చేసింది. ఆ తర్వాత నిర్ణయాత్మక సెట్‌లో 2-5తో వెనుకబడిన ఆ బెలారసియన్, ఐదు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని తన సర్వ్‌ను నిలబెట్టుకుంది. తిరిగి బ్రేక్ చేసి, మరో రెండు మ్యాచ్ పాయింట్లను ఎదుర్కొని టైబ్రేక్‌కు దారితీసింది. నిర్ణయాత్మక దశలో లీ అనూహ్య విజయాన్ని సాధించింది. గత సంవత్సరం వుహాన్‌లో రన్నరప్‌గా నిలిచిన పెగులా కూడా, లాట్వియాకు చెందిన జెలెనా ఒస్టాపెంకో ఒక సెట్ వెనుకబడినప్పటికీ పుంజుకుని 2-6, 7-6 (7), 6-3 తేడాతో గెలవడంతో టోర్నమెంట్ నుండి నిష్క్రమించింది. పెగులా తొలి సెట్‌ను 6-2తో గెలుచుకున్నప్పటికీ, ఒస్టాపెంకో పుంజుకోవడంతో మ్యాచ్‌ను ముగించలేకపోయింది.

చైనాకు చెందిన గ్వో మరో పట్టుదలగల ప్రదర్శన కనబరిచి, అమెరికన్ కేటీ వోలినెట్స్‌ను 6-4, 4-6, 7-6 (3) తేడాతో ఓడించి, తొలిసారిగా డబ్ల్యూటీఏ 1000 ఈవెంట్‌లో చివరి 16 మందిలోకి ప్రవేశించింది.





# టీ20ల్లో తొలి ఆసియా జట్టుగా భారత్

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలో భారత క్రికెట్ జట్టు మరో అరుదైన ఘనతను సాధించింది. హైదరాబాద్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన నాల్గో టీ20 మ్యాచ్ సందర్భంగా టీమిండియా సరికొత్త రికార్డును తన పేరుతో లిఖించుకుంది. అంతర్జాతీయ టీ20 ఫార్మాట్‌లో ఏకంగా 2 వేల సిక్సర్లు బాదిన ప్రపంచంలోని రెండో జట్టుగా భారత్ నిలిచింది. అదే సమయంలో ఆసియా ఖండం నుంచి ఈ అరుదైన మైలురాయిని అందుకున్న మొట్టమొదటి దేశంగా చరిత్ర సృష్టించింది. ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతూ భారత బ్యాటర్లు సృష్టించిన సిక్సర్ల సునామీకి ఈ రికార్డు నిదర్శనంగా నిలిచింది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన జాబితాలో వెస్టిండీస్ జట్టు ప్రపంచంలోనే అగ్రస్థానంలో కొనసాగుతోంది. కరీబియన్ జట్టు ఇటీవల జరిగిన మ్యాచ్‌లలోనే ఈ రికార్డును మొట్టమొదటిసారిగా సాధించింది. ప్రస్తుతం వెస్టిండీస్ ఖాతాలో 2,026 సిక్సర్లు ఉండగా, నాల్గో మ్యాచ్‌లో అద్భుతంగా రాణించిన టీమిండియా ఆ సంఖ్యను అధిగమించే దిశగా అడుగులు వేస్తూ మొత్తం 2,010 సిక్సర్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఈజాబితాలో 1,585సిక్సర్లతో న్యూజిలాండ్ మూడోస్థానంలో ఉండగా, పాక్1,507 సిక్సర్లతో నాల్గోస్థానంలో, సౌతాఫ్రికా 1,407 సిక్సర్లతో ఐదో స్థానంలో నిలిచాయి. ఇక వెస్టిండీస్‌తో జరిగిన నాల్గో టీ20 మ్యాచ్‌లో భారత బ్యాటర్లు మరోసారి తమ పవర్ హిట్టింగ్ సామర్థ్యాన్ని ప్రదర్శించారు. ఈ మ్యాచ్‌లో భారత జట్టు మొత్తం 13 సిక్సర్లు బాదింది. ఇందులో డాషింగ్ ఓపెనర్ సంజూ శాంసన్ 4 సిక్సర్లు కొట్టగా, ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ కూడా అంతే జోరుతో 4 సిక్సర్లు సాధించారు. అలాగే యువ సంచలనం తిలక్ వర్మ 3 సిక్సర్లు బాదగా, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ తలా ఒక సిక్సర్ చొప్పున బాదారు. మరోవైపు వెస్టిండీస్ జట్టు ఈ మ్యాచ్‌లో ఏకంగా 17 సిక్సర్లు బాదడం విశేషం. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత చిన్నదైన టీ20 ఫార్మాట్‌లో పవర్‌ప్లే ఓవర్లలో దూకుడుగా ఆడటం, డెత్ ఓవర్లలో భారీ సిక్సర్లు బాదడం ద్వారా భారత బ్యాటర్లు ఈ అసాధారణ మైలురాయిని చేరుకోగలిగారు. ఆసియా దేశాలన్నింటిలోనూ సిక్సర్ల కొట్లలో మరే ఇతర దేశం కూడా ఈ స్థాయికి చేరుకోలేకపోయింది. ఈ చారిత్రక రికార్డుతో భారత జట్టు అంతర్జాతీయ స్థాయిలో తన సత్తాను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది.

# నేటి నుండి టీ20 సిరీస్

### జింబాబ్వేతో భారత్ ఢీ

**న్యూఢిల్లీ:** స్మృతి మంధాన స్వదేశంలో జింబాబ్వేతో జరిగే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌తో భారత మహిళల క్రికెట్ జట్టు పూర్తిస్థాయి కెప్టెన్‌గా తన పదవీకాలాన్ని ప్రారంభించనుంది. భారత్, జింబాబ్వే మధ్య జరిగే మూడు టీ20 మ్యాచ్‌లు రాయ్‌పూర్‌లో జరగనున్నాయి. ఈ సిరీస్ అక్టోబర్ 16న ప్రారంభం కానుంది. రెండో మ్యాచ్ అక్టోబర్ 18న జరగనుండగా, అక్టోబర్ 20న సిరీస్ ముగుస్తుంది.





భారత్ జట్టులో స్మృతి మంధాన కెప్టెన్‌గా షఫాలీ వర్మ వైస్ కెప్టెన్‌గా నియమితులయ్యారు. గత నెల ఐచిన‌గోయాలో తమ ఆసియా క్రీడల టైటిల్‌ను విజయవంతంగా కాపాడుకున్న తర్వాత భారత్‌కు జింబాబ్వే సిరీస్ తొలి సిరీస్ కానుంది. అన్ని ఫార్మాట్లలోనూ భారత కెప్టెన్సీ నుంచి హర్మన్‌ప్రీత్ కౌర్ వైదొలగిన తర్వాత ఈ నాయకత్వ మార్పులు చోటుచేసుకున్నాయి. అయితే, మాజీ కెప్టెన్ క్రీడాకారిణిగా కొనసాగుతూనే ఉంటారు. ఇక టీమిండియాకు పలు బలహీనతలు ఉన్నాయి. ఓపెనర్లు స్మృతి మంధాన, షెఫాలి వర్మ ఇస్తున్న మెరుపు ఆరంభాన్ని మిడిల్ ఓవర్లలో కొనసాగించడంలో బ్యాటర్లు తడబడుతున్నారు. మూడో నంబర్ స్థానం కోసం అనేక ప్రయోగాలు జరుగుతుండగా, మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పేలవ ఫామ్ జట్టును ఆందోళనకు గురి చేస్తోంది. ప్రస్తుతం ఆమె కేవలం స్పెషలిస్ట్ బ్యాటర్ గానే ఆడుతుండటంపై ఒత్తిడి నెలకొంది. ఇక రిచా ఘోష్కు తోడుగా లోయర్ ఆర్డర్లో భారీ షాట్లు కొట్టే పవర్ హిట్టర్లను తయారు చేయాల్సిన అవసరం ఉంది. మరోపక్క ఫీల్డింగ్, పేస్ బౌలింగ్ లోపాలు ఉన్నాయి. ఫీల్డింగ్‌లో నిలకడలేమి జట్టును తరచూ దెబ్బతీస్తోంది. స్పిన్ విభాగం బలంగా ఉన్నప్పటికీ, పేస్ అటాక్లో పదును పెరగాల్సిన అవసరం ఉంది. యువ సంచలనం నందిని శర్మ రాణిస్తుండటం సానుకూలాంశం. కాగా జింబాబ్వే సిరీస్‌కు కొత్త ఆటగాళ్లకు ఛాన్స్ వచ్చింది శ్రీ చరణి స్పిన్ ప్రదర్శన ఆకట్టుకోగా, లెగ్ బ్రేకర్ బౌలర్ ప్రేమా రావత్కు మరిన్ని అవకాశాలు ఇవ్వాలని భావిస్తున్నారు. ఈ జట్టులో నికి ప్రసాద్, జింతిమణి కలిత లాంటి కొత్త ముఖాలకు చోటు దక్కింది. జింబాబ్వే జోరుతో ఉంది. జోసెఫిన్ ఎన్కోమో నాయకత్వంలో బరిలోకి దిగుతున్న జింబాబ్వే జట్టు, గత నెలలో వెస్టిండీస్‌పై వన్డే విజయం సాధించిన జోరు మీద ఉంది. కాబట్టి ఈ టూర్‌ను తక్కువ అంచనా వేయలేం.

వాణిజ్యం



# ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.13.38 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, అక్టోబరు 15:** భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉన్నట్లు సూచిస్తూ ప్రత్యక్ష పన్నుల వసూళ్లలో భారీ వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈనెల 14 నాటికి నికర ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.13.38 లక్షల కోట్లకు చేరాయి. గత యేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 13.21 శాతం అధికమని ఆదాయ పన్ను శాఖ నేడు విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కార్పొరేట్ పన్ను, నాన్ కార్పొరేట్ పన్ను అంటే వ్యక్తిగత ఆదాయ పన్ను, సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ఎస్‌టిటి వసూళ్లు పెరగడమే ఈ వృద్ధికి ప్రధాన కారణంగానిలిచింది. రిఫండ్‌లను సర్దుబాటు చేయక ముందు, స్థూల ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 14.89 శాతం పెరిగి రూ.16.03 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో ఈ వసూళ్లు రూ.13.95 లక్షల కోట్లుగా ఉన్నాయి. మరోవైపు ఈ యేడాది పన్ను చెల్లింపుదారులకు జారీ చేసిన రిఫండ్‌లు కూడా గణనీయంగా పెరిగాయి. గతేడాదితోపోలిస్తే రిఫండ్‌లు 24.22 శాతం పెరిగి రూ.2.65 లక్షల కోట్లకు చేరినట్లు ప్రభుత్వ డేటా వెల్లడించింది. నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.4.97 లక్షల కోట్ల నుంచి రూ.5.99 లక్షల కోట్లకు పెరిగాయి. వ్యక్తులు, ఇతర సంస్థలు చెల్లించే నాన్‌కార్పొరేట్ పన్నుల నికర వసూళ్లు రూ.6.54 లక్షల కోట్ల నుంచి రూ.6.92 లక్షల కోట్లకు చేరాయి. ముఖ్యంగా స్టాక్ మార్కెట్ లావాదేవీలపై విధించే ఎస్‌టీటీ నికర వసూళ్లు రూ.30,901 కోట్ల నుంచి రూ.46,840 కోట్లకు పెరిగి బలమైన వృద్ధిని నమోదు చేశాయి. స్థూల వసూళ్లలోనూ ఇదే ధోరణి కనిపించింది. గ్రాస్ కార్పొరేట్ ట్యాక్స్ కలెక్షన్లు రూ.6.44 లక్షల కోట్ల నుంచి రూ.7.53 లక్షల కోట్లకు, గ్రాస్ నాన్‌కార్పొరేట్ ట్యాక్స్ వసూళ్లు రూ.7.20 లక్షల కోట్ల నుంచి రూ.8.03 లక్షల కోట్లకు పెరిగాయి.




# జియో ఐపిఒ 21న షురూ

### ఒక్కోషేరు ధర రూ.1065-1,119: జియో చైర్మన్ ఆకాష్ అంబాని



**ముంబయి, అక్టోబరు 15:** భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన వాటాను సాధించడమే లక్ష్యంగా రిలయన్స్ జియో ముందుకు సాగుతోందని రిలయన్స్ జియో చైర్మన్ ఆకాష్ అంబానీ తెలిపారు. 2031 నాటికి భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విలువ 1.4 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఆయన అంచనా వేశారు. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపిఒకు ముందు గురువారం నిర్వహించిన మీడియా మీట్‌లో భారత్‌ను ప్రపంచస్థాయి డిజిటల్ సమాజంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో జియో పనిచేస్తోందని ఆయనపేర్కొన్నారు. జియో ప్లాట్ ఫామ్స్ తన ఐపిఒద్వారా గరిష్ఠంగా రూ.30,213 కోట్లను సమీకరిం చాలని లక్ష్యంగాపెట్టుకుంది. ఈ పబ్లిక్ ఇష్యూ ఈనెల 21న ప్రారంభమై 23న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్ల కోసం 19న బిడ్డింగ్ ప్రక్రియ జరుగుతుంది. దేశంలోని ప్రతి ఇంటికి, ప్రతి పౌరుడికి, ప్రతి వ్యాపార సంస్థకు నాణ్యమైన, అందుబాటుధరల్లో డిజిటల్ సేవలను అందించడమే జియో ప్రధాన లక్ష్యమని ఆకాష్ అంబానీ తెలిపారు. కృత్రిమ మేధ (ఎఐ), క్లౌడ్ కంప్యూటింగ్, ఇతర డిజిటల్ సాంకేతిక రంగాల్లోకి విస్తరిస్తూ భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని సంస్థ భావిస్తోందని చెప్పారు. భారతదేశ డేటావినియోగంలో 60 శాతానికి పైగా జియో వాటా ఉందని ఆయన పేర్కొన్నారు. ఐపిఒ ద్వారా సమీకరించే మొత్తాన్ని పూర్తిగా రుణాల చెల్లింపునకు వినియోగిస్తామని, తద్వారా నికర రుణరహిత సంస్థగా మారేందుకు కృషి చేస్తామని ఆకాష్ అంబానీ వెల్లడించారు. జియో ప్లాట్‌ఫామ్స్ భారత్‌తో పాటు విదేశాల్లో మొత్తం 7,220 పేటెంట్ దరఖాస్తులను సమర్పించి నట్లు ఆకాష్ అంబానీ తెలిపారు. ప్రపంచ మేధో సంపత్తి సంస్థ 2025 పేటెంట్ కోఆపరేషన్ ట్రీటీ ర్యాంకింగ్స్‌లో ప్రపంచంలోని టాప్20 పేటెంట్ దరఖాస్తుదారుల్లో చోటు దక్కించుకున్న ఏకైక సంస్థగా జియో నిలిచిందన్నారు. జియోప్లాట్‌ఫామ్స్ ఐపిఒలో ఒక్కో షేరుకు రూ.1,065 నుంచి రూ.1,119 ధరల శ్రేణిని నిర్ణయించింది. గరిష్ఠ ధర వద్ద ఐపిఒ ద్వారా రూ.30,213 కోట్లు సమీకరించే అవకాశం ఉంది. ఈ ధర ప్రకారం సంస్థ విలువ సుమారు రూ.10.3 లక్షల కోట్లు అంటే దాదాపు 108.3 బిలియన్ డాలర్లుగా ఉంటుంది. ఈ ఐపిఒలో రూ.10 ముఖ విలువ కలిగిన గరిష్ఠంగా 27 కోట్ల కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నారు. ఇది ఫ్రెష్ ఇష్యూ కావడంతో, షేర్ల విక్రయం ద్వారా వచ్చే మొత్తం ప్రస్తుత వాటాదారులకు కాకుండా నేరుగా సంస్థకు అందుతుంది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.